Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

రామశాస్త్రులు, పార్నంది

శ్రీమహాభారతవిమర్శనము

మదరాసు, 1915

Record no. 702

Rāmaśāstrulu, Pārnandi

Śrīmahābhāratavimarśanamu

Madarāsu, 1915

Record no. 702

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

రామశాస్త్రులు, పార్నంది.
శ్రీమహాభారతవిమర్శనము : ఉద్యోగ పర్వము / గ్రంథకర్త పార్నంది రామశాస్త్రులుగారు.- మదరాసు : వేదం అండు కంపెనీ, 1915.
(1), 130 p. ;18 cm.
Record no. 702

Rāmaśāstrulu, Pārnandi.
Śrīmahābhāratavimarśanamu : Udyōga Parvamu / granthakarta Pārnandi Rāmaśāstrulugāru.- Madarāsu : Vēdaṃ aṃḍu Kampenī, 1915.
(1), 130 p. ;18 cm.
Record no. 702

35 mm microfilm
Image placement: IA (IIA) IB IIB Date filming began:

శ్రీమహాభారతవిమర్శము.

(ఉద్యోగపర్వము.)

గ్రంథకర్త.

బ్రహ్మశ్రీ పార్నంది. రామశాస్త్రులుగారు.

శ్రీ ర స్తు.

శ్రీ మ హా భా ర త వి మ ర్శ ము.

(ఉద్యోగ పర్వము)

గ్రంథకర్త

బ్రహ్మశ్రీ - పార్నంది రామశాస్త్రులుగారు.

వేదం అండు కంపెనీవారిచే

ముద్రింపఁబడెను

1915

మదరాసు.

దీనివెల] [అణాలు 0-8-0.

INTRODUCTION.

In my college days I spent many useful hours with the learned author of this book in the study of Sanskrit and Telugu Classics and in introducing his work to the Telugu public, I feel I am discharging a duty Sacred to the Hindu mind.

The line of criticism taken by the learned Pandit in this book is rare in recent Telugu Literature and the style of Composition is deliberately adapted to the literary equipment of the lay reader.

An exhanstive exposition of the wonderful play and interplay of the Consummate characters of Dhritarashtra, Udhishtira, Sanjaya & Krishna and a clear sketch of the features of character which distinguish Sanjaya and Krishna as embassadors form the main theme of this criticism. Linguistic questions have been dealt with so far as they bear on the interpretation of character.

The discussion of the Problem of "Kurupandava Dayabhagam" has been given incidentally and it may seem a little bit too learned for the lay reader; but in any systematic exposition of Bharatham of the kind attempted here; it would be regarded as improper to leave this topic out of Consideration.

I would earnestly commend to students of the Telugu Bharatam, the eager spirit of enquiry and thorough bred urbanity which characterises the writing of this learned author little known to the world's "Madding crowd".

Madras, 25—7—1915. } B. SESHAGIRI RAO, M.A.

శ్రీ

శ్రీమహాభారతవిమర్శము

ఉద్యోగపర్వము, ప్రథమాశ్వాసము.

5. క॥ విరటుఁడుఁ బాంచాలుండును, హరియును రాముండు వారియనుజతనూజుల్
పరిణయసమాగతాఖిల, ధరణీశులుఁ గొలిచియుండఁ దద్దయు నెమ్మిన్.

ఈ పద్యములోఁ గర్త యెద్దియో కర్మ యెద్దియో తెలియరాకున్నది మీఁది దానివలన యుధిష్ఠిరుఁడు కర్త కావలయు.

6. వ. అన్నసమయంబున సభాసదులై మానవేంద్రులు నానావిధంబులఁ గృష్ణయుధిష్ఠిరులతో సంభాషణంబులు సేయుచుండఁ బాండవకార్యార్థులై కృష్ణుండు తదీయవచనంబులు వారించి వారలం గలయం గనుంగొని యిట్లనియె. అని యున్నది.

ఇందు శ్రీకృష్ణులు తన్నుఁ బాండవులు కోరకయే తాను స్వయముగా రాజులసంభాషణంబులు వారించి పాండవ కార్యార్థము దూత నంపువిషయముఁ బ్రసంగించినందునఁ బాండవపక్షపాతి యగుట స్పష్టము.

శ్రీకృష్ణవచనములలో ''ధార్తరాష్ట్రులకును వీరికిని హితమగునట్లును ధర్మము దప్పని మార్గము దలంపవలయుననియు పాండవుల పితృధనంబగు రాజ్యంబు కపట ద్యూతంబున దుర్యోధనుండు హరించుటయు, నది వీరలు దిగ్విజయంబుఁ

జేసి తలవరించుకొన్నవదం బగుటయు; ధర్మసూను మహానుభావంబు విచారింపక ధార్తరాష్ట్రులు పరిభవించినం దెగి యితంపు వారలకుం గీడుసేయ రోయమియు, మీరెఱుంగుదురు ఈ రెండు దెఱంగులవారికిం బంచి కుడువం దగుటయుం దలపోసి తగినకార్యంబు సెప్ప నర్హులరైనను నాకన్నంత సెప్పెద వినుండు.

పాండవులు సమయముఁ దీర్చికొని తమభుజాబలమును శౌర్యమును నెఱిగింతుమనుచున్నవారు. వీరితలంపు దెలిసినఁ గౌరవులును తమమిత్రవర్గమును గూర్చికొనుదురు. మఱియును వీరు కొంచెము సహాయము గలవారై యుండఁగానే వీరిని యుద్ధములో సంహరింతుమని తలచియుందురు. కావునఁ బాండవపక్షమువారందఱును వీరియొద్దఁ గూడఁగా వారికిని వీరికిని దేవాసురలకువలె యుద్ధము జరగి తెగుదురు. వ 17 ఇది యిక్కడికార్యమురీతి తోఁచుచున్నది. హరిచిత్తవృత్తి యెట్లో యెఱుంగక కార్యనిశ్చయము కాదు కావున నిప్పుడు తగిన దూతను బంపవలయు. దుర్యోధనుఁడు వీరిపాలు వీరికిచ్చుటమేలు కానిచో నప్పటి కుచిత మాలోచించుకొందము.

అను శ్రీకృష్ణవాక్యములలో "తగిన కార్యంబు సెప్ప నర్హులరు అనిరాజులతో" జెప్పి వెంటనే కార్యమును తానే నిర్ణయించుట కాన్పించుచున్నది కదా! ఇచట శ్రీకృష్ణాభిప్రాయమేమి? ఆలోచింతము.

మీఁద నొకచోటను పాండవులపితృధనం బగురాజ్యంబు కపట ద్యూతంబున దుర్యోధనుండు హరించినాఁడు" అనుటను, వీరలు విజృంభించి కౌరవుల నిర్జించుటయే యుచితమని నిశ్చయింపకుండుటను పాండవులు సమయముఁ దీర్చికొని తమ భుజాబలమును శౌర్యము నెఱిగింతుమనుచున్న వారనుటను, పాండవులుపేక్షింపకుండుటకును, లేక అప్పుడే తమసమయ కాలములోను పడిన యిడుములను స్మరించి వారిపైనెత్తిపోఁ దలంపకుండుటకును, వీ రిప్పుడు కొంచెము సహాయము గలవారై యుండ వారు వీరిని సంహరింపఁదలంచియుందురనుటను, వీరికి రాజులెల్లవారును సహాయపడుతలంపుగలవారగుటకును. వారికిని వీరికిని దేవాసురులట్లు యుద్ధము జరగి తెగుదురు, అనుటను ధర్మరా జందుకు సహింపక రాజ్యమును విడిచికొని యూరకున్నను వీరి కారాజ్యము పితృధనముగాని స్వార్జితము గాదు. దానిని వీరు నిలుపుకొన్నవారు గాని యార్జించినవారు కారు. ఇట్టి రాజ్యమును ధర్మరాజుపేక్షించినను కౌరవులు వీరితండ్రిభాగము వీరికియ్యకున్నను, వీరిపుత్రులనయిన నవలంబించి కౌరవుల నిర్జించి వీరిభాగము వీరికిప్పించుట న్యాయ్యమని తోఁచుటకును, అట్లు శ్రీకృష్ణులు చెప్పియుందురు. రాజనీతిప్రకారము మొదలసంధికిఁ బ్రయత్నింపవలయునని దూత నంపుమని నిశ్చయించియుందురు.

"ఈ రెండు తెఱంగులవారికిం బంచికుడువందగుటయుం దలపోసి" అనుటలో శక్యమైనంత మనము సంధికే మొదల బ్రయత్నింపవలయుననుట స్పష్టము.

పురోహిత బ్రాహ్మణుఁడు కౌరవులసభకుఁ బోయి తనకృత్యమున కనురూపముగాఁ జెప్పి యచ్చటి వారల వచనములను విని వారి యభిప్రాయమును దెలిసికొని మరల వచ్చి పాండవులతో సంధి కానేరదని చెప్ప వారు సహాయులను కూర్చికొని యుపప్లావ్యములో నుండగా.

ధృతరాష్ట్రుఁడు సంజయునిఁ బంపుట.

259. తే. పాండునరనాథసుతు లుపప్లావ్యమునకు,
వచ్చియున్నారు నీవేగి వాసుదేవ
సహితముగ వారిఁ గని తద్విషాద మేమి,
భంగిఁ బాయు నట్టియుఁ దగఁ బలుక వలయు.

271. క. నెయ్యము వాటించి కదుం దియ్యమెసఁగ, నలుక లెల్లఁ దీఱెడునటుగాఁ
గయ్యమునఁ దలఁపులోనుగ నయ్యమ, నందనుఁడుమాను నట్టి తెఱఁగుగాన్.

260. క. మీ యయ్య మీరు వనవా, సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముండై యుట్టఁబుత్తెంచె నన్ను నను మీ మొదలన్.

అని చెప్పి చుట్టు నున్నవారలతో నిట్లనియె.

262. క. దుర్యోధనుండు గార్యాకార్యజ్ఞుఁడు గామి నట్టి కలక గలిగెగా
కార్యులు దృఢధైర్యులు రణధుర్యులు, నగుపాండుసుతులు దోషాన్వితులే.

263. క. క్షీరోదకగతి మనమును, వారలునుం గలసి బ్రదుకవలవదె నెమ్మిన్
వారిడుములఁ బడఁ దగియెడు, వారే పితృభాగమేలువారలు గారే.

ఇందు "క్షీరోదకగతి మనమును వారలునుం గలసి బ్రదుకవలదే నెమ్మిన్" అనుదానిలో ఉదకము క్షీరములో, జేరినట్లు వారు మనలోఁ జేరి మనకు లోఁబడి యుండునట్లని తనయభిప్రాయము కావచ్చును.

264 గీ. మనలనింకనమ్మరన్యాత్ములన్యాయ, పరులుగర్వులనుచుఁ బాండుసుతులు
గూడిమనుటకియ్యకొనఁ జేరరైనను, ధర్మజుఁడు గలఁడు తగవు నడుప.

అని పలికి వెండియు.

266. మ. మన కీపండఁగ వచ్చునే మనము దుర్మానంబు వాటించి యొ
ప్పని కార్యంబులు నట్టివారికిఁ దగం బాలీక గర్వంబు లా
డిన నిక్కం బగు నల్క నర్జునుఁడు గాండీవంబు మోపెట్టి కృ
ష్ణునిసారథ్యముపై జగత్త్రితయసంక్షోభంబు గావింపఁడే.

అను మీఁదిదానిలో ధృతరాష్ట్రుని యభిప్రాయము పాండవులకు వారిభాగమిచ్చివేయుటకై యుండునా ? లేదా ? అయితే సంజయునితోఁ దాను చెప్పుమాటలలో నెచ్చటను "మీ భాగము మీకిచ్చివేయుచున్నాను రండు" అనుమాటయొక్కటియును కానరాదు. కావున నతనియభిప్రాయమేమి ? సంజయునిఁ బంపుటకును కారణమేమి ? ఆలోచింపవలయు.

పాండవులు సమయమును నిస్తరించి విరటునితో సంబంధులై శ్రీకృష్ణద్రుపదాది రాజలోకముతోఁ గూడి యుపప్లావ్యమున నున్నట్లు తెలిసి వారెత్తినచ్చుటకు ప్రతిబంధము తీఱునమయమై యున్నందున వారట్లు వచ్చినచోఁ దమవారికి నాశము తప్పదనుభీతిచేతను, దుర్యోధనుని నిరాకరించి వారిరాజ్యభాగమియ్యఁజాలకయును ధర్మరాజును శుష్కప్రియములచేతనైన దేర్చిచూత మనుదురాశచే నట్లు చేసియుండవలయు శుష్కప్రియము లెట్లనఁగా దాను చెప్పుమాటలలో మొదలనే పాండవులుపప్లావ్యమునకు వచ్చియున్నారు వారివిషాద మేరీతిని బాయునో

అప్రీతిని బలుకుమని చెప్పినాఁడు కాని చేయుమని చెప్పలేదు. వారు రాజ్యభోగములను విడిచికొని పదుమూఁడు సంవత్సరములు ఇడుముల ననుభవించి "సమయ మెప్పుడు తీఱును? ఎప్పుడు మా రాజ్యమును మేము పొందుదు"మను నాశతో నున్న వారికి రాజ్యమిచ్చినచో విషాదము తీఱును కాని మాటలతోఁ దీరునా?

మఱియు

క. నెయ్యము నాటించి కడుం, దియ్యము మెఱపఁగ నలుక లెల్లఁ దీఱెడునటు గాఁ
గయ్యమునుతలఁపు లోనుగ, నయ్యము చంపనుఁడు మానునట్టి తెఱఁగు గాన్.

అనుదానిలోఁ దియ్యని మాటలతోనే తృప్తినొంది ధర్మరాజు యుద్ధపుఁదలంపు మానుకొను నట్లు చేయుమనుటను ఆతని కపటము దురాశయు స్పష్టమగుచున్నవి. సంజయునిఁ బంపుటయును వట్టిమాటలతోఁ దీర్చుటకే కాని భాగమిచ్చుటకు కాదు.

"మనకీకుండఁగవచ్చునే" అనుదానిలో మనము భాగమియ్యకుండఁదగునా" అని యచ్చటివారికిఁ బ్రియమగునట్లు పలికిన వంచనావాక్యమే కాని యథార్థము కాదు. "తగంబాలీక గర్వంబులాడిన నిక్కంబగు నర్జునుఁడు గాండీవంబు మోపెట్టి కృష్ణుని సారథ్యమునై జగత్త్రితయసంక్షోభంబుఁ గావింపఁడే" అని తా నర్జునునకు భయపడి పాలీయక పోవుటయే గాక గర్వపు మాట లాడినచో నర్జునుఁడు తమవారిని సంహరించునని యే తియ్యనిమాటలచేతనైన వారిని తీర్చుమని సంజయునితో నట్లే చెప్పి పంపఁదలచియుండును. అందుకే సంజయుఁడును, ధృతరాష్ట్రుని యభిప్రాయము తెలిసికొనియే ధర్మరాజుతో నట్లే చెప్పెను.

సంజయుఁ డుపప్లావ్యమున ధర్మరాజును స్తుతించుట.

273. గీ. భాగ్యమున నిన్నుఁ గనుఁగొనఁ బడసి నాదు
చూడ్కి చరితార్థమయ్యె నస్తోకపుణ్య
ధనుఁడు మీతండ్రి ధృతరాష్ట్ర ధరణినాథుఁ
డిందు మీయునికి విని ప్రియ మొసఁగ మనఁగ.

ఇందు ధృతరాష్ట్రుఁడు పాండవులయెడలఁ బ్రీతిగలవాఁడై యున్నట్లు కనుపఱచినాఁడు.

ధర్మరాజు ధృతరాష్ట్రక్షేమ మడుగుట.

276. క. ఆ రాజు మాదెసం గల, కారుణ్యముకతమునను సుఖంబున నిట్లు
న్నారము నీవుఁ బుత్తెంచిన, గారవమున నాదుమది వికాసము నొందెన్.

ఇందు సంజయుని మాటకనురూపముగాను, సంజయుఁడు తన్నుఁ జూచినందునం దన చూడ్కి చరితార్థమైనదని చెప్పినందున నందుకు బదులు, నిన్ను గౌరవముతో, బంపినందుకు నా మనము వికాసమొందెనని ప్రౌఢముగాను గూఢాభిప్రాయముగాను పలికి

277. క. అమ్మనుజేశ్వరునకు నే, మమ్మే పుత్రకులు సుఖులె మనుమలు సమ్మో
దమ్మునఁ బెరిగెద రే నగ, రమ్మున జనులకును సుఖపరంపర గలదే.

ఇందు ధర్మరాజు ప్రియవచన చాతుర్యము సంజయుని మించియున్నది. సంజయుని మాటలలో ధృతరాష్ట్రునకు పాండవులయెడఁ బ్రేమాతిశయము గనుపఱుచుట "ధర్మరాజు మాటలలో ధృతరాష్ట్రుని కపటప్రేమకు నంతకు మిక్కుటముగఁ దాను ప్రేమయు భక్తిని గనుపఱుచుటయును తెలియఁబడును.

ధృతరాష్ట్రుఁడు ధర్మరాజు కుటుంబక్షేమమాత్రమునకు

గుట ధర్మరాజు ధృతరాష్ట్రుని కుటుంబ, పరివారనగరజనుల యు క్షేమమడుగుట.

278. సీ. ద్రోణుండు గృపుఁడును ద్రోణసుతుండును, సుఖమున్న వారె యశ్లోకుఁడైన
భీష్ముండు కుశలియె పెద్దతనం బిచ్చి, యాతని గౌరవు లనుసరించి
మెలఁగుదురే బ్రాహ్మణులకు మన్ననగల్గి, యుండునె యే మద్ధి నొసఁగినట్టి
వృత్తులు సెల్లునే యెత్తరు వొద్దుల, నలవఁ బుట్టదుగదా కెలఁకులందుఁ
బుట్టినప్పుడు గాండీవి భుజబలంబుఁ, దలఁతురే భీమసేను గదావిహార
ముగ్గడింతురె కవలు మహోగ్రరిపుల, భూములంతంతకా త్రుటపాకఁ జఁబడునె.

279. మ. ఒకనాఁడా తమ ముందటం బలుమఱున్ వాచోరాటమై నేల యె
త్తికొనంగా ఖరరంబుల న్గెలువఁగా దెల్లంబుఁగాఁ జూచి పాం
డుకుమారాళి సహింపకుండుదురు యాటోపంబునన్ ఘోషయా
త్రకుగంధర్వులు వచ్చినప్పటి చరిత్రం బాత్మలం బాయునే.

అనియును ధర్మరాజు ధృతరాష్ట్రాదుల క్షేమప్రశ్నములో భీమార్జునాదిసోదరుల పరాక్రమమును తానే యుగ్గడించుటకు కారణ మాలోచింపవలయు.

ఇందు ధర్మరాజు గాంభీర్యము, గూఢాభిప్రాయము, కార్యజ్ఞతయును తెలియునగును. ఎట్లనఁగా—

క్షేమప్రశ్నప్రసంగములో రాజనీతిఁ బ్రసక్తింపఁజేసికొని భీష్మునియెడఁ గౌరవులు మన్ననగల్గియుండుటయు బ్రాహ్మణుల మన్నించుటయు, దా మిచ్చిన వృత్తులు సెల్లనిచ్చుటయు, నడిగి యందుసంధిరాజులవలన ఆక్రమణము లేదుగదా? యని ప్రశ్నించుచు నందుఁ బ్రసంగించుకొని భీమాదులపరాక్రమము నుగ్గడించుటను కౌరవులకు కొంతభయప్రదర్శనము సేయుట కావలెను.

280. క. వినుతుఁ మనము మధ్యస్థుల, మని నర్జును నెదిరి సంజయా యిటు సెప్పె
మ్మనికి నిమానము ప్రాణం, బునదగఁ దక్కించుకొనఁగఁ బోలునె చెపుమా.

ఇందుసంజయునితో మనమిరువురమును మధ్యస్థులమను టచే సంజయుడు కౌరవపక్షముగాఁ జెప్పరానుంకుటకును పై పద్యశేషములోఁ దానును తనవారియందు పక్షపాతము లేక యే చెప్పినందుకుఁ దార్కాణముగా యుద్ధములో నర్జుని నెదిరికొని ప్రాణమును మానమును దక్కించుకొనఁజాలరని చెప్పుదానితో నదియును తనపక్షపాతవాక్యముగా సంజయుఁడు భావింపకుండునట్లు "ఇటమున్నెవ్వరికిని" అనుటలో ననుభవసిద్ధమైన దానినే యుగ్గడించుటను తాను భావిభయప్రదర్శనము సేయునట్టి మాటకాక యది యథార్థమే యనుటకు గడిచినదానినే సామాన్యముగాఁ జూపి యందు నుత్తర గోగ్రహణ వృత్తాంతమును స్మరింపఁజేయుచు సంజయుని నిరుత్తరునిగాఁ జేయుటకును, తనకార్యజ్ఞతకును, అనురూపముగా నట్లు చెప్పినదానిఁగా, మన మూహింపఁదగియున్నది.

281 క. దుర్యోధనునింటం దగు, కార్యమునకు ఖడ్గుఁ డనకుఁ గలవాఁడై చా
తుర్యంబు మెఱయఁ గర్ణుఁ, డార్యత్వము సెల్లుచున్నయదియే నెమ్మిన్.

ఇందుఁ గర్ణునివిషయమై కొంత ప్రశ్నించు నెపమున భీష్మద్రోణాదుల విశ్వసితపక కర్ణునే యెల్లకార్యములలో నమ్మి వర్తించుచున్నారా? అనుటలో నిపుడు సంధిగానీ యుద్ధముగానీ కర్ణమూలముగానే జరుగవలసినది కాని వేరు కానట్లును అర్జునునకు ప్రతిగా వారు నమ్మియున్న కర్ణుడును ఘోషయాత్రలోను గో

ప్రహాణములోను, అర్జునుని నెఱిఁగినవాఁడే కదా! ఇంకను అతని యుపదేశమునే యవలంబించియున్నవారా? అని సొల్లుంతనముగాఁ బలికినమాట కావలయును.

సంజయుఁడు చెప్పుట.

282. వ. అనినవినిసంజయుండు సవినయంబుగానిట్లను కురురాజునొద్ద నవినీతులు నీతిమంతులు సత్యసంపన్నులు, దురహంకారులు మఱియు వివిధప్రకారులు నయి చెరసి యుందురు, వారొకళ్లొకళ్లమాటలం బోయెడు వారుగారు కావున వారి నంతఁ జనం బనిలేదు, నావిన్నపంబు చిత్తగింపుము.

283. క. పొంకొందఁగఁదలఁచితి, నీవిందుశిరమయిన విమలభావయంబున వా
రందఱకుఁ జేమంబట, ముందరలేకున్న నేఁడు మొదలుఁగఁ గలుగున్.

అనుసంజయునివచనములుమీఁది ధర్మరాజుప్రశ్నముల కనురూపములగు నుత్తరము లెట్లు? వారిసంభాషణములో వారి యభిప్రాయ మెట్లు తెలియఁదగును?

ధర్మరాజు భీష్మద్రోణాదుల క్షేమ మడుగఁగా సంజయుఁడు "కురురాజునొద్ద నీతిమంతులు, నవినీతులు, మొదలుగు వారు కలరని చెప్పుట సంగతమెట్లగును? విచారింతము. ధర్మరాజసంజయు లుభయులును తమ తమ అభిప్రాయములు గూఢపఱచి తమవచనములలో నా యాసంగతులకుఁ బ్రసంగము కలిగించుకొని చెప్పినట్లు తెలియఁదగియున్నది.

ధర్మరాజు భీష్మద్రోణాదుల క్షేమమడుగుట యుచితమే కావున నందుఁ బ్రసంగము, గలుగఁ జేసికొని వారిరాజకీయకృత్య

ములలోఁ దమ వారి పరాక్రమ ముగ్గడించుట వారు సంధి కొప్పికొని తమభాగ మిచ్చునట్లుగాఁ జేసిన భయప్రదర్శనము.

సంజయునిమాటలలోఁ దమపక్షమునకువిరోధము లేకుండను, ధర్మరాజువచనముల కుత్తరమగునట్లును, ధర్మరాజుగూఢాభిప్రాయమును తాను తెలిసికొనియే, యందుఁ దమవారియందుఁ గనుపడులోపములను వ్యక్తము కాకుండ, మాటుపఱచి యచ్చటను "నీతిమంతులు, అవినీతులు; సత్యసంపన్నులును, గలరు వా రొకళ్లొకళ్ల మాటలం బోయెడు వారుకారు" అనుటలో వారియెడల నిందఁ జూపినట్లు నటించుచు వారందఱును, స్వతంత్రులై యగుటను వారొకరిమాటల కొకరు లోఁబడువారు కారు కావున వారు భాగమిచ్చుకొనుట కొప్పికొన్నను, లేకున్నను, పొందఁగఁ దలఁచితి నీవు "అనుటలో ధర్మరాజు పొందుఁగోరుటనే సిద్ధపఱచి చంద్రోపమానమున వారెట్టివారయ్యును" లోకమునా రెట్టివారయ్యును చంద్రుఁడెల్లవారికిని చల్లఁగానే యుండునని రుచ్యమగునట్లు ధర్మరాజును స్తుతించి పై పద్యశేషములో నింతకుముందు వారు "నీవుశాంతినొందుదువో లేదో" యను శంకఁ గలిగియుండుటను అంతగా క్షేమము లేకున్నను. నన్ను మీతండ్రిపంపినందుకే నేఁడు మొదలు నీవు యుద్ధపు తలంపుచేయ వని నిశ్చయించి యందు మూలముగానే వారికి నేఁటి నుండి క్షేమమగునని శుష్కప్రియవచనములచేతనే, స్వపక్షమును దృఢపఱచి చెప్పుటయును కానుపించుచున్నవి. వీరిరువురి వచనచమత్కృతియు, ససదృశముగాఁ దెలియఁబడుచున్నది.

ధర్మరాజు తమభాగమిచ్చివేసినచో శాంతిఁబొందు నభిప్రాయముఁగలవాఁడును, సంజయుఁడు వట్టిమాటల నేర్పుచేత నే శాంతిఁబొందించు నభిప్రాయముగలవాఁడును అయియున్నవారు.

సంజయుఁడు తన వక్తవ్యాంశముఁ జెప్పుట.

293. ఉ. శాంతతఁ బొంది కార్యము దెసన్ ధృతరాష్ట్రమహీశుఁ డాత్మ న
త్యంతము దేలి నన్నిటఁ బ్రియంబునఁ బంచెదు వప్డు నాకు దే
రెంతయు వేడ్కఁ దాన ప్రియ మేర్పడఁ జెప్పుచు బన్నఁ బంచె ని
ట్లెంత ఘటించెఁ బొందు మన కీపదవం దెలి వొందగాఁ దగున్.

294. క. చులకని కార్యము సేయం, దలఁచుట మీయట్టి సర్వధర్మజ్ఞులు శాం
తులు నన బ్రసిద్ధులగు పె, ద్దలకుం దగవగునె యివ్విధంబునఁ జూడన్.

అనువానిలో ధృతరాష్ట్రుఁడు వృద్ధుఁడగుటను స్తిమితచిత్తుఁడుగానందున మొదల జూదమునాడు తనపుత్రుల దుర్ణయము మాన్పఁజాలక యిపుడు స్తిమితచిత్తుఁడగుటను తాను శాంతినొందినవాఁడై నీయొద్దకు నన్నుఁబంపుచు ధర్మజ్ఞులును శాంతులు "అని ప్రసిద్ధినొందియున్న మీకు పోం దాలోచించుట యుచితముగాని యిట్లు చులకని కార్యము (యుద్ధము) లేక భాగము (గోరుట) చేయఁదగ దని చెప్పి పంపెను.

మీఁది సందర్భములో ధర్మరాజుమాటలలో నెచ్చటను యుద్ధప్రసంగము లేదు కదా? ధృతరాష్ట్రుఁ డట్లుతలంచుటకు సంజయుఁ డిట్లు చెప్పుటకును అభిప్రాయమేమి? ధృతరాష్ట్రుఁడు చెప్పిన చులకని కార్యము యుద్ధము, లేక భాగము గోరుట రెంటిలో నొకటి కావలెను. ఇప్పుడు యుద్ధముమాట లేకున్నను

ముందు ద్రుపదపురోహితబ్రాహ్మణుఁడు వచ్చి చెప్పినమాటలలో భాగమియ్యనప్పుడు యుద్ధమగుననిసూచనమయియుండును, దానినిఁబట్టి కాని యిప్పుడు ధర్మరాజు స్వయముగా భీమార్జునుల పరాక్రమము నుగ్గడించుచు ఘోషయాత్రాగోగ్రహణములను స్మరింపఁజేయుటలో యుద్ధసూచనమగుటచేత సంజయుఁడు తన కార్యానుకూలముగ నట్లు చెప్పియుండును.

ధర్మరాజు తన నిశ్చయమును దెలుపుట.

304. ఉ. నెయ్యము దప్ప నొండొకటి నీచెవి సోఁకనె నాదుపల్కులం
దియ్యెడ సంజయా యకికి నిమ్మెయి నులెక్కదె మాకు వారితోఁ
గయ్యము దక్కి మన్కి తగుకార్యము కాదొకొ పోరితంబు లే
కయ్యెడు నర్థసిద్ధి రెడ గైనను నొల్లక యొండు సేయునే.

అనుదానిలో "నాదుమాటలలోఁ గయ్యమనువార్తయే లేకున్నను నీవుమాటిమాటికి నులెక్కదవు నీవువట్టి మాటలతోనె మమ్ముఁ దేర్పఁదలచి యట్లులుక్కుచున్నావు కాని యుద్ధమక్కఱలేకయే మా భాగము మాకు వచ్చునప్పుడు మే మేల యుద్ధము సేయవలయుననియు" పోరితంబులే కయ్యెడు నర్థసిద్ధి పెడగైనను నొల్లకయొండు సేయునే "అనుటలో వ్యతిరేకముఖముగా యుద్ధముచేఁగాని కార్యసిద్ధి కానప్పుడు వెఱ్ఱివాఁడైనను నొండు సేయునే యుద్ధము సేయక మఱియొకటి సేయునా? అను నభిప్రాయము తెలియఁబఱచెను.

సంజయుఁడు మరలఁ జెప్పుట.

329. క. పాలిక కౌరవులు దుశ్శీలతఁ జెడఁ దలఁచిరేని చెప్పెద రుధిరా
భీలాన్నముకంటెను గడు, మే లగు భిక్షాన్నమైన మీ నడపడికిన్.

అనుదానిలోఁ బాండవు లెట్లయినను శాంతినొందుటయే వారి కుపకార మయినట్లు చెప్పుచు స్వార్థమున కనుగుణము గానే సమర్థించుట.

ధర్మరాజు బదులు చెప్పుట.

334. చ. అనవుడుఁ బాండురాజ తనయాగ్రణి సంజయుఁ జూచి యిట్లను నది యేల నీపలికినట్టిద ధర్మువు లట్లయుండి బో
ధను లరయంగ వచ్చిన నధర్మములై చెడుఁ గొన్ని ధర్మప
ర్తనములు గాక తోఁచి తుది ధర్మములై చనుఁ గొన్ని కర్మముల్.

335 ఈ వచనములో సంజయుని స్వార్థమాత్రపరునిఁగా నిరూపించి, ధర్మనిర్ణాయకులగు శ్రీకృష్ణుల వచనములు తమకు అలంఘ్యములుకాని, సంజయునివచనములు అలంఘ్యములు కావనునట్లు ధర్మరాజు అభిప్రాయము తెలియఁబడును.

336 అనిన విని జనార్దనుండు సంజయున కిట్లనియె. "పాండుతనూజులకు శుభమునే కోరుచుందును. ధృతరాష్ట్రుఁడు పుత్రపౌత్రాదులతోనున్నవాఁడు అతనిచేటును మంచిదా యని యును తలంతును"

ఇందు శ్రీకృష్ణులు పాండవులకు శుభమునే కోరుట వారికి రాజ్యసంపాదనమునే కోరుట కౌరవులకు చేటునుగుఱించి శంకించుట వారు యుద్ధములో నశింపక రాజ్య మియ్యరనుట.

336 ఇట్లుండఁగా వారు తెలివి నొంది వీరిని శాంతిపఱచుటకు నిన్నుపంపినారని సంతోషించినాఁడను. నీవును వచ్చి ప్రేమయుధర్మమువినయమును ఒప్పునట్లువీరుశాంతిఁబొందుటకు

దగురీతిని పల్కినాఁడవు కానిఅదియంతయునుచూడఁగా పొసఁగినట్లే యున్నను, ధర్మరాజపలుకుల చందమును చూడఁగా సంధిలేనిచొప్పే తోఁచుచున్నది. ఎందుచేతననఁగా నీవు మొదలనుండి తుదివఱకును వారిప్రేమయు, గౌరవమె చెప్పెదవు; కాని ఇచ్చి పుచ్చుకొనుమాటచొప్పేమియును కనఁబడదు. వీరు తమపాలు నొందక పట్టితీపుమాటలతో నెట్లు శాంతినొందుదురు? ధర్మరాజుమాటలలో సంధివలన సగపాలు రావలయునట్లు కాన్పించుచున్నది.

341. ఉ. వీరలు పెద్దతవ్వక యొకవెంట నొడంబడి తేటి శాంతులై
కౌరవకోటిఁ గూడి మనఁగా మదిఁ గోరుట పెంపు తాల్మియుం
గారుణికత్వముం దగవుగాదె జగంబున పాడి తండ్రిపా
లీరనితెంపునేసి వయినెత్తిన నెత్తిరిగాక ద్రోహమే.

ఇందులో "వీరుపెద్దత్రవ్వక" (కోరక) ఏదోయొకరీతికి ఒప్పికొని, శాంతినొంది, కౌరవులతోఁ గలసి; బ్రతుకఁగోరుట వీరికి గొప్పశాంతియు, వారియెడల కారుణికత్వము, తగవును కదా! అనఁగా వారు వీరికి చేసిన పరాభవమును, బాధలను తలంపకఁ వారితోఁ గూడియుండుట దుర్ఘటమయ్యెను, వారుచేసిన పూర్వాపకారముల నుగ్గడింపకపోవుటయే "పెద్దత్రవ్వకపోవుట"! లేక వీరితండ్రిపాండురాజదిగ్విజయములో తెచ్చినది అతనికిస్వార్జితము; అది తమకుమాత్రమె సొత్తు; తక్కిన అతనిపిత్ర్యమగు కురురాజ్యములో సగమున్న తనుకు రా దగియుండఁగా; అట్లుకోరకుండుట పెద్దత్రవ్వకపోవుట! "లేక పునర్ద్యూతములో

ఓడినవారు రాజ్యభోగములను విడిచికొని అరణ్యవాసము, అజ్ఞాతవాసమును చేయుటమాత్రమే సమయముచేసికొనిరికాని, వీరిరాజ్యభాగమును వారాక్రమించుకొని అనుభవించవలసినట్లు సమయముచేసికొనలేదు; అట్లుండఁగా వారీపదుమూఁడు సంవత్సరములును వీరిభాగమునుకూడ అనుభవించినందుకు ఆగడిచిన ఫలమును కోరక, ఇప్పుడు తమసగపాలుమాత్రము కోరుటయే "పెద్దత్రివ్వకుండుట"! ఎట్లయినను. వీరు అవియెవ్వియును తలంపకుండుట వీరికిశాంతియు; వారియెడల కరుణయుకదా! అట్లుండగావీరులోకనుపాడిగాతిమతండ్రిపాలు నపేక్షింపవారియ్యనప్పుడు వారిపై నెత్తివచ్చిన వత్తురుకాక వీరి కదితప్పిదమా? శాంతిభంగమా? ద్రోహమా? ఏమియును కాదని అభిప్రాయము.

1-342 క. విను మవమానము నడఁచి యి
ట్లునికిఁ బడయు పొగడుకంటె నుజ్జ్వలులై మా
ర్కొనిన నది లెస్స యెట్లై
నను వీరికిఁ బోరు మేలు నాకుం జూడన్.

వీరు వారివలన అవమానమొందియు, నీవు చెప్పినరీతిని శాంతులయి "యునికి" కాని, లేక వారితో సంధి పొసఁగి తమ సగపాలుమాత్రము నొంది సంతుష్టులగుట కానినామతమున లెస్స కాదు. మఱేమనగా, మార్కొన్నవారై వారిని నిర్జించుట లెస్స. ఎందుచేతననఁగా వారిని నిర్జించుటవలన వీరికి వైరనివర్తనమును, యావద్రాజ్యలాభమును అగును, కపటద్యూతములో వీరిని వంచించి, రూపుమాపి, యావద్రాజ్యమును ఆక్రమించి

యున్న వారిని నిర్జించి, వీరుకూడను అశ్లే యావద్రాజ్యమును అపేక్షించుట దోషము కాదని నా యభిప్రాయము(ఇచట కొన్ని పుస్తకములలో "అట్లైనను" అని పాఠము)

343 ఐ. మఱియు సంగ్రామము రాజులకు ధర్మము కాదని నీవ చెప్పుము. ద్విజులకు కర్మవిభాగంబు చేయునపుడు రాజు లిచ్చువారుగాని వేఁడుకొనువారు కారని చెప్పుట సకలలోక ప్రసిద్ధంబు. సర్వవర్ణాశ్రమ ధర్మపరిపాలనంబు సేయునట్టిరాజులు నిజధర్మంబు వదలుదురే తమ్మొరులు అన్యాయంబుచేసినప్పటికికదా యీ శస్త్రాస్త్రంబు లింద్రాదు లగుపెద్దలు కావించిరి. నీ చెప్పిన ధర్మంబులు కౌరవులకుం జెప్పవలదే.

అని శ్రీకృష్ణులు చెప్పుటలో పాండవులు శాంతి నొంది యూరకొనుటయే నిజధర్మవిరుద్ధముకాని తెగి యుద్ధముచేయుట అధర్మము కాదని స్పష్టము.

సంజయుఁడు శ్రీకృష్ణులతోఁ బలుకుట.

345. దేవా! నీచిత్తంబున నిడి దీని నింత గొనియాడినఁ గర్జంబొడఁగూడునే!

కౌరవులదోషములను నీ చిత్తమందు విడువకపోవుటయే కాక వానిని పెద్దగా పొగడి చెప్పఁగా పాండువుల చిత్తములందు గూడ రోషాంకురము వృద్ధినొంది రూఢమగును కదా! అట్లు కాఁగా సంధికార్యము సమకూరునా? అనఁగా నంతకు ముందు ప్రతిపక్షులలో ఎన్నిదోషములున్నను సంధికాలమున వానిని మఱపించునట్లు శాంతివచనములు చెప్పినచో సంధి అగును కాని,

కోపోద్దీపన మగుమాటలు చెప్పఁగా కార్యమగునా? అని తన కార్యజ్ఞతను తెలిపినాఁడు.

శ్రీకృష్ణులు సంజయునితో మరల చెప్పుట.

346 ఉ. అత్తఱి భీష్మముఖ్యులగు నచ్చటివృద్ధజనంబు లెల్ల నో
రెత్తక యూరకుండిరి మహీశ్వరు చిత్త మెఱుంగ కుక్కడా
నొత్తి కుమారులంగినియ నోపఁడ యక్కట మాన్పఁగన్న నా
చిత్తము కాదు లోకములచిత్తము లెల్లను సంతసింపనే.

ఈ శ్రీకృష్ణవాక్యము సంజయునిమీఁది వాక్యమునకు ప్రత్యుత్తర మెట్లగు ననఁగా—

సంజయా! ఆద్యూతకాలమందు భీష్మాదులగు పెద్ద లెవ్వరును నోరెత్తి మాటలాడలేదు; అనఁగానిది తగదని పలుకలేదు; అందు నీవున్నవాడవేకదా! అనిధ్వని. అట్లు మీరు ఊరకుండుటకు కారణము ధృతరాష్ట్రునిచిత్తవృత్తిని ఎఱుంగమి యై యుండును, కాని అతనిచిత్తవృత్తి పాండవుల సిరి నపహరించుటకు మాత్రమా? లేక ద్రౌపదిని మానభంగ మొందించుట మొదలు పాండవుల పరాభవమునకుఁ గూడనా? అదియే తెలియకనే మీ రూరకుందురు. ధృతరాష్ట్రుఁడును కుమారులను కోపించి నొక్కి చెప్పఁజాలినాఁడుకాఁడు. కష్టము! అప్పుడు రాజుగాని మీరుగాని అట్లు మాన్పించినచో నామనస్సే కాదు, లోకములో వారిమనస్సులెల్లను సంతోషింపకుండునా? మీ రట్లు పరాభవము మాన్పనందున నామనసమునం దది విడిచిపోవునా? అనుదానివి వ్యతిరేకముఖముగా; అట్లు మాన్పినచో నామనసము

సంతోషింపకుండునా అనియు; ఇప్పుడు పాండవులనువట్టి మాటలతో శాంపఱుపవలయు నన్నట్టి ధృతరాష్ట్రుని చిత్తము నెఱింగి సంధికి వచ్చినాడవు కాని వీరి చిత్తవృత్తి నిప్పుడెఱుఁగవు. వీరి పరాభవము తీఱు టెట్లు? భాగము లేక శాంతినొందు టెట్లు? అని ఆలోచింపక యిట్లు చెప్పుచున్నాఁడ వని తాత్పర్యము. ఇందులో వారి కనువగుతఱిని వారు విజృంభించి చేసిన దుర్ణయమునకు వీరి కనువగునిత్తఱిని వీరు విజృంభించుట తప్పుకాదనియును, ప్రసంగము కలిగినపుడు మధ్యస్థులగు పెద్దలు మోమోటమిలేక చెప్పవలయును కావున మీ రప్పుడు చెప్పకున్నను, నే నిప్పుడు చెప్పుట తప్పిదమా అని యును ధ్వని.

347 ఉ. తిట్టులబోయి...నీపట్టున నేమ మా
రయఁగ బంపుట కెట్టులు నేర్చె క్రమ్మఱన్.

అప్పుడు సాహసికుఁడై నిందలపాలయి అంతదుర్ణయమును దుశ్శాసనుఁడు చేయుచున్నపుడు ధృతరాష్ట్రుఁ డెట్లు సహించినాఁడు? మహాపతివ్రతయగు కోడలియేడ్పుధ్వనుల విని యెట్లోర్చినాఁడు? దృష్టిలేనందున, చూడలేదను నెపమున తలపట్టి యీడ్చిన, వారింపలేదని సమర్థించుకొనినను, ఏడ్పుధ్వనులను, చెవులుండుటచే వినినవాఁడే కదా? దానికెట్లు ఓర్చినాఁడు? అట్టి ఆతఁడిప్పుడు వీరిక్షేమమును తెలియఁగోరుట నెచ్చట నేర్చినాఁడు? ఇప్పుడు వీరిక్షేమమును గోరినట్లు తలంచినచో, తమవారికి క్షేమము కలుగునను ఉపాయమును ఎవ్వరివలననో, నేర్చియుండు నని అధిక్షేపము.

353 సీ. పాండవేయులఁ దగం బ్రార్థించి యుద్ధము
 కక్కట యేనైన నరుగుదెంచి
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి రాజ్యంబు
 పాలు సేసిన మృత్యుపాశమునకుఁ
దప్పరే వారలు తగవు నేర్పును
 నామీఁద నిలుపుట నాకుఁ గీడె
వన్న మన్నింతు రవ్వాయుంబు సొరనినా
 మాటప వా రొడఁబాటు లేక
యుండుదురు కేరడము లాడుచుండి రేనిఁ
గడిమి పాండవాగ్నియ కాదుసువ్వె
తమ్ముఁ దమలోభ మనుచిచ్చు దరికొనంగ
డగినవా రయి పోదు రింతియ తలంప.

పై వాక్యములలో సంధిదుర్ఘటం బని చెప్పి అయినను సంధికి తాను వచ్చెదనని శ్రీకృష్ణులు చెప్పుట కభిప్రాయమేమి? “అక్కట” అని విషాద మెందుకు? “సంధికార్యము దుర్ఘట మెందుచేతనఁగా, వారు వీరియెడలఁ జేసిన అపరాధములు రెండు కలవు— వాచాపరాధము, క్రియాపరాధమున్ను. వాచాపరాధమునకు వాచాపరిహారము; క్రియాపరాధమునకు క్రియాపరిహారమున్ను కావలయును. వారు వీరినిపలికిన దుర్భాషణములగు వాచాపరాధమునకు వీరు వానిని మఱచునట్లు వారు వినయోక్తుల మరలఁ బ్రార్థించినచో వాచాపరాధముతీఱును. సిరినపహరించిన క్రియాపరాధమునకు మరల వీరిసిరిని, వీరి కిచ్చినచో, అదియును తీఱును. కాని, వారుదుర్జ్ఞానము గలవారగుటను వార

ట్లు చేయువారు కారు. అందువలన సంధిదుర్ఘటమనియు, అయినను ఆగుణదోషములు వారియందే ఉంచి తమకు సంధినొప్పని నింద లేకుండఁగ, నచ్చటికి నేనయిను (అనఁగా ఇదివఱకు ద్రుపదపురోహిత బ్రాహ్మణు డొకసారి వచ్చి సంధిమాటలను చెప్పఁగా వా రొప్పమినిఁ దెలిసి వీరిలో మఱియెవ్వరు రానొల్లకున్నను అట్టి అవినీతులకడకు నాకు రాఁదగకున్నను దానికోర్చి) నేనైనను వచ్చెదనని దూరాభిప్రాయము. ఒకప్పుడు సంధి, మీఁద జెప్పిన రీతిని కుదిరినను ద్రౌపదికి వారుచేసిన కేశాకర్షణ, వస్త్రాపహరణాపరాధములుమాత్రము మీఁదచెప్పిన పరిహారములవలన తీఱునవికావు కాఁబట్టి, అందుకే తాను వీరిని ప్రార్థించి తీర్చివత్తునని గూఢాభిప్రాయము.

357 ఇంకను కౌరవుల దోషముల నుగ్గడించి చెప్పి, “ఏరూపం బయ్యెనేమి యీనేమిటికిన్” అని మీఁదివాక్యములలో యుద్ధమే లెస్సయనుచు సంజయునికి భయప్రదర్శనమును చేసి, తాను సంధివిఘటనముచేసినాఁ డను నపవాదము తనకు లేకుండుట కయి, ముందు గతించినది యెట్లయినను ఈర్ష్యయొల్లమ కని తానుకూడ సంధి నంగీకరించినట్లు తుదకు చెప్పుటలో, ఇన్నియాపద లొందినవీరే సంధి నంగీకరించుచుండఁగా, వారు అంగీకరించకపోవుట ఉచితము కాదను నభిప్రాయము సంజయునకు తోఁచునట్లు చెప్పుట.

360 క. ఏ నీ పనికై వచ్చెదఁ
 దా నొక్కిన మేలు గాక తప్పఁ దలచినన్

దానన నెగడెద మే మ
మ్మానవనాథునకుఁ జెప్పు మామత మెల్లన్

ఇందు శ్రీకృష్ణులు సంధికి తానే వచ్చెద నని చెప్పుట కభిప్రాయమేమి? "మేలుగాక"? అనుచోట మే లెవ్వరికి? దానన నెగడెదము అనుచోటను అవధారణార్థక అకారమువలన లాభమేమి? "మామతమెల్లన్" అని యెందుకు చెప్పవలెను?

తనకు సంధివిఘటనాభిప్రాయయాపవాదము లేకుండుటకయి తానే వచ్చెదనని, 2 సంధివలన దుర్యోధనునకే మేలు. 3 అట్లతఁ డంగీకరింపనిచో అప్పుడే మేము విజృంభించెదము ఆసంధి విఘటనా దోషము అతనికే అగుఁగాక మాకు వలదు. 4 ముందెట్లున్నను తుదకు మాఅందఱిమతము ఇదియే కాని వేఱుకాదు అని అభిప్రాయము.

361 వ. అని చెప్పఁగా సంజయుఁడు ధర్మరాజుం జూచి 'పోయి వచ్చెద. నాడిన మాటలం దేమియుం దగనియట్టివి లేవుకదా!' అని అనియెను.
ఇందు తా నాడినమాటలలో పాండవులయెడలను తగని మాటలెవ్వియును లేవుకదా! అని సంజయుని అభిప్రాయము.

363 క. ఎదురున్నరూపు పలుకఁగ
దుది కటకటపడవు నీవు దుర్ణయమును బె
ట్టిదనమును బెండును నగుపలు
కొదవదు నీనాలుకకు నయోన్నత యెపుడున్.

ఇందు "ఎదురనఁగా నెవ్వరు? ఉన్నరూపెట్టిది? సంజయుఁడు కటకటపడ నవసరమేమి? దుర్ణయము, బెట్టిదనము,

బెండును అగుపలుకు ఎవరివిషయములో? సంజయుఁడు నయోన్నతుఁ డెట్లు?

దీనికి యథాశ్రుతముగా సంజయునిమాటలలో దుర్నీతి పారుష్యము, నిస్సారతయు లేదనియును, అతఁడు కోపాదివికారములు లేనివాఁడనియు, దూతల కుచితమగు నీతిఁ దెలిసినవాఁడనియును, సంజయుని గౌరవించునట్టి మాటగా కాన్పించును కాని అది అట్టిదిమాత్రము కాదు. మీఁదిమాటలను పట్టి చూడఁగా ఇచటనుకూడ అర్థగాంభీర్య ముండును ఎట్లనఁగా "ఎదురున్నరూపు" అనఁగా మీకు ఎదిరి వారమగు మేము, మీవారి "ఉన్నరూపు" అనఁగా వారిదోషములను ఉగ్గడించి పలికినందుకు, కటకటపడవు. కౌరవులు చేసిన దుర్ణయము, బెట్టుతనము, వారినిస్సారతయును మే ముగ్గడించినను, నీ నోటను వానిని పలుకక వారి గౌరవము చెడనట్లును, నీకార్యమున కనుకూల మగునట్లుగాను, భాగ మిచ్చునట్టిమాట లేక వట్టిమాటలతోనే మమ్మును తేర్పనాడినాఁడవనియు, దూతభావమునకు తగిననీతియందు నిపుణుఁడవు కావుననే నీస్వామిఅభిప్రాయమునకు విరోధము లేకుండఁగను, మా మనస్సులకు నొప్పి కలుగకుండఁగను ఇంతమట్టుకును సంభాషించిన వాఁడవని సాకూతముగా పలికినపలుకుగా తెలియనగును. ఈయభిప్రాయము ఈ క్రింది పద్యమందును తేటపడుచున్నది.

364 క. నీ వొండె విదురుఁ డొండెను
గావలయుం గాక యిట్టికార్యంబులకున్

రావేఁ కలరె తగువా
రీవినయము నేర్పఁ గలరె యితరుల కింకన్

ధృతరాష్ట్రునకు రాజకీయ కార్యములలో నీతిజ్ఞుఁడగు విదురుఁడు ముఖ్యుఁడై యుండఁగా నతనిని పంపక సంజయునిపంపుటకు కారణ మేమి? పంపుఁగాక ధృతరాష్ట్రుని అభిప్రాయము సంధికొఱకేనా? కాదా? అయితే సంధికై వచ్చినసంజయుఁడు ధర్మరాజుతో నంతదూరము మాటలాడుటలో నెచ్చటను భాగమిచ్చునట్లు పలుకకునికికి కారణమేమి? వీని నాలోచింపఁగా విదురుఁడే యిట్టినీతి కార్యములలో పంపఁదగినవాఁడయ్యును అతఁడు భయపక్షములయందును సమపక్షపాతము కలవాఁడును, విశేషించి ధర్మజపక్షపాతము కలవాఁడును అగుటను తనకపటసంధికను కూలించునట్లు అతఁడు చెప్పువాఁడు కాఁడు; మఱియును తానాతనిఁ బంపునపుడు ఆతనితో చెప్పుమాటలలో న్యాయాభినయమును ఆతఁడు సహించువాఁడు కాఁడు. ఆతనినే సంధికిఁ బంపినపుడు తప్పక భాగమిచ్చుకొనునట్టి మాటలనే ఆతనితో చెప్పవలసి యుండును ఆతడును పోయి తప్పక భాగమిచ్చునట్లే చెప్పి సంధిచేసికొనినచ్చును. కాబట్టి యింతయును తనకు మనసులో నిష్టము కాకున్నను, పైకి భీష్మాదులగు పెద్దలకు ముఖప్రీతిఁ జేయునట్లు తలఁచి యిది గూఢముగా నుంచి విదురుని మాని ఆతనితో నీతిలో సమాను డగుసంజయునిఁ బంపుటకు కారణమయి యుండును.

సంజయుఁడును ధృతరాష్ట్రుఁడు తనను పంపుటకు తలఁచి సంధిమాటలు చెప్పుటలోనే ధృతరాష్ట్రుని అభిప్రాయము తెలిసికొనిన వాఁడు కావున అంత దూరము ధర్మరాజుతో మాట్లాడునపుడు భాగ మిచ్చుమాటలు లేకయే వట్టిమాటలతోనే వారిని శాంతిచేయునట్లు చెప్పినాఁడు. ధృతరాష్ట్రుని అభిప్రాయము సంజయున కెట్లు తెలిసినదనఁగా, ఇంతకుముందు ద్రుపదపురోహితుఁడగు బ్రాహ్మణుఁడువచ్చి అచ్చటివారందఱి అభిప్రాయము పాండవుల భాగము వారికిచ్చి వేయవలయు ననియు, లేకున్న యుద్ధము తప్ప దనియు యుద్ధములో పాండవులు జయమొందుట తప్పదనియును స్పష్టముగా చెప్పెనుకదా! తనకు వారిభాగమిచ్చుతలంపున్నచో ఆబ్రాహ్మణుతోనే యెందు కట్టిసంధిమాటలు చెప్పకుండును? అది యెట్లయినను ఈ సంజయునితో చెప్పనప్పుడైనను సంజయునిఁ బిలిచి.

259. గీ. పాండునరపాలసుతు లుపప్లావ్యమునకు
వచ్చి యున్నారనీ వేగ వాసుదేవ
సహితముగ వారిఁ గని తెల్పవాద మేమి
భంగిఁ జాయు నమ్మియుఁ గగఁ బలుకవలయు

260. క. మీయయ్య మీరు పవనా,
పాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం,
డై యుట బుత్తెంచె నన్ను ననుమీ మొదలన్.

అని చెప్పి, చుట్టనున్నవారితో నిట్లనియె. "దుర్యోధనుఁడు కార్యాకార్యజ్ఞుఁడు కాఁడు;" "కావున నిట్టికల తకలి

గినది;" "పాండుసుతులు దోషాన్వితులు కారు"; "వారును మనమును క్షీరోదకములగతిఁ గలిసి బ్రతుకుట లెస్స;" వారిదు మతఁ బడఁదగినవారా?" "వారి పితృభాగమును వారేలఁ దగినవారు కారు?;" అనియు, "వారు మనల నమ్మరు" "అనృతాత్ములము, అన్యాయపరులము, గర్వితులము, అని మనతో వారు కూడియుండుట కొల్లరు;" "మనము వారిభాగ మియ్యకుండఁగ వచ్చునా;" అను మొదలగుమాటలు ఇతరులతో ప్రసంగముగాఁ జెప్పినట్లు చెప్పి, అనిపలికి సంజయుదిక్కు మొగంబై యెల్ల వారును వినున ట్లిట్లనియె.

అని యున్న యీగ్రంథ సందర్భములో ధృతరాష్ట్రుఁడు సంజయునితోఁ జెప్పుమాటలు కేవలము పాండవులను శాంతిచేయుమనుటమాత్రమును, ఇతరులతోఁ జెప్పు ప్రసంగములో మాత్రము పాండవులకు భాగమియ్య దగదా అనియు న్యాయము పాటింపుమాటయే కాని అదియైనను వారిభాగ మిచ్చునట్లు లేకుండుటయును, పిమ్మట సంజయుని చూచి ప్రయాణపు సంగతులను చెప్పుటమాత్ర కాని యిచ్చి పుచ్చుకొనుమాట ఒకటియు లేకుండుటవలననే అతని అభిప్రాయమును సంజయుఁడు తెలిసికొనినవాఁడు ఇతడు విదురునంత స్వతంత్రుఁడు కానందున ధృతరాష్ట్రుని నిందింపను, వారింపను చాలక అతని మాటలను, అభిప్రాయమును, అనుసరించువాఁడయి, అట్టి వట్టిమాటలతోనే పొత్తు చేయునట్లు పలికినవాఁడు. సంజయుఁ డించుమించుగా

విదురునంతబుద్ధిశాలియు, నీతిజ్ఞుఁడును అగుటను తనపక్షమునకు విరోధము రాకుండను, ఎదిరి కాగ్రహము పుట్టకుండను అంత నేర్పుతో మాటలాడెను. అందులకే ధర్మరాజు అతనిని (సంజయుని) "నయోన్నత" అని సాభిప్రాయముగా సంబోధించినాడు.

377 సంజయుడు మరలి పోవునప్పుడు ధర్మరాజాతనితో.

వ. ఏము కలహంబు గోరక పొందు గోరుట తమకు మేలు... వీరున, వారును మదీయప్రార్థనా భంగంబు సేయక నాదగుశాంతియు, దాంతియునుఁ జెల్లించి నన్నలజడి పెట్టక పోరితంబుడిగి తమతమ ధనంబులు గుడిచి సుఖంబుండుట మాపెద్దలకును బుద్ధిమంతులకును సంతోషంబగు. పెద్ద యీనోపఁడయ్యేనేని కుశస్థలంబును, వృకస్థలంబును, వాసంతియు, వారణావతంబును, ఇంద్రప్రస్థంబును జాలుఁగాదేని, మఱియు నెందేనియు నొక్కటి యగునట్లుగాఁ దనతోఁ బుట్టివుల మేపురకును నిలువ తావులయి దిచ్చిన సర్వశాంతి యగును అని చెప్పెను.

ఇందు 'తమ తమ ధనంబు' లనఁగా తమ పితృధనములనియే కదా తాత్పర్యము పితృధనములు చెరిసగమే కదా? అట్లు అచ్చట చెప్పి 'పెద్ద యీనోపఁడేని అయిదుతావులిమ్మని' చెప్పుటలో న్యాయముగా తమపితృధనమునఁ దగుభాగ మది అగునా? కాదా? భాగమే అయినప్పుడు, అయిదూళ్ళుమాత్రము కోరుట యెందుచేత? "పెద్ద యీనోపఁడేని" అనుచో సగముకంటె నెక్కువ అనియా లేక అయిదూళ్ళకంటె నెక్కువ అనియా? తానట్లు కోరుట తన స్వత్వమును పట్టి భాగముకోరుటా? లేక దుర్యోధనుని కరుణాలబ్ధ మగునట్లు యాచనమా? ఆలో

చింపవలయు! మొదటిపక్షమున తమ తండ్రియగు పాండురాజు దిగ్విజయము చేసి తెచ్చినది ఆతనికి స్వార్జితము కాన, అది ఆతనికి అసాధారణము) అనఁగా అవిభాజ్యము, శంతను రాజ్యము ధృతరాష్ట్ర పాండురాజులకు సొత్తగుటను, అది తమకు పితృధనమగుటను, అట్లిచ్చుట పెద్దయిచ్చుట అని అభిప్రాయమై ఉండును. అట్లియ్యఁజాలడేని తమభాగమునకుసరియగునట్లుమాత్రము సంఖ్యకయిదైనను, ఆయము కించుమించుగా సరియగునట్టివి అయిదూళ్లైనను కావచ్చును. కాఁబట్టి అట్లిచ్చినను సర్వశాంతి అగునని చెప్పియున్నాఁడు. ఇచట సర్వశాంతి అనఁగా అయిదూళ్లే రాజ్యభాగమంతకును సరిగా నుండు నని అభిప్రాయము కావచ్చును. కాని దుర్యోధనుని కరుణచే నిచ్చినంత అని కాదు. మూఁడవపక్షములో అట్లును కాదేని నెందేనియు నొక్కటి యగునట్లుగా; "దన తోఁబుట్టువుల మేపురకును నిలువ తావు లయిదిచ్చిన సర్వశాంతి యగును" అనుటలో మీఁద కోరిన కుశస్థలము మొదలు అయిదూళ్లు ఇయ్యలేనిచో అవి కాకున్నను మఱియెచ్చట నయినను ఒక్కటి అగునట్లుగా అనఁగా ఈ అయిదూళ్లకు సరియగునట్లుగా నెవ్వియైనను మాయయిదుగురకును నిలువ తావులు (నివాసయోగ్యములు) ఇచ్చినను సర్వశాంతి అగును. అను దానిలోఁ గూడ దాను కోరిన అయిదు కాకున్నను తమభాగమునకు సరి అగునట్టివి అయిదూళ్లు అయినను చాలు నని అభిప్రాయమే కాని దుర్యోధను చిత్తానుసార మని కాదు.

పాండురాజుకు విజయోపార్జితము అసాధారణమన్నందుకు ప్రమాణము.

యాజ్ఞవల్క్యస్మృతి వ్యవహారకాండము దాయవిభాగ ప్రకరణము

శ్లో॥ ప్రమాణం మానుషం దైవ మితి భేదేన దర్శితం।
అధునా వర్ణ్యతే దాయ విభాగో యోగమూర్తినా॥

దీని వ్యాఖ్యానము తత్ర దాయశబ్దేన యద్ధనం స్వామిసంబంధాదేవ నిమిత్తా దన్యస్య స్వం భవతి తదుచ్యతే—సద్వివిధః, అప్రతిబంధ స్సప్రతిబంధశ్చేతి। తత్ర పుత్రాణాం పౌత్రాణాంచ పుత్రత్వేన పౌత్రత్వేన చ పితృధనం పితామహధనంచ స్వంభవతీత్య ప్రతిబంధో దాయః॥ పితృభ్రాత్రాదీనాం తత్పుత్రాభావే స్వామ్యభావేచ స్వంభవతీతి సప్రతిబంధో దాయః॥ తదేవాభిప్రేత్యనారదేనోక్తం—శ్లో. విభాగోఽర్థస్య పిత్ర్యస్య తనయై ర్యత్ప్రకల్ప్యతే. దాయభాగ ఇతి ప్రోక్తం వ్యవహారపదం బుధైః.

కింవిభాగాత్స్వత్వంఉతస్వత్వస్యసతో విభాగఇతి, తత్రస్వత్వమేవతా వన్నిరూప్యతే, కింశాస్త్రైక సమధిగమ్యం ఉత ప్రమాణాంతర సమధిగమ్యమితి, తత్రశాస్త్రైక సమధిగమ్యమితి తావదుక్తం గౌతమవచనాత్॥ స్వామీరిక్థక్రయ సంవిభాగ పరిగ్రహాధిగమే షు బ్రాహ్మణ స్యాధికం లబ్ధం, క్షత్రియస్య విజితం నిర్విష్టం వైశ్య శూద్రయోరితి" ఏవం ప్రతి గ్రహాద్యుపాయకే

స్వత్వే లౌకికే స్థితే బ్రాహ్మణస్య ప్రతిగ్రహాదయ ఉపాయాః క్షత్రి
యస్య విజితాదయః। వైశ్యస్య కృష్యాదయః। శూద్రస్య శుశ్రూ
షాదయః। ఇత్యదృష్టార్థా నియమాః''—జ్ఞాతేషు జ్ఞాయతే స్వా
మీ బ్రాహ్మణస్యాధికం లబ్ధమితి—బ్రాహ్మణస్య ప్రతిగ్రహా
దినా యల్లబ్ధం తదధికం అసాధారణం। క్షత్రియస్య విజితమిత్య
త్ర అధికమిత్యనువర్తతే। వైశ్యస్య కృషిగోరక్షాదిలబ్ధం నిర్విష్టం
తదసాధారణం। శూద్రస్య ద్విజ శుశ్రూషాదినా భృతిరూపేణ
యల్లబ్ధం తదసాధారణం'' —''సప్త విత్తాగమా ధర్మ్యా దా
యోలాభః క్రయో జయః। ప్రయోగః కర్మయోగశ్చ సత్ప్రతిగ్ర
హ ఏవ చేతి॥ మనుస్మరణాత్॥ యదాహ॥ శౌర్యభార్యాధనే
చోభే యచ్చ విద్యాధనం భవేత్। త్రీణ్యేతాన్యవిభాజ్యాని ప్ర
సాదే యచ్చ పైతృకే॥ ఇతి॥

ఇత్యాదిప్రమాణములుండుటను పాండురాజుకు పిత్ర్యము గుశంతనురాజ్యములో సగమును కలిపి చూచినచో నది పెద్ద అగును, అట్లియ్యనొప్పనిచో సగ మయినను ఇయ్యవలయు నని తాత్పర్యము.

సంజయుఁడు ధర్మరాజుతో చెప్పుట.

377 ''దేవా నీ యాడిన మార్గం బంతయు నడిపెద. మీ తండ్రి నీకును దమ్ములకును, వాసుదేవునకును నెట్లు ప్రియం బట్లు సేయువాఁడు గాక'' అని యున్నది. ఇందు సంజయునకు ధర్మరాజు చెప్పినట్లు కార్యమును సంఘటింతుననియే నా అభిప్రాయము సంజయునకు ధర్మరాజు కోరినట్లు రాజ్యభాగ మిప్పింతు నని అభిప్రాయముకాదు. అట్లొప్పందల కాదు, నీవు చెప్పినమాట లన్నియును ధృతరాష్ట్రునితో చెప్పఁగలవాఁడను. అతఁడు నీకును నీ సోదరులకును, శ్రీకృష్ణులకును కూడ మీ తండ్రిభాగము మీ కిచ్చుట, లేనిచో యుద్ధము ఏ దైనను నీకు ఇష్టమే కావున, వానిలో నేదైన నొకటి అగు నని'' తాత్పర్యము.

అర్జునుఁడు సంజయునితో పలికినది.

379 మ. బలమత్తాకృతి యైనభీము డనుశుంభత్కుంభిసంరంభమున్
నిగిపెన్ నాఁడును నంకుశం బయి తుదిన్ నేడుందదుద్రేకముల్
ముసుగం జేయ నజాత శత్రునికృపామౌగ్ధ్యంబు చాలంగ వా
రల కేలా నయవిక్రమోచితవిచారక్లేశముల్ సంజయా!

భీముని కోపోద్రేకమును, నాఁడు ''(ద్యూతకాలంబునను) తుదకిప్పుడును, అజాతశత్రుని కృపామౌగ్ధ్యమే, నివారించుచుండఁగా వారికేల నీతివిక్రమ విచారక్లేశములు? అనఁగా వీరుకృపఁ జేయఁ దగినవారు, వీరు తగనివారు అనుభేదము లేకుండ అట్టి క్రూరులయందుఁగూడను కృపచేత ముగ్ధుఁడయి మా సంరంభమును ఈ అజాతశత్రుఁడే అణఁచివేయుచుండఁగా, వారికి మా నీతివిక్రమముల విచార మెందుకు? వారియెడలధర్మరాజునకుఁగల కృప అను ముగ్ధత్వమే మా కందఱకును అంకుశ మగుటను, ఈతనికి వ్యతిరేకము చేయఁదగదను నీతికి బద్ధులమయి ఉన్నవారము కాని విక్రమమును లేక ఉన్నవారము కాము ను విచారము

వారికి లేకున్నది. ఈతనికి ఆమార్గ్వమెప్పుడు విడుచునో అప్పుడే విశ్రుతుఁ తు మని అభిప్రాయము. ఇచటను "అజాతశత్రు" పదమునకు సార్థక్యమును విచారింతము. అజాతః శత్రుః యస్య అను వ్యుత్పత్తిలో శత్రువు లేని వాఁడనిఅర్థమగుచున్నది, కాఁగా తన ఆ పేరునకు భంగము వచ్చునేమో అనుతలంపే యీతని ముగ్ధత్వము; కాని, వేఱుకాదు. ఆ వ్యుత్పత్తిలో తానొకరికి శత్రువుకాఁడని అభిప్రాయముకాని, తనయెడలనొకఁడు శత్రుభావమును చేయుఁడనికాదు. కాఁబట్టి వారియందు ఇతను శత్రుభావము లేకుండుటచేతనే, ఇంతవఱకును కృపగలవాడయియే ఉన్నాఁడు. అది యిప్పుడీతను విడిచినను తన అజాత శత్రుత్వమునకు భంగము లేదు కావున ఇటపైని అట్లు జరుగదని ధ్వని.

శ్రీ

శ్రీ మ హా భా ర త వి మ ర్శ ము

ఉద్యోగపర్వము, ద్వితీయాశ్వాసము.

సంజయుఁడు పాండవుల యొద్దనుండి వచ్చి ధృతరాష్ట్రునితోఁ చెప్పునది.—

6 క. వారెల్లను భవదీయ స్ఫారబలము, గారణముగ సౌఖ్యంబున ను
న్నారని పలుకుదురు నిజ, మారయఁగా నట్ల కాదె యది జననాథా

ఇందులో పాండవులు ధృతరాష్ట్రుని బలముచేత సౌఖ్యముతో నుండు టెట్లు? మీఁదను సంజయునితో పాండవులు చెప్పు మాటలలో దుర్యోధనులోభము, ధృతరాష్ట్రుని ఉపేక్షయే మాక్లేశములకు కారణ మనుట కాన్పించుచుండఁగా ఇప్పు డాతఁడట్లు ఎందుకు చెప్పినాఁడు? "నీవింతకు ముందెట్లు చేసినను ఇప్పుడైనను నీకొడుకును బలాత్కరించి బుద్ధి మరల్చి వారి భాగము వారి కిచ్చునట్లు చేసెదవను ఆశతో అట్లయిన తమకు సౌఖ్యము గలుగు నని తలంపుతో నున్నారు. అట్లు చేసినచో నిజముగా సౌఖ్యముతో నున్నవా రగుదురుకదా" అని సంజయుని అభిప్రాయ మయి ఉండును.

7. క. ధర్మజునకు భోగంబులు, ధర్మువుల ట్లింపు గావు ధర్మంబులలో
నిర్మలబుద్ధి నహింసయు, గూర్మిగలం డతండు కురువంశనిధీ.

ఇందు ధర్మరాజు అహింసయందు మిగుల ప్రీతి గలవాఁడని చెప్పినాఁడు కదా! ధృతరాష్ట్రుఁడు పాండవులవలని భీతిచే నొకప్పుడు వారిపాలి య్యనొప్పికొను నేమో కాని ధర్మమాత్రముకు లోఁబడినవాఁడు కాఁడు. అట్లే అయినచో తనంతట తానే వారిని పిలిచి భాగమియ్యఁడా? ఇట్టి సందర్భములో భయప్రదర్శనము చేసి కదా సంధిఁ జేయవలయును; లేనిచో కార్యమగునా? అది కాక పాండవులుగూడ తనతో మాభాగము మాకు న్యాయముగా నియ్యనిచో యుద్ధము తప్పదని చెప్పిరి కదా! అట్లుండఁగా నిందు కిచ్చట తా నిట్లు చెప్పవలయు? సంజయుని అభిప్రాయమును వారిపాలియ్య నక్కఱ లేకుండునట్లు కాదు కదా? ఆలోచింపవలయు.

ధర్మరాజునకు ధర్మములట్లు భోగములింపుకావు అనఁగా తను రాజ్యమును కోరుట భోగముల కొఱకే కాదు. క్షత్రియులకు ప్రజాపాలనాదులు ఉత్తమ ధర్మములు కావున వాని నపేక్షించుచు, అహింసయందు ప్రీతిగలవాఁడు అనఁగా క్షత్రియులకు హింస దోషము కాకున్నను, హింస లేకుండఁగా తమకుల ధర్మము తమకు సిద్ధించుట మంచిదను తలంపుగలవాఁడు. నీవు కురుకులమునకు నిధివి అనఁగా మూలపురుషుఁడవయి యున్నాఁడవు.

ఈయుభయ పక్షములవారికిని ఒకరివలన నొకరికి అపాయము లేకుండ చేయవలయు. అనఁగా యుద్ధము లేకుండ వారి భాగము వారికిచ్చి, వీరియట్ల వారికిని, జాత్యుచిత మగు ప్రజారక్షణలో యాగాది సద్ధర్మాచరణము సంభవించునట్లు చేయుమని సంజయుని తాత్పర్యమయి యుండును.

8\. ఉ. మానుషశక్తి యొల్లఁడు సమంచితదైవము యాఁది యందు నీ
పైన యతండు పుణ్యమును పాపముఁ బెట్టినవాఁడు నీవు నీ
సూనువశంబ కాని యొక చొప్పుఁదలంపవు కర్ణసౌబలా
ధీనము గార్యనిశ్చయము తెల్లము నీమత మొప్ప దేమియున్.

ఇందు ధర్మము నే అవలంబించినవాఁడయి పురుషకారమునే ముఖ్యమని తలంపఁడు అని యున్నది కదా! అయితే తమకు దైవమెట్లు చేసిన అట్లే అగునన్నచో, సంధి కాని, యుద్ధము కాని దైవమే చేయునని అభిప్రాయమా? అట్లైనచో, తా నెందుకు సంజయునితో నంతదూరముగా తమకు వారుచేసిన అపకారములను ఉగ్గడించుచు, సంధి అగునట్లు ఇప్పుడైనను చెప్పవలెను అని చెప్పెను? మఱియును "నీయందే పుణ్యపాపములను పెట్టినవాఁడ"నఁగా నేమి? తమ భాగ మిచ్చినచో పుణ్యము, లేకున్న పాపమును అనియేనా? అట్లే అయినపక్షమున మొదల సంజయుఁడు చెప్పినమాటలలో కౌరవులే, నిందను పాపమును పొందుదురు గాక; నీయట్టివాని కిట్టి క్రూరకృత్యము తలంచుట మంచిది కాదని చెప్పఁబడినది కదా! అప్పుడామాట లెల్లను ఖండించి తిరుగ సంజయునితో చెప్ప నెందుకు? ఆలోచింపవలయు? మీరు కర్ణ శకుని దుశ్శాసనాదులయందే కార్యభారము పెట్టి వారి శక్తినే నమ్మి ఉన్నట్లు కాక, నిరంకుశ పరాక్రములగు భీమార్జునుల శక్తిని తా నెఱిఁగియు, దానినే నమ్ముకొనక దైవమనఁదగు శ్రీకృష్ణులనే నమ్మియున్నాఁడనియు, పుణ్యపాపములను నీపైనే పెట్టినవాఁడనఁగా, వారి రాజ్యభాగమును వారు పాలించుకొనుచుండుటను, కులోచితమగు ధర్మము వారికి సిద్ధించునటుల చేయుదువో (అనఁగా సంధిఁ జేసి వారి భాగము

వారి కిత్తువో) లేక యెల్లరాజులు నశించునట్లు చేసి పాపకృత్యమును చేయింతువో ఆ రెంటికిని నీవే నిమిత్తము కావున ఆపుణ్యపాపములను నీమీఁదనే పెట్టియున్నాఁడని అభిప్రాయము. మీరు మానుషశక్తినే నమ్మియున్నవారు: వారు దైవమానుషశక్తులు రెండును నమ్మియు, కలిగియు, నున్నవారు. ఇందలి తారతమ్యమును నీవే తెలిసికొనవలయు.

12. క. వినుము యుధిష్ఠిరుసైరణ
మనవారలు వెఱపుగా సమర్థింతురు డీ
కొనఁగం దగరే కొండం
గని యోటమి వెట్టినట్లు కౌరవనాథా.

ఈ పద్యమునకు పలువిధములుగా నర్థమును చెప్పుదురు. ధర్మరాజు సైరణను చూచి, మనవారు గొఱ్ఱెపోతు కొండతో పోట్లాడఁదలఁచి తానే విజృంభించుచు నిశ్చలమైయున్నకొండను చూచి కొండయందు ఓటమి పెట్టినట్లు, ధర్మరాజు సైరణను సమర్థింతు రని కొందఱు.

(2) "తగరేకొండంగని", అనుచోట తగరు×ఏకొండం గని అనఁగా గొఱ్ఱె తగ్గుటను చూచి దానియం దోటు పెట్టినట్లు ధర్మరాజుసైరణను మనవారు సమర్థింతు రనికొందఱు. ఈ పక్షములో గొఱ్ఱె తగ్గినదే గెలుచు నని అభిప్రాయము. కాని ఈ యర్థములో గొఱ్ఱెకు ప్రతిపక్షముకూడ గొఱ్ఱెయేనా కాదా? గొఱ్ఱె అయినప్పుడు ఆజాతికి పోట్లాటలో తగ్గుచునుండుటకు పోడుచుట స్వభావము కదా! అయినప్పుడు ఆ రెంటికిని తగ్గుట కనఁబడుచుండఁగా నందులో దేనియం దోటుపెట్టవచ్చును? ఆక్రియకు కర్తయెద్ది? మఱియును ఇచట "ఏకొండన్" అనునది 'ఏకొను' ధాతువు, భావార్థకరూప మని కదా చెప్పవలయును. అయితే 'ఏకొను' ధాతువు భావార్థకరూపము 'ఏకొనుట,' 'ఏకొంట' అగును కాని ఏకొండ కాదుగదా!

(3) మఱియొక రీతినికూడఁ గానఁబడును. ధర్మరాజు సైరణచూచి, మనవారు కొండతో పోట్లాడఁదలఁచినవారు కొండ నిశ్చలమై ఉండుటనుచూచి, దానియందు వారోటమి పెట్టినట్లు మనవారు తలంతురు కాని, "డీకొనగందగరే" అనఁగా వారు వీరితో డీకొనఁజాలకయున్నారా అని ఇందు కొండతో పోట్లాడఁదలఁచినట్లు అను సామిత అగును.

ఇట్టియొక్క పద్యమే కాక ఈ కౌరవ పాండవుల సంధివిషయములో చెప్పఁబడిన పద్యములు ప్రాయికముగా పౌరాణికులకు విగ్రహాములో నుపయోగపడుచున్న ట్లున్నవి!

13. క. అనుజులకు నడ్డపడి యే
మినిఁ జేయఁగ లేమిఁ జూచి మెచ్చితి గాకీ
వు సాదు రేఁగె నేని
న్నును తలపోలకునన కాని నిలువదు సుమ్మీ.

ఇందు ధర్మరాజు, తమ్ములు విజృంభింపకుండు నటుల తా నడ్డుపడి, యేమియును చేయలేకపోవుటను చూచి, నీవు మెచ్చుచున్నావుగాని, సాధు జనుఁడు సహించినంత సహించి ఓర్వక, రేఁగెనేని తుదిఁజూడక విడువఁడని అర్థమును చెప్పుచున్నారు. ఇందు రెండు ఆలోచింపవలసియున్నవి.

(1) ధర్మరా జేమియుఁ జేయలేమిఁ జూచి మెచ్చెద వను నది సంగతముగాఁ గానరాదు; సంతోషించుట అయినచో కావచ్చును కాని మెచ్చు టెందుకు?

(2) "మఱియు సాదు రేఁగెనేని నిలువదు." అనుచోట 'సాధుజనుఁడు' కర్త అయినపుడు 'నిలువదు' అను క్రియ ఆ మహా ద్వాచకముగా నున్నది. ఇందు మొదటిదానికి 'ధర్మరాజేమి యుఁ జేయఁగలేమి', అనుదానికి ఏమియును చేయక ఊరకుండుట అని కాని శక్తిలేకుండుట కాదు. అట్టిదానిం జూచి, నీవు శక్తిలేమిగాఁ దలఁచి మనవారు చేసిన కృత్రిమ వ్యాపారమే బాగని తలంచి, దానినే నీవు మెచ్చెదవని చెప్పినచో సంగతముగాఁ దోచును. రెండవదానికి ఉపపత్తి కానరాదు. ఇచట సాదు అను దానికి మదించిన వృషభ మని కొందఱు చెప్పదురు.

అంతకంటె 'సాతు'* అని పాఠమయినచో బాగనితోఁచు చున్నది. 'సాతు' అనఁగా బాటసారులగుంపు (బిడారు) అది రేఁగెనేని (ఉద్రేకించినచో) గంతవ్యస్థలమును చేరక మధ్యను ఆగదని తాత్పర్యము.

19. చ. అనయము పుట్టె జూదమునయప్పుడ యంతయుఁ జిచ్చు వెట్టి కా
ల్చిన యది నీయుపేక్షయ వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మొ
త్తనిపులి యెల్లవారలు నధర్మ్యము నీవయిఁ బెట్టున తను
న్విన డును గానఁడుం బిదప నీకును నాకు మరల్ప వచ్చునే.

జూదమందన్యాయముపుట్టినది. దానినప్పుడు వారింపక నీ చేయుపేక్షయే వారిమనములందుఁ బుట్టిన కోపానలమై మనవారికి చిచ్చుగా పరిణమించి దహించినది. అనగా అప్పుడే దహించివేయును గాని ధర్మరాజు వశీకృతచిత్తుడగుటను తనకు ధర్మహానినోర్వక సహించి మీరు చేసినది అధర్మమని తానెఱిగినవాఁడయ్యును, ఎల్లవారును నీయందు అధర్మమును నిశ్చయించి పలుకువఱకును మొత్తనిపులివలె సహించినాఁడు.

"పులిమీసముల నుయ్యేలనూఁగు" ననుసామిత, అగును తనకెంత క్లేశములు మీరు కలుగఁ జేసినను చిత్తమున వికారము నొందక ఉండి, పులి తనను మిక్కిలి పరిభవించి కోపము తెప్పించునంతవఱకును ఓర్చి పిమ్మట నెవ్వారికిని అశక్యమైయెట్లు చేయునో, అట్లే యితఁడును మీయందెల్లవారును తప్పని నిశ్చయింపగా పిమ్మట (ఇప్పుడు) విజృంభించిన, అతనిని, నీకును నాకును, మరల్చుటకు శక్యమగునా? అనఁగా ఉపశాంతికయి పంపిననీకును, పోయిననాకును ఉపశమింపఁ జేయుట యెట్లు శక్యమగునని సంక్షేపముగా పర్యవసితాంశమును సూచించుచు చెప్పెను.

ఇట్లు చెప్పి "గమనాయాసమున అంగములునొచ్చుచున్నవి; మిగిలినది ఱేపువచ్చి విస్తృతముగాఁ జెప్పెదన"ని పలికి సంజయుఁడు వెళ్లఁగా, ధృతరాష్ట్రుఁడు విదురుని పిలిపించి "సంజయుఁడు పాండవులయొద్దకు వెళ్లి వచ్చి నన్ను మిగుల నిందించి ఱేపువచ్చి అక్కడిసంగతులు చెప్పెదనని వెళ్లినాఁడు. అంతటినుండి నామనమునకు నెవ్వగకలిగి కంటికి నిద్ర రాకున్నది" అని చెప్పఁగా, విదురుడు

21-22 క. బలవంతుఁడు పైనెత్తిన,
బలహీనుఁడు ధనముఁ గోలుపడినయతఁడు గ్రము
చ్చిల వేచువాఁడుఁ గాముకుల
చిత్తుఁడు నిద్రలేక యుందురు రథిపా.

క. ఇక్కాఱగాములలోపల, నొక్కటి నీచిత్తవృత్తి నొదవెనా? యొరు సొమ్మొక్కటిఁ గుడువఁ దలఁచితో? కక్కురు గతమేమి, నీకు నిద్రసెడుటకున్.

ఇందు విదురుఁడు ధృతరాష్ట్రునిచేయు ప్రశ్నములు ఉచితము లేనా? మొదటిపద్యములో నిద్రలేమికి కారణములను

మాటనిసామాన్యముగా నుగ్గడించినాఁడుకదా? అంతకుముందే ధృతరాష్ట్రుఁడు సంజయుఁడు పాండవులయొద్దకు వెళ్లివచ్చి అచ్చటి సమాచారము చెప్పిపోయినప్పటినుండియు. తనకునిద్రరాకున్నదని చెప్పుచుండఁగా, విదురుఁడిట్లు వికల్పించి అడుగుట సంగతమగునా? ఒకప్పుడు మొదటిపద్యములో, నిద్రలేమి కారణములను లోకసామాన్యదృష్టిచే నుగ్గడించినను, రెండవపద్యములో "ఇక్కొ-అగాములలోపల నొక్కటి నీచిత్తవృత్తినొదవెనో?", అని ధృతరాష్ట్రునియందు సంభావించుట అసంభావితముకాదా? విదురుని అభిప్రాయమేమి సూక్ష్మదృష్టినాలోచింపగా విదురునకు ధృతరాష్ట్రునియం దాదోషములుండునని అభిప్రాయముకాదు. లోకసామాన్యముగా నిద్రాభంగ కారణముల నుగ్గడించి, వానిని కొఱగాములుగాఁబలికి, వీనిలోనొక్కటి నీచిత్తమందు తగులదుకదా అని? ప్రశ్నించి, పిమ్మటను " ఒరుసొమ్మొక్కటిఁ గుడవఁదలంచితో అనియును అడుగుటవలన మీఁదఁజెప్పిన కారణములు ధృతరాష్ట్రుని నిద్రలేమికి నిజమయిన కారణములుకావని తెలిసియును. వానితోకూడ "నొరులసొమ్ముఁ గుడువఁదలఁచుట" సమానదోషముగా నిరూపించుట అతనిఅభిప్రాయము అదియే నిజమైన కారణమని తాను తెలిసినవాఁడయ్యును ఇతరకారణములనుకూడ సామాన్యముగా నితనియందా పాదించినచో అందుకైన లజ్జనొంది పశ్చాత్తాపమునొందునేమో అనుతలంపుతో నట్లు ప్రశ్నించి యుండునని ఊహింపనగును.

ధృతరాష్ట్రుడు విదురునితో

23 తే. అనిన ధృతరాష్ట్రుఁ డిట్లను నతనితోడ
ధర్మసుతుమాటచొప్పెవ్విధంబొ యెఱుఁగ

కునికిజేసి చింతిల్లితి నోపు దీవు
దెలియఁ జెప్పి నాయలమట మలుఁగఁ జేయు

అనిచెప్పెను.

ఇందు విదురునివికల్పముల కవకాశములేని యటుల ధర్మరాజు తలంపుచొప్పెద్దియో తెలియక చింతిలినట్లు సమర్థించుకొని, ధృతరాష్ట్రుఁడు చెప్పుటలో ధర్మరాజు సంజయుని మాటలవలన శాంతినొందినో లేక భాగమియ్యక తప్పనట్లుండెనో అనుఅభిప్రాయము తోచును.

24 చ. అనవుడు నిట్లనున్ విదురుఁ డక్కట ధర్మసుతుండు బాంధవుం
డును జెలికాఁడునుం దగుభటుండును బ్రెగ్గడయుం గుఱుండుఁ గాఁ
డెఁ నృపవరేణ్య నీకు ప్రకటీకృతసత్త్యుఁడు శాంతమూర్తి స
ద్వినయవివేకశీలగుణ విశ్రుతుఁ డాతఁడు కీడు పల్కునే.

ఇందు విదురుఁడు ధృతరాష్ట్రుని అభిప్రాయములో ధర్మరాజు శాంతినొందెనో, యుద్ధముచేయునో అనుచింతకయి ధర్మరాజు యుద్ధముచేయఁడని స్వాభిప్రాయాను గుణముగ సమర్థించుచు చెప్పుచున్నాఁడు.

'కీడుపల్కునే' అనఁగా మీయెడఁగాని తమయెడఁగాని ఒకకీడు కలుగునట్లు పల్కునా అని తమభాగమిచ్చినచో యుద్ధము వలనికీడు నంగీకరింపఁడు. అట్లుకాక నీ పట్టిమాటలతో శాంతినొందినచో తమకుకీడును. యుద్ధమయినచో మనవారికి కీడును వచ్చును. కావు నట్లుకాక తమభాగమును తమకిచ్చినచో నుభయులకును కీడురాదని అభిప్రాయము,

ఈ పద్యములో ధర్మరాజు ధృతరాష్ట్రునకు గురుఁడని చెప్పెనుగదా విదురుని అభిప్రాయమేమి? అనఁగా వాతాహిత

బోధచేయువాఁడు గురువుకావున యుద్ధముకాకుండ సంధివలన తమభాగమిచ్చి సుఖముననుండు మని చెప్పుట హితముగాన నట్లు చెప్పుటచే గురువని అభిప్రాయము కావచ్చును.

25 ఆ. నీవుఁ గొడుకు వారి నెఱి లేక పఱచితి
రిదియ చాలు నుచిత మయిన పాలు
పంచి యిండు పిల్లిపట్టినయీసువు
సేసి యున్న నేల చెల్ల నేర్చు.

నీవును నీకొడుకు దుర్యోధనుడును వారియెడ ప్రేమలేక వారిని రాజ్యభ్రష్టులఁ జేసి తోలివేసినారు. అదియే చాలు. అనఁగా లోకమందు నిందుకు అదియే చాలు ఇంకనైనను వారి తండ్రిపాలు వారికియ్యవలయు. అట్లుకాక ఒకమాంస ఖండము తనకు దొరికినదని పట్టుకొని పిల్లి విడువనట్లు, మీరు వారిభాగ మియ్యక ఆక్రమించుకొనఁగా నదియెట్లు చెల్లును? "పులి నోటి మాంసఖండమును పిల్లి తీసికొనినట్లు "అని సామెత కలదు.

2-26 వ. మీరు శకుని కర్ణ దుశ్శాసనుల మీఁద రాజ్యభారంబు
పెట్టికొనియుండుట రిత్త తుదిముట్టనేరదది యెట్లంటేని

మీరు శకుని కర్ణాదుల దురాలోచనమున కపటద్యూత ము కల్పించి, వారి రాజ్యమునైతే అపహరించితిరి; కాని దాని నిర్వహించుకొని నిలిపికొనుటకు వారు సమర్థులు కారు. పిల్లి,పులి నోటి మాంసఖండమును ఎట్లో తాను పట్టికొనినను, పులి దానికి ప్రయత్నించి నపుడు తాను నిలిపికొనఁ గలదా అనితాత్పర్యము.

27 క. తముఁ దాఱెఱుఁగుట వేగప
డమి దాలిమి విడుపు గలుటయు లేని ప్రభు
త్వము గలదె వారియందీ
సు మాసుతము లొకఁడు బట్టి చూడంగలమే.

ఇందు చెప్పఁబడిన శోభనగుణములగు పురుషగుణముల లో వెతకిచూచిన నొకటయినను వారియందు అనఁగా శకునికర్ణా దులందు కలదా? ఇట్టి గుణములు లేని ప్రభుత్వ మెచ్చట నైన నుండునా? అనఁగా అట్టి పురుషగుణములు లేని వారు రాజ్యభా రమును నిలుపఁ గలరా అనిఅభిప్రాయము. శకునికర్ణాదులందా గుణములు లేకపోవుటెట్లనఁగా. తమశక్తిని తామెఱుఁగక వారితో విరోధమును కల్పించినారు. ద్యూతమున గెల్చినామన్నంతమా త్రముననే ఉచితానుచిత వివేకము లేక వేగిరపడి, మహాపతివ్ర తయగు, ద్రోపదిని, పరిభవించినారు పిమ్మట వారజ్ఞాతవాస భంగమొందవలెనని నిగ్రహణము చేసినారు పిమ్మట, ద్రుప దపురోహితుఁడువచ్చి చెప్పినప్పుడు వారిభాగము నిచ్చుటకంగీక రించినారుకారు. కాఁబట్టి యీ దోషములు మనవారియందును, ఆసుగుణములు వారియందును కలవు. అదియెట్లనఁగా, వారు తమ శక్తిని తాము తెలిసినవారయ్యును, ద్యూతకాలమందు తమకు చేసిన పరిభవమునకు వేగిరపడక, (అప్పుడే విజృంభింపక). తాలి మికలిగి దుష్కరముగువనవాసాదిక్లేశముల సహించి, (విడుపు కలిగి) అనఁగా యుద్ధమున విజృంభించినచో తమకు యీ పదా ర్యలాభమును కలుగునను నిశ్చయమున్నను, సంధికొడఁబడి, సగ పాలుకే అంగీకరించి; తమకున్నంత ప్రభుత్వమునే తాము కల వారు; మనవారన్ననో తమకు లేనిప్రభుత్వము నారోపించికొని యున్నారు. యావద్రాజ్యమున్ను తమకు దక్కునని తలంచు చున్నారు. ఇంకను మనవారికి తమ్ముఁదామెఱుఁగమి యెట్లనఁగా

ఘోషయాత్రలో గంధర్వులచే చిక్కుబడినపుడు ధర్మరాజునొద్ద కుపోయి ఆతనితో తమవారమనియు రక్షింపుమనియు ప్రార్థించి వారిచే రక్షింపబడి, యిపుడుతమరువారి నన్యులుగాఁ జేయుట వీరికనాత్మజ్ఞత అనియును కావచ్చును,

విదురునితో ధృతరాష్ట్రుడు చెప్పుట:—

29 తే. సంజయునిచేతఁ గార్యంబు చందమెల్ల
వినియెఁగి మనకెద్దిసేయుంగఁ దెఱఁగు దాని
నంచి చేయింపు మిపుడు నామనము దల్ల
డిలుట హితభాషణంబుల డిందుపఱుపు.

ఇందు ధృతరాష్ట్రుని అభిప్రాయము సంజయునివలన వారిభాగమిచ్చుకొనక తప్పనట్టి చొప్పు తెలియఁబడుటచేతనే, నిద్రలేక కుందిన వాడయ్యును విదురునితో నిపుడు చెప్పుటలో సంజయునిమాటలలో కార్యశేషము తేటఁబడనట్లునటించి. అతఁడేమి చెప్పునో అను సందేహమే తనుగుందుటకు కారణముగా సమర్థించి, విదురుని అభిప్రాయమును అట్టిదికానే తెలిసికొని, దానికొప్ప దలకాక, అప్పటికి తగినట్లుపశాంతి వచనములను చెప్పుమని కోరినట్లు తెలియనగును

మఱియు, "మనకెద్దిసేయంగఁ దెఱగుదానిపనిచి చేయింపుమిపుడు "అనునది విదురునకు ప్రీతిగాఁ జెప్పుట కాని అతఁడు చెప్పినట్లు చేయుటకుకాదు.

అప్పుడు తనకుకలిగియున్న ప్రజాగరమువలని సంతాపము తీఱునట్లు హితభాషణములు చెప్పుమనియేకాని వేఱుకానట్లు ఈ పద్యశేషమువలనను "నీవుధర్మాధర్మవిదుండవు, నయానయజ్ఞుండవు" అను పై వచనము వలనను స్పష్టమగుచున్నది. ముందు

ద్యూతము కల్పించినపుడు "మాటలలో విదుర భీష్మాదుల ననుసరించి నట్లుండును కాని కార్యముపట్ల నీహృదయమునే యనుసరించి"యుందు నని దుర్యోధనుతో తాను చెప్పెను. అట్లే యిప్పుడు విదురుని స్తుతిచేసి అతని ప్రీతికయి చెప్పినదిగాఁ తెలియనగును.

విదురుడు చెప్పుట.

(31) జనులకు నొడఁబాటగువిధమున ...
(32) కోపము నుబ్బును ...
(33) ఏలిన వానిని ...
(34) నెమ్మిగల వారినెల్లను ...
(35) ధనమును విద్యయు వంశంబు ...
(36) అరిదిపిలుకాని ...

ఈ పద్యములులోక సామాన్యముగాను, విశేషించి ఆగుణములు పాండవులందుఁ గలిగివున్నట్లును, వ్యతిరేకముగా కౌరవులందు లేనట్లును, సమర్థించి చెప్పినాఁడు.

37 తే. ఒకటిఁ గొని రెంటి నిశ్చలయుక్తిఁ జేర్చి మూఁటినాల్గింటి
గడువశ్యములుగఁ జేసి యేనిటిని గెల్చి
యాఱింటి నెఱిఁగి యేడు విడిచి వర్తించువాడు వివేక ధనుఁడు

ఈ పద్యమునకు "నిశ్చలవృత్తిఁ జేర్చి " అనియును పాఠభేదముకలదు. ఈ పద్యమునకు పలువిధములుగా నర్థములను చెప్పుచున్నారు. దీనికి మూలభూతమగు శ్లోకము సంస్కృతభారతములో,—

"ఏకయా ద్వేవినిశ్చిత్య త్రీంశ్చతుర్భిర్వశీకురు।
పంచజిత్వావిదిత్వాషట్ సప్తహిత్వా సుఖీభవ॥

అనియున్నది. దీనినిచూచి ఆవిభక్తుల ననుసరించి కొందఱీ పద్యమునే, ''ఒకటిఁగొని రెంట నిశ్చలవృత్తిఁ జేర్చి మూఁటి నాల్గింటఁ గనువశ్యములుగఁ జేసి యేనిటినిఁ గెల్చి యాఱింటి నెఱిఁగి యేడువిడిచి వర్తించువాఁడు వివేకధనుఁడు'' అనియును చదువుదురు. మొదల తిక్కనగారేదో ఒకవిధముగానే చెప్పియుందురు; కాని యిటీవల 'తిక్కనలు' అనేకులు లేచి పాఠములనేకములు కల్పించుటచేత వానికర్థములను కూడ అనేక విధములుగా చెప్పుచున్నారు. ఎట్లనఁగా, యథాశ్రుతార్థము. ఒకటిచే రెంటియందు నిశ్చలవృత్తిని చేర్చి, మూఁటిని నాల్గింటిచేత మిక్కిలి వశపఱచుకొని, ఐదింటిని జయించి, ఆఱింటిని తెలిసికొని, యేడింటిని విడిచి, వర్తించువాఁడు గొప్పవివేకవంతుఁడు. ఇచట నొకటిఅను దానికి 'బుద్ధి' అనికొందఱు 'ధైర్యమ'ని కొందఱును; 'రెంటన్' అనుదానికి 'పుణ్యపాపములయందని'యు 'జయపరాజయముల యందని,' యు, 'మూఁటన్' అనుదానికి 'శత్రుమిత్ర బంధువు' లనియు, 'ప్రభుమంత్రోత్సాహ శక్తులని'యు, 'నాల్గింటిన్' అనుదానికి 'సామాద్యుపాయముల చేతనని'యు; 'ఐదింటన్' అనుదానికి 'ఇంద్రియములనని'యు; 'ఆఱిఁటన్' అనుదానికి 'సంధ్యాది షడ్గుణములనని'యు: 'ఏడు' అనుదానికి 'సప్తవ్యసనములని' యును చెప్పుచున్నారు. ఇట్లు చెప్పుటకు కారణము. ఏకయా ద్వే వినిశ్చిత్య ''అను శ్లోకమునకు, ఏకయా బుద్ధ్యా ద్వే పుణ్యపాపే త్రీన్, శత్రుమిత్రబాంధవాన్, చతుర్భిః సామాద్యుపాయైః, పంచ,జ్ఞానేంద్రియాణి షట్, సంధ్యాదిగుణాన్, సప్త, ద్యూతపానాది వ్యసనాని అనియున్నటిప్పణమును చూచి యిట్లొకపక్షము వారుచెప్పునర్థము. రాజనీతి ప్రకరణ

ములో విదురుఁడు చెప్పినదగుటను రాజనీతికనుగుణమని రెండవ పక్షమువారు చెప్పునర్థముగాను కాన్పించును. కాని యే పక్షములో నయినను సరిగానున్నట్లు తోఁచదు. మూల హృదయము తెలియదు.

మూలశ్లోకములోని విభక్తులను లింగములను మాత్రము ననుసరించి టిప్పణము వ్రాయఁబడి నట్లున్నది, కానివిషయమును సరిగాఁగానరాదు. ఎందుచేతననఁగా!—ధృతరాష్ట్రుఁడు చేయుప్రశ్నము విదురుఁడు చెప్పు సమాధానమునుబట్టిచూడఁగా నది రాజనీతియో, లోక సామాన్యధర్మమో స్పష్టముగాక ఇట్లు భిన్నాభిప్రాయములు కలిగియుండును. అది యెట్లైనను ఒకపక్షమునకు ఆ పక్షమువారు చెప్పునర్థము సరిపడిఉండవలెను కదా? అట్లుకానరాదు. రాజనీతిపక్షములో బుద్ధిచే పుణ్యపాపములందు నిశ్చలవృత్తినేర్చి, లేకచేర్చి, లేకచేసి అనికాని ఎట్లు చెప్పినను ఆదిస్వారసికార్థముగాఁ గానరాదు. పుణ్యపాపములందు నిశ్చలవృత్తిని బుద్ధిచేఁ జేయుట ఎల్లవారికిని ఎల్ల కార్యములయందును తుల్యమగుటను, రాజనీతిలో దానిఁ జెప్పుట కావశ్యకత కానరాదు. మఱియు సామాద్యుపాయములచేత శత్రుమిత్రబంధువుల, వశపఱచుకొనుట సందర్భోచితము కాదు. రాజనీతిలో సామాదుల ఉపయోగము శత్రుల విషయములో మాత్రమేఁగాని మిత్రబాంధవుల విషయములోఁగాదు కదా. మఱియు నిశ్చలవృత్తి జేర్చి (నేర్చి, చేసి, ఎట్లయినను) ఈ పాఠములలో రెంటిన్ అను ద్వితీయ కన్వయమంతగా సమంజసమై ఉండలేదు. ఇంక 'మూఁటి నాల్గింటిన్', అను రెండురూపములుకూడ, ద్వితీయాంతములగుటను వానియర్థమున్నూ ఉచితము

గాఁ గనుపడదు. మఱియు 'రెంటిన్' అనునది కర్మ అయికదా, ఉండవలెను. దానికి చేర్చి, చేసి, అను వానితో అన్వయసందర్భ మెట్లో కానరాదు. అట్లే నాల్గింటిన్ అనునది కర్మ అయినచో సామాదులు కదా అర్థము. వానిని వశపఱచుకొనుట అనునది స్వారసికముగాఁ దోఁచదు. అట్లు కాక ఒకప్పుడు రెంటన్ అని సప్తమిలో పాఠము చెప్పినప్పుడు నాల్గింటన్ అనునదికూడా నట్లే చెప్పవలయును కదా! అప్పుడు సామాదులలో అని కదా, అర్థము! అది పొందుపడదు అందుకే 'నాల్గింటన్' అను దానికి సామాదుల చేత నని తృతీయాపాఠమును చెప్పుదురు. కాని పాఠములలో ప్రక్రమ విరోధము వచ్చును కదా! అందుకే కాఁబోలు క్రొత్తగా శోధించి ముద్రించిన పుస్తకములలో నన్నిటికిని ద్వితీయాంతపాఠమునే వ్రాసినారు. వారును ప్రక్రమమును మాత్రము చూచి దిద్ది వ్రాసినట్లు కాన్పించుచున్నది కాని అర్థ మెట్లాలోచించిరో తెలియదు. "స్థితస్య గతిశ్చిన్తనీయా" అను న్యాయముచే నేదో ఒకపాఠమున కొక పక్షములో నొకరీతిని అర్థము చెప్పవలయును కావున, నొకపాఠమును విచారింతము అందుకు ముందు మూలశ్లోకమునకు సరిపెట్టికొనినచో పిమ్మట పద్యమునకు కొంత సుకరమగును కావునఁ దానివిచారింతము రాజనీతిలో, ఏకయా బుద్ధిచేత లేక సమష్టిచేత, ద్వే కార్యాకార్యములను, లేక "ఆత్మోదయః పరజ్యానిః ద్వయం నీతిరితీయతీ" అనుప్రకారము తనవృద్ధిని, శత్రువుల క్షీణతను, లేక "ఉచ్ఛృంఖలాఽనుచ్ఛృంఖల సత్వముల"ను వినిశ్చిత్య, నిశ్చయించి; చతుర్భిః సామాదులచే త్రీన్ సహజ కృత్రిమప్రాకృత శత్రూను వశీకురు వశపఱచుకొనుము. పంచజిత్వా ఇంద్రియ

ములను జయించి, విదిత్వాషట్ = సంధ్యాదిగుణములను తెలిసి సప్తహిత్వా=వ్యసనముల నేడింటిని విడిచి సుఖీభవ, సుఖవంతుఁడవు కమ్ము. అని సందర్భోచితముగాఁ దోఁచుచున్నది. దీని ననుసరించి పద్యపాఠముండవలయును. అది యేదియును సరిగా కానరాదు. కాని ఉన్నదానికేదో ఒకవిధమున ఆలోచింపవలయును కావున, ఒకటిఁ గొని శ్రద్ధనవలంబించి; రెంటి నిశ్చలయుక్తి నేర్చి, అర్థ నీతిశాస్త్రముల రెంటిని స్థిరమగు పూనికతో నేర్చికొని; మూఁటిని=ప్రభుమంత్రోత్సాహ శక్తులను, నాల్గింటిన్, రాజవిద్యలు నాల్గింటిని వశము చేసికొని; ఏనిటిని గెల్చి=ఇంద్రియములను గెల్చి; ఆఱిటి నెఱిఁగి=సంధ్యాది గుణములను, లేక "అర్థాగమో నిత్యమరోగితా చ ప్రియా చ భార్యా ప్రియవాదినీ చ, వశ్యశ్చ పుత్రోఽర్థకరీ చ విద్యా షడ్జీవలోకస్య సుఖాని రాజన్. అనుప్రకారము వానిని తెలిసి; లేక "నిద్రాతంద్రాభయంలజ్జా చాలస్యం దీర్ఘసూత్రతా, షడ్దోషాః పురుషేణేహ హాతవ్యా భూతిమిచ్ఛతా" అనుప్రకారము ఆ యాఱుదోషములను, త్యాజ్యములుగా నెఱిఁగి; ఏడువిడిచి, వ్యసనముల నేడింటిని విడిచి, అని చెప్పవచ్చును.

లోకసామాన్యధర్మపక్షములో — ఒకటిఁగొని=విద్యనవలంబించికొని; రెంటిని=ఐహికాముష్మిక సాధనముల నేర్చి; మూఁటిన్=త్రివర్గమును, నాల్గింటిన్=వర్ణాశ్రమధర్మములను వశపఱచుకొని=సిద్ధింపఁ జేసికొని; ఏనిటిన్=ఇంద్రియములను గెలిచి; ఆఱిటిని, కామక్రోధాదులు శత్రువులుగా నెఱింగి; ఏడు వ్యసనములను విడిచి అనియును కావచ్చును. కాని ముందీవిదురుని వాక్యములలోనే "వెలఁదిజూదంబు" (2-44) అను పద్యములో సప్తవ్యసనములు దూషింపఁబడియున్నవి కాఁబట్టి యిచట ఏడు

విడిచి అను దానికి వ్యసనములే అని చెప్పుట, యేపక్షములో నైనను సరిపడదు. అంతకంటె మఱియొక అర్థము కానరాదు. విదురాభిప్రాయము తెలియఁబడదు.

49 ఐ. ఇట్టి చందంబులు ధర్మనందనునకుం గలవు.

అని చెప్పినాఁడు. మీఁదఁ జెప్పిన వానిలో కొన్ని దోషములు కొన్ని గుణములును ఉండుట చేత, ఈ వచనముకు దోషములచోట అవి లేవని విపరీతలక్షణచే నర్థము చెప్పవలసినట్లు కాన్పించుచున్నది.

ధృతరాష్ట్రుడు విదురునితో

50 తే. హితముఁ గర్తవ్యమును దగఁ దెలియుదీవు
ధర్మసుతుచందమును విదితంబు నీకు
నట్లు గావున నెఱిఁగింపు మఖిల కార్య
జాతమునఁ జిత్తతాపోపశమము గాఁగ.

ధృతరాష్ట్రుఁడు మొదలఁ జిత్తతాపోపశాంతిని కోరియే కదా విదురుని అడిగినాఁడు. విదురుఁడును పాండవులను పిలిపించి వారి భాగము వారి కిచ్చివేయుటయే కర్తవ్యముగాఁ జెప్పెను గదా! ఇట్లుండఁగా మరల కర్తవ్యము నడుగుట, విదురుఁడు చెప్పినట్లే, తాను చేయుటకా? లేక మాటమాత్రము వినుటకా? ధృతరాష్ట్రుని అభిప్రాయమేమి? విదురునిమాట ననుసరించినట్లు నటించుచు, తన కేదో యొకరీతిని మాటలమాత్రముననే చిత్తశాంతి కావలెనని కోరినట్లు తెలియఁదగియున్నది.

విదురుఁడు చెప్పుట.

2-52. ఉ. దక్కను రాజ్య మంచు నకటా యిటు సమ్మతి భాగమీక నీ
పెక్కటి మ్రింగఁజూచె దది యెట్లుఁగుఁగన్ వినుమీనులోలతన్

గ్రక్కున నామిషంబుచవి గాలము మ్రింగినచాడ్పుగా వె యి
ట్లుక్కివుఁడయిన నీ కొడుకు నుల్లమునున్నటు లాడఁగూడునే.

ఇందు ధృతరాష్ట్రుఁడు తన్నొత్తి యడుగుటను కర్తవ్యాంశమును తెలియనడుగుచున్నట్లుగానే సమర్థించి, తన యభిప్రాయమున పాండవులకు భాగ మిచ్చివేయుట అనుదానినే, మఱియొకభంగిని దృష్టాంతపూర్వకముగా, చెప్పుచున్నాఁడు. ఈ పద్యమం దభిప్రాయము చాల గూఢముగా నున్నట్లు తోఁచుచున్నది. ఇంతకుముందు వారి భాగము వారి కిచ్చివేయుమని చెప్పుచున్నప్పటికిని, మరలమరల ధృతరాష్ట్రుఁడు "నీవు ధర్మాధర్మజ్ఞుండవు; నయానయవిదుండవు" అనుచు నడుగుట వలన ధృతరాష్ట్రుని మనమున నొక ధర్మసందేహ మూహించి, యిట్లు విశేషించి చెప్పియుండును. ఎట్లనఁగా, ఈరాజ్యభాగము ధర్మరాజుకు, దుర్యోధనునకునా? తనకును ధర్మరాజునకునా? లేక తనకును పాండురాజునకునా? అని శంకించి, తాను జీవించి యుండఁగా ధర్మరాజునకు, దుర్యోధనకును కాదు. ఇఁక తనతో భాగభాక్కు పాండురాజుగాని ధర్మరాజు కాఁడు. పాండురాజు మృతినొందినాఁడు గాన నతని భాగము తనయందు సంక్రమించుట న్యాయ్యమే అయి యుండు నని ధృతరాష్ట్రుఁడు తలఁచి, తన్ను ధర్మాధర్మవిదుండవు, నయానయజ్ఞుండవు, అని అనుటలో తాను పాండవుల భాగమియ్యకున్నను అది ధర్మవిరుద్ధము, నీతివిరుద్ధము కాకుండునటులఁ జెప్పుదునేమో అని అట్లడుగువానిగాఁ దలచి ఆసంశయమును తీర్చుటకయి "నీ తమ్ముఁడు మృతినొందుటను, మొదల పాండవుల కెట్లో భాగ మిచ్చివేసినందును, గూఢముగా విషాదమొంది, అందుకే జూదమును కల్పించి వా

రించి ఇంతకాలమున్న, ఏకభోగ్యముగా ననుభవించుటచేత దక్కెనని తలంచెదవు కాని, అది అట్లు కానేరదు. పాండురాజు మృతినొందినను అతని కది పిత్ర్యమగుటచేత స్థిరదాయములో పుత్రులు లేనప్పుడు దానికి పౌత్రులు హక్కుఁ గలవారై యుందురు కావున, ధర్మరాజునకును, నీకును దాయము కాని నీ కొడుకు ధుర్యోధనునితోఁ గాదు. ఇప్పటికి, నీవే స్వతంత్రుఁడ వగుటను వారి భాగమిచ్చివేయు స్వాతంత్ర్యము నీయందే ఉన్నదనియు, జూదములో హరించుట న్యాయ్యమై చెల్లదనియు, "ఎక్కటి, ఒంటరిగా మ్రింగఁదలఁచెదవు" అవివేకి భక్ష్యాభక్ష్యముల నెఱుఁగక, జీర్ణము కానిదానిని మ్రింగినచో అది యెట్లు జీర్ణమగుననియు, అఱుఁగుట అనగా "పరిణామే సుఖావహం" అను న్యాయమున జీర్ణమయినపుడు సుఖకరము కానిది, జీర్ణము కానిదనియే అనియు, "ఆమిషము చవిఁగొని గాలమును మ్రింగిన మీనమెట్లగునో" అట్లే ఈ ద్యూతసమయ ప్రకార మింతవఱకును అనుభవించుటచే నీక భాగమే లేదని హరించినచో అట్లె అగునని తాత్పర్యముతో నిట్లే విదురుఁడు చెప్పియుండును.

ధృతరాష్ట్రుఁడు.

55. క. ఇందాఁక నీదుపలుకుల, డెందము తాపంబు గొంత డిందువడియె నా
కుం దగ నయానయంబుల చందంబులు సెప్పుచుండు సౌజన్యనిధీ.

ఇందు కొంత తనకు చిత్తశాంతి అయినట్లు చెప్పెను కదా! అది వారి భాగమిచ్చుకొనుట కొప్పికొనుటనా? లేక విదురుని నీతివాక్యముల వినుచుండుట మాత్రముననా? భాగ మిచ్చుటకు సమ్మతించినచో, నింతవఱ కెచ్చటను తననోటను భాగమిచ్చెద

ననక, కొంత చిత్తశాంతి అయినదనియు, ఇంకను "నయానయముల చందంబు చొప్పు" చెప్పుమనే కోరుచుండుటను, విదురుఁ డింతవఱకును చెప్పినదానిలో తనకిష్టము, కానరామిని, దానితో తృప్తిలేక రాజనీతి బహువిధము లయ్యుండును అందు కొరతవెట్టి విదురుఁడు తమప్రతిపక్షమువారికి భాగమిచ్చి సంధి చేసికొనునట్టి నీతియే చెప్పుచున్నాఁడు వాని శత్రువుల నెట్లయినను వంచించి, వారిసిరిహరించుటయే రాజనీతి అని కర్ణశకుని దుశ్శాసనులు చెప్పునట్టి చొప్పు ఎచ్చటను కానరానందున అట్టి మాట ఎచ్చటనయిన చెప్పునేమో అను ఆశచేత నట్లు కోరుట కావలెను. అట్టి అభిప్రాయము ఈపద్యమందలి "ఇందాక" "కొంత" "నయానయంబుల చందంబుచొప్పు" అను పదముల వలన స్ఫురించును. లేక నీవు నయానయముల చందమును చెప్పుచుండుము అని కాలయాపనముకు మాత్రము కోరుటకాని అయి ఉండును.

56. ఆ. కమియఁబండకుండ....

57. తే. మాలకరి పువ్వములు గోయు....

ఈ విదురుని వాక్యములను ప్రకృతమున సందర్భించుట దుర్ఘటముగా నున్నది.

59. క. ఎదిరికిహితమును ప్రియమును...

60. క చెలిమియుఁ బగయు...

61. క. చెడిదముగఁ గత్తి, గొడ్డటన్...

62. క. తనువున విఱిఁగిన యలుగులు...

ఈ పద్యములుకూడ పూర్వోక్తముకు సందర్భించినట్లు కానరావు కాని.

63 ఆ. అక్కట ధర్మనందనుని యాస్యము నం కొకనాఁడుకీడుప
లుక్కఁడు లేదు నీ కొడుకు లొండొరుమీరి నికృష్టవాక్యముల్
పెక్కులు పెక్కు భంగులను బ్రేలుచునుండఁగ నీవు వానికిన్
బ్రుక్కక వించు నుండె దను రూపమె నీకిఁక కౌరవేశ్వరా.

అను నీపద్యములో ధర్మరాజకౌరవులయందు విశేషించి పలుకుల చందమును నిరూపించి చెప్పియుండుటను పైపద్యములలో సామాన్యముగా పలుకుల చందము నే చెప్పి, ఆ పలుకు లుచితములయి యుండనప్పుడు కార్యసిద్ధి కానేరదని సూచించి, ధర్మరాజు నొద్ద ననుచితపు పలుకు లేదనియు నీ కొడుకులయందే, నికృష్టవాక్యములు కానఁ బడుచున్నవి కాన, ధర్మరాజు సంధిని కోరునుగాని, నీ కొడుకు లొప్పరనియు, దానికి నీవును కాదనక, ఊరకుందువు కాఁ బట్టి సంధికాదని తాత్పర్యము.

64 ఆ. చేటు కాలమయినఁ జెట్టమాటలు నెఱి
గాని తెరవునట్టి కర్జములును
దగవు లట్లతోఁచుఁ దగియెడు నవి యవి
నీతులఁగ మనమున నిశ్చయించు.

ఈ పద్యమందు "నిశ్చయించు" అను క్రియకు కర్త కానరాదు "అవివేకి" అని అధ్యాహృతమగును.

82 క. చిత్త యుపచారములనే
నుత్తముఁ డగు ధర్మ తనయు నుడికించితి దు
ర్వృత్తులగు మత్సుతులకును
మిత్త్రమగుం బోర వగలు మిగులకయున్నె.

2-33 వ. నెవ్వగనివ్వటిల్లనీక నిలుపనట్టిదియెయ్యది దాని నెఱిఁగింపుము;

అను నీని వలన ధృతరాష్ట్రుఁడు తనయభిప్రాయమును తానే స్పష్ట పఱచుట కాన్పించుచున్నది.

86 క. జ్ఞాతుల పోరితమును గోవ్రాతము వాక్రమము విప్రవర్గము చనువున్
నాతుల గారింపమి యును బ్రీతింజన నిచ్చు నతని పెంపాప్సునృపా.

ఈ పద్యముకు సరి అయిన అర్థము కానరాదు. కొందఱీ పద్యములో "జ్ఞాతులపూరితమ"ని దిద్దిచదువుదురు. కొందరు "విప్రవర్గము చనువు" మంచిదనియును, కొందరు మంచిది కాదనియును చెప్పుదురు. ఏదో ఒకరీతిని మనము సరిపఱచుకొనవలయును. ఎట్లనగా, "జ్ఞాతుల పోరితము" అనగా వారితో విరోధము; "గోసంఘమును పీడించుట"; "బ్రాహ్మణుల యెడల చనువు" అనగా అనాదరము: స్త్రీలను గౌరవింకుండుట;" గారాపుపట్టి అని ప్రేమాస్పదమగు పుత్రునకు ప్రయోగముగలదు ఇవి లేకుండఁ జేయుగాని పెంపు (అతిశయము) ఒప్పును ఇందుకు సంస్కృతభారతములో నిశ్లోకములు

శ్లో. సంపన్నం గోషుసంభావ్యం (సంభావ్యం)బ్రాహ్మణే తపః సంభావ్యం చాపలం స్త్రీషు సంభావ్యం జ్ఞాతితోభయం.

బ్రాహ్మణేషుచయెశూరాః స్త్రీషు జ్ఞాతిషు గోషుచ వృంతాదివఫలం పక్వం ధృతరాష్ట్ర పతంతి తే.

ఈ శ్లోకము సముచి తార్థమును మనమునందుంచి కొని, కొంతమార్పుతో సోమ యాజిగారు చెప్పినట్లు కానఁ బడుచున్నది.

శ్రీ

శ్రీమహాభారతవిమర్శము

ఉద్యోగపర్వము, తృతీయాశ్వాసము.

ధర్మరాజు ఎల్లవారితోను పలుకుట.

3-4 క. మనము జనార్దను పాలికి, జని కౌరవ సభకువతని జనుమని ప్రార్థిం
చిఁ మేలు బంధుహితగురు జనములతో రణము కాక సంప్రీతియగున్.

ఇందు ధర్మరాజు శ్రీకృష్ణులను ప్రార్థించుట సంధికొఱకే కదా ! ఇంతకు ముందే విరటునగరమందుండగా శ్రీకృష్ణుల అనుమతినే ద్రుపదపురోహితుని పంపియేయుండెను కదా ! అతని వలననే కౌరవుల అభిప్రాయము తెలిసినది కదా! ఇట్లుండఁగా మఱల శ్రీకృష్ణులను పంపఁదలఁచుటకభిప్రాయమేమి? రాజనీతి ప్రకారము సామకు ప్రయత్నింపక యుద్ధ ప్రారంభము చితముకాదని సంధికాదని తెలిసియును, వారినిఁ గోరుట యిష్టముకాకున్నను, లోకనింద తమకు లేకుండుటకు దూతను పంపవలయునని శ్రీకృష్ణులు నిశ్చయించిన ప్రకారము, పురోహితుని పంపి, అతనివలన సంధికుదరదని తెలిసినను, దూరదృష్టియు, బుద్ధికుశలతయుఁ గల ధర్మరాజు మరల శ్రీకృష్ణుని పంపఁదలంచుట కభిప్రాయ మిట్లయి ఉండవచ్చును. సంధికి కావలసిన వచనరచనలో నెల్లవారికంటె నెక్కుడు నైపుణిఁ గలవాఁడగుటను, సంధి పొసఁగనప్పుడు సమయోచితముగ నితరోపాయములను

చేయుటకు శక్తియుఁ నేర్పును, స్వాతంత్ర్యమునుఁ గల శ్రీకృష్ణుఁడు నయభయములను కూడ వారికి కనఁబఱచి, కార్యసంధానము చేసినచో చేయవచ్చునని ధర్మరాజు తలంచియుండును.

6 క. ఆపదఁ గడుపం బెట్టఁగఁ, నోపి శుభం బైనదానినొడఁగూర్పఁగ మా
కీపుట్టువునకుఁ బాండు క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపిచనియె మహాత్మా.

ఇందు శ్రీకృష్ణుఁడు పాండవులకు గడుపఁ బెట్టిన ఆపదయెద్ది? ముందురాఁబోవునదియా? గడచినదా? ఈ పుట్టువునకు అనుటవలన ఈ జన్మములో నంతటికిని అనియుకదా? అయినప్పుడు ముందు లాక్షాగృహ దాహమందు శ్రీకృష్ణుఁడు తమను కాపాడుట లేదు కదా? అంతకంటె నెక్కుడాపద ఉన్నదా? అప్పుడు శ్రీకృష్ణుఁ డేందు కుపేక్షించినాడు? విచారింపవలయు పాండవులకు వచ్చు నాపదలు పౌరుష నివర్త్యములయినవి; వారి పురుషకారము చేతనే నివర్తింపఁ బడునని సకల జ్ఞాననిధియగు శ్రీకృష్ణుఁడు తెలిసియే అప్పుడుపేక్షించెను, కాని వీరియెడల నుపేక్షకాదు. కౌరవసభలో ద్రౌపదికిఁ జరిగినమానభంగమహాపత్తును అనితరసాధ్యమగుదానిని, తానే తొలగించి రక్షించినాఁడని అభిప్రాయము. "పాండుక్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపిచనియె" ననఁగా; "తండ్రిలేనివారికి మేనమామయే శరణము" నులోకన్యాయమును పట్టి, పాండురాజు చనిపోగా తమభారము వసుదేవుని కృత్యమంతయును వాసుదేవునిది అగుట ఉచితమని అట్లు చెప్పి యుండును.

7 తే. సమయ మిది మిత్రకార్యంబు చక్కఁజేయ
నీకతంబున మే మవనీశుఁ డయిన యా

సుయోధనుతోడి పోరాటఁ దక్క
యనుభవింతుము మాయంశ మగుధరిత్రి.

ఇందు "సమయమిది" అనఁగా నేమి? మిత్రకార్యము చక్కఁజేయుట యెట్లు? అనఁగా పూర్వము మేమరణ్యవాసములోనున్నప్పుడు బలభద్రాదులతో మమ్ముఁజూడ వచ్చి, ప్రసంగములో నప్పుడే కౌరవుల సంహరించి మాకు రాజ్యమిచ్చెద నని నీవుచెప్పఁగా, ఇప్పుడే అట్లు చేసినచో నాకు సత్యభంగమగును కాన నట్లు కాకుండ ద్యూతసమయము తీఱిన పిమ్మట నీయనుగ్రహముకు సమయమని చెప్పియుంటిని. ఆసమయమిది వచ్చినదని అభిప్రాయము. "మిత్రకార్యంబుఁ జక్కఁజేయుట; పోరాటలేక మాభాగము మాకు వచ్చునట్లు సంధిఁజేయుట సుఖముగాన, నదిచక్కఁజేయుట. ఈపక్షములో "మాయంశమగు ధరిత్రి" అనుటను సంధిలో మాభాగము మాత్రమే మాకువచ్చును, అయినను అది సుఖలబ్ధము కావున, చక్కఁజేయుట అగును; లేక సంధికానప్పుడు యుద్ధములో మమ్ముఁగెలిపించి యావద్రాజ్యమును మాకుఁదెచ్చుట. "అవినీతుఁడైన యీసుయోధనుతోడి పోరాటఁదక్క" అనుటలో మొదటి పక్షములో యుద్ధములేక సంధిలో సగమైనను, "పోరు లేకఁ బుక్కెడు" అను న్యాయమున నదియె లెస్స. కాక యుద్ధమయినప్పుడు వారందరు నశింప ధరిత్రి అంతయు మా యంశమే అగును. అప్పుడును అవినీతులగు వారందరు నశించుటచే మఱి పోరాట అనగా కలహములు లేక నిష్కంటకముగా ననుభవింతుము. నీకెట్లుచితమని తోఁచునో అట్లు చేయవలయునని తాత్పర్యము.

8 వ. నీకు మేము ప్రద్యుమ్నాది కుమారులతోడి వారము మఱి దురితంబులు వొరయకుండ నరసి రక్షింపుము.

మేము నీకు ప్రద్యుమ్నాదులువలె రక్షణీయులము. మాకెట్టి యాపదలు లేకుండు నటులననియు, లేక బంధుహింసవలని దురితంబులు లేకుండగ రక్షింపుము. పుత్రులు తండ్రులను కోరుటయేకాని, ఉచితానుచితముల నరసి వారి కోరికల నెఱవేర్చుభారము తండ్రులదియే కావున, మేమును అట్లే కోరుట మాత్రమెకాని, దాని యౌచిత్యమాలోచించి, చేయుభారము నీదేయని తాత్పర్యము.

15 తే. క్షత్రధర్మ మింత కష్ట మగుఁగా పర
ధర్మ మాచరింపఁ దగ దటండ్రు
గాన శస్త్రజీవికయ తగి యున్నద
యైనవంశనాశ మనభిమతము.

క్షత్రధర్మమనఁగా, విజయోపార్జనము; అది హింసారూపమగుటను కష్టము. ఇచట హింసారూపమగు స్వధర్మముచితమా? పరధర్మావలంబన మచితమా? అని విచారించి "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః" అను ప్రమాణవచన ప్రకారము హింసాహింసలలో నహింస ఉత్తమమయ్యును, క్షత్రియులకు హింస, స్వధర్మమగుట విశేషవిధి ప్రాప్తము కావున, అదియే క్షత్రియులమగు మాకు ఉచితమయ్యెను, అట్టి హింస ఇతర విషయమయినచో నుచితముగాని తమ వంశహాని అయినచో నదియే విశేషవిధిని అధర్మమగునని చర్చించినాఁడు. ఇచట సామాన్య విశేషభావ మాలోచింపనగును, అహింస పరమధర్మమా? స్వధర్మము పరమధర్మమా? "మా

హింస్యాత్సర్వభూతాని" అను శాస్త్రము "గామాలభేత". అనెడు విశేష శాస్త్రముచేత పరాహతమగుటను, అహింస, సామాన్య ధర్మము, స్వధర్మము విశేషధర్మము కావచ్చును. అయినను వంశనాశనము హింసలలో విశేషమగుటను విశేషశాస్త్ర నిషిద్ధమని తాత్పర్యము.

21 చ. పగయడఁగించు టెంతయు శుభం బది లెస్స యడంగునే పగం
బగవగఁ గొన్న మార్కొనక పల్కక యుండగవచ్చునే కడుం
దెగ మొదలెత్తి పోవఁ బగఁదీర్పక యుండినఁ గార్యమొందునే
మిగతివలంచినం బగకు మేలిమి లేదు ధ్రువంబు కేశవా

21 ఉ. కావున శాంతిఁబొందుటయ కర్జము దానది యట్టులుండె శ్రీ
గావలెనంచుఁ బోరితము గామియుఁ గోరెద పెల్లసొమ్ములుం
బోవుటయుం గులక్షయము పుట్టుటయున్ వెలిగాఁగ నొందుమై
నేవిధినైనఁ జక్కబడు టెంతయు నొప్పుఁ జుమీ జనార్దనా.

పైపద్యములో నహింసకంటె స్వధర్మమే యెక్కుడని నిరూపించి, యీపద్యములో హింసాహింసలలో హింసయే స్వధర్మమైనప్పుడు అది యెక్కుడైనను, హింసాసాధ్యము సిరియే కదా! దానికై కులక్షయకరమగు క్రూరకర్మకంటె నొండునుపాయమున, ఆసిరి లభించునపుడు హింసకంటె నదియే విశేషించును. క్షత్రధర్మము అయాచితము కాని హింసయే కావలెనని కాదు; కావున నట్టియుపాయాంతరమున మాస్వధర్మమగు అయాచితమునకు భంగము లేకుండునటుల సామాదులలో నొకయొండు నుపాయముచేత కార్యము సాధింపపలయునని తాత్పర్యము. సామాదులుకూడ రాజనీతికి విరుద్ధములు కావు. విశేషించి యుద్ధోపాయము కంటె ముందు సామాదులచేతనే కార్యము సాధించుకొనుట యుచితముకదా! మీఁది రెండు పద్యముల సముదితార్థ మాలోచింపగా, తమకు వారు కలుగఁజేసిన యిడుములనుఁ గలిగినదిపగ. దాని నడగించుట ఉచితము. అదియును యుద్ధముచేసి వారిని చంపుటవలనను, లేక శాంతినొందుటవలనను కలుగఁగలదు. ఈరెంటిలో నెద్దానివలన పగనుడిగింపవలయుననఁగా, యుద్ధమున్న పగయే కావున, బగవలనఁ బగదీర్చుకొనఁ బ్రయత్నముకంటె క్షాత్రములో హింసకంటె సామాదులెట్లు విశేషములో పగనుడిగించు నుపాయములలో యుద్ధముకంటె శాంతియే విశేషధర్మమను తాత్పర్యముతో, క్షత్రధర్మమునకు విరోధములేకుండగ సామాదులచే మాభాగము మాకు లభించినచో మేము శాంతివలనఁ బగనుడిగి సుఖమున నుందుమని తాత్పర్యము.

23 చ. మనమునఁ బక్షపాతగతిమాదెస మానుము.

ఇందు మేము నీకాశ్రితులమని మా యందు పక్షపాతమును విడిచి మా రెండు పక్షముల వారికిని ధర్మము నీతి, హితము, పెంపును కలుగునట్లును, విదురాదులకు సమ్మతము అగునట్లును, అనఁగా సంధిలో మా భాగములు మాకు అగునట్లు అయినచో నన్నియు సిద్ధించునని తాత్పర్యము. యుద్ధసహాయులగు రాజులెల్లరు వినుచుండ పరుషముగాఁ బలుకుట వారికందఱికిని భయప్రదర్శనార్థమై యుండును. నీతిజ్ఞులగువారు. నీ నయ వాక్యముల చేతను, అవినీతులు భయ వాక్యములచేతను, సంధికి సమ్మతింతురని దూరాభిప్రాయము.

3-24 చ. తగవులఁ బోకలు.

నీవు సంధివిఘటనము చేసినావను నిందల పాలు కాకుము. దీనికే "తగవున బోక" అని పాఠాంతరము. అప్పుడు ఆ రాజు తగుమార్గమున రాక, అని అర్థము. ఆనింద సుయోధనుని యందే యుండనిమ్ము.

25 మ. సుతువాఁడై వినయంబు సేకొనక...

ఇందు ధృతరాష్ట్రుఁడును, కుమారునట్టి వాఁడే అయి న్యాయమును చెప్పక ఊరకున్నచో సంధికాదని తెగపడక మన ధర్మస్థితి లోకమంతటను ప్రకాశమగు నంత వఱకును అనఁగా మనమే త్వరపడి సంధి విఘటనము చేసికొని తెంపుచేసి నామనునింద మనకు లేకుండఁగాఁ జేయుము అని "వేగ తెగంబాఱక" అనుటవలన "తెంపుసేయు నెడలోకంబెల్ల మెచ్చున్" అనుటవలనను తెలియుచున్నది. శక్యమగునంత సహించి సంధికే ప్రయత్నించి, కానప్పుడు యుద్ధమునకు తెగపడినను లోకము మెచ్చును. అట్లైనఁ బో నామనము నిశ్చింతమయి యుండును.

26 ఆ. ఇన్ని సంకటముల నింతయు నిభ్భంగి...

మీఁది వానిలో యుద్ధము వలదని కాన్పించుచున్నది. ఈ పద్యములో నీవుచేయఁదలచినదే నాకు ప్రియమని కాన్పించుచున్నది. ఇందువలన పరస్పర విరోధమును శంకింపరాదు. ఇంత వఱకును తమకు కలిగియున్న మనోవ్యథను తెలిపి, రోగి తన బాధను తెలిపి దానిని తీర్చుమని వైద్యుని కోరుటయే కాని, యెట్లు తీర్పవలయునో ఆభారము వైద్యునిదే అయినట్లు మామనోవ్యథనుకూడ నెట్లు తీర్పవలయునో ఆ భారము నీదే కావున నీ వెట్లుచేసినను నాకది సమ్మతమే అని తాత్పర్యము. రోగి రుచ్యమయిన మందువలన తన రోగబాధ తీరుటను గోరుకొటో నేను

ను అహింస వలన మా కార్యసిద్ధిఁ గోరుట అట్లే కాబట్టి మా వ్యథ ఎట్లు తీరునో అట్లేచేయుమని అభిప్రాయము.

28 క. నీవు సుయోధను పాలికి ..

29 తే. కుటిలమతు లవినీతులు...

ఇందు మొదటి పద్యములలో నీవు చెప్పిన చక్కని సంధివచనములను వినడనియు, రెండవ దానిలో నీకు కష్టము వచ్చునట్టి రాజ్యమునొల్ల ననియు, నిన్నొంటిగాఁ బంప నొల్లననియును చెప్పఁబడినది. సంధి కాదని యా? శ్రీకృష్ణునికి కష్టమువచ్చునని యా? ఒంటరిగా వెళ్ల వలదని యా? ధర్మరాజాభిప్రాయము? సంధికాదను నిశ్చయ మున్నప్పుడేల శ్రీకృష్ణుని పిలిచి చెప్పవలెను? సంధికి వెళ్లువా రొంటరిగా, గాక సేనలతో వెళ్లుదురా? ద్రుపద పురోహితు డొంటరిగా వెళ్ల లేదా? శ్రీకృష్ణునకు కష్టము వచ్చునను శంక యెందుకు కలిగినది? పురోహిత బ్రాహ్మణుని పాటిశక్తి శ్రీకృష్ణునకు లేదా? ఆలోచింతము సంధికాదని తోచినను. సంధి కానప్పుడు నయభయములను కనుపఱచి దానభేదములయిన చేయనేర్పుగలవాఁడు శ్రీకృష్ణుఁడు గనుక నతనిని పంపఁదలచెను. కాని కౌరవులు కుటిలచిత్తులగుటచే ఒకవేళ దానిని సహింపక కీడుఁ దలంతురని శంకించుట ఉచిత మగును. పురోహితుఁడు యథాశ్రుత వక్తగాని, యెక్కువ చెప్పువాఁడు కాఁడు; ఆలాగుగాక, కృష్ణుఁడు ఎక్కువగాఁ జెప్పఁగా వారు సహింపకపోదురేమో ఇంతియ కాక ద్రౌపదీస్వయంవరములో అర్జునుఁడు, బ్రాహ్మణరూపములో నుండుటను, ద్రౌపది యాతని వరించుట, తమకసహ్యమయినను బ్రాహ్మణుఁడు, వధ్యుఁడు కాఁడని, ద్రుపదుని పై, నుద్ధతులగుటకు అట్లే, ఇపుడుకూడ, బ్రాహ్మణునకు వా

రొక అపాయమును తలంపరని పురోహితుని పంపినపుడు ధర్మరాజుకు శంక యుదయింపక పోయి యుండును. శ్రీకృష్ణునియందో, ఇతఁడే తమకెల్ల కార్యములకును ముఖ్యుఁడని అతనియందు కౌరవులకు అసూయఁ గలుగవచ్చునని ధర్మరాజు శంకించి యుండును. కాని, ఉత్తర గోగ్రహణములో నర్జునుఁ డొక్కఁడే వెళ్లి యెల్లవారిని జయించుకొని రాగా శ్రీకృష్ణుఁడంతకంటె శక్తిహీనుఁడా? ఇది ఆలోచనీయము. ధర్మరాజు లోకజ్ఞుఁడును అతినిపుణమతి యగువాఁడు గావున తనకు స్వకార్యపరతా దోషమును పామరలోకము, తలంపకుండుటకు అట్లు చెప్పియుండును.

40 చ. అనవుడు కృష్ణుఁ డిట్లనియె నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ
తత్తనయుఁడ యేల నీ పలుకు తథ్యము నీ తలఁపే నెఱింగితి
న్మనమున శంక దక్కుము వినన్ వలతే వినుమింక నిక్కము
ల్గిన నచటం గలండె రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్.

మీఁది ధర్మరాజువచనములలో దుర్నయములో దుర్యోధనుఁడు ప్రధానుఁడును, ధృతరాష్ట్రుఁడు పేరొవరుఁడగుటను, వానికనురూపుఁడును, అనునటులఁ గాన్పించుచున్నది. శ్రీకృష్ణ వచనములలో ధృతరాష్ట్రుండు ప్రధానుఁడు, దుర్యోధనుఁడు అనురూపుఁడును అయినట్లు కాన్పించుచున్నది. వారి అభిప్రాయమేమి? ధర్మరాజు ధృతరాష్ట్రునియందు తనకుఁ గల గౌరవ బుద్ధిచేత నతని నంతగా నిందించుట సమ్మతము కాక దుర్యోధనుని ప్రధానునిగాఁ జేసి యుండును. ధృతరాష్ట్రుఁడు పెద్దయు స్వతంత్రుఁడును కావున, అతనినే నిందింపవలయునని శ్రీకృష్ణాభిప్రాయమై యుండును; కాబట్టియే, ఈపద్యములో '(ఆ ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ తత్తనయుఁడ యేల' ధృతరాష్ట్రుఁడే అట్టివాఁడు దుర్యోధను

నే అననేల, అని చెప్పినాఁడు. లేక "తత్తనయుఁడ" అతని కొడుకే, "ఏలన్" రాజ్యమేలుటకు గాను, అనఁగా ఆ ధృతరాష్ట్రుఁడే అట్టి స్వభావము కలవాఁడని అర్థము కావచ్చును. మొదటిపక్షములో "నీపలుకు తథ్యము" అనఁగా "కావలమునఁ జక్కవినరు కార్యవచనముల్" అను నీమాట సత్యము; వారు వినరని నిశ్చయము. రెండవ పక్షములో "ఈపలుకు" అనగా నేను చెప్పినమాట, తథ్యము, అని అర్థము. ఈపద్యములో "అచట రణకేళికి మార్కొన నొక్కఁడేనియున్" అని శ్రీకృష్ణుఁడు యుద్ధమునే నిశ్చయించుటెట్లు? "శంకదక్కుము", అను చోట ధర్మరాజునకట్టి శంక నిజముగాఁ గలిగెనా? సంధికిఁబోవు వారికే యుద్ధము ప్రసక్తమగునా? ఆలోచింతము ధర్మరాజు వచనములో "ఒంటియుం దరుగుటడుగు" అని యుండుటవలన, అతని కాశంకనూహించి శ్రీకృష్ణుఁడట్లు పలుకుట ఉచితమగును. కాని ధర్మరాజుకా శంకయేల అనఁగా, నిజముగా నతని కా శంక మనస్సులో లేకున్నను, దుర్ణయోద్ధతులగు వారియొద్దకు నొక్కనిఁ బంపినందుకు లోకులు నన్ను నిందింపకుండుట కట్లు చెప్పుటకాని వేఱుకాదు. శ్రీకృష్ణ వాక్యములోఁగూడ, నచ్చటఁ దాను యుద్ధముచేయఁ గలవాఁడనని అతని అభిప్రాయము కాదు. ఎందుచేతనంటే, దుర్యోధనుఁడు, అర్జునుఁడును తన్ను యుద్ధసహాయునిగాఁ గోరవచ్చినప్పుడు తాను పాండవపక్షమున యుద్ధము చేయనని చెప్పియే ఉండెనుకదా! ఇప్పుడు యుద్ధము చేయునా? మఱేమనగా "నేనల్గినచో లోకములనే సంహరింపఁ గలను; నా అల్కచేతనే వారందఱు నశింతురు; నన్ను యుద్ధములో మార్కొన నుండువాఁడెవ్వఁడు? నాకు యుద్ధ ప్రసక్తి

యే ఉండదు. కావున యుద్ధముచేయనని పలికిన నేను యుద్ధము చేయవలసి వచ్చునని కాని, నన్నింటిగాఁ బంపినందుకు లోక నిందవచ్చునని కాని శంకవిడువుమని' అభిప్రాయము కావచ్చును.

31 క. పనుపుము కౌరవసభకే
జను మెట్లను మేల యర్థసంసిద్ధియగున్
మనకొకటం బాపము రా
కునికిఁ గతమైనపలుకు లొండెను గలుగున్.

ఇందు "ఎట్లనుమేల", అనఁగా సంధి అయినను కాకున్నను మేలే అనితోఁచుచున్నది. "అర్థసంసిద్ధి" అనఁగా సగపాలు సిద్ధించుట, కాని సంజయునితో చెప్పినట్లు అయిదూళ్లు మాత్రము కాదు. "మనకొకటం బాపంబు రాకునికిఁ గతమైన పలుకులు" అనఁగా సంధిఁ జేయుమనిఁగాని, క్షాత్రము విడిచి శాంతినుండుటనుకాని, లేక యుద్ధము తటస్థించినపుడు క్రూర కృత్యములోఁగాని, మనకు పాపము రాకుండునట్టి పలుకులు మనయందు పాపములేదని లోకులు అనునట్లు అభిప్రాయము. ఆపాపము వారిదేకాని మనదికాదని తాత్పర్యము.

భీముఁడు శ్రీకృష్ణునితోఁ బలుకుట.

43. క. సమరంబు గలుగునందును, మము వెఱపింపగ వలదుమాధవనీవా
కుమతియగు ధార్తరాష్ట్రుఁడు, శమించు కార్యంబువడపు సౌజన్యనిధీ.

ఇందు శ్రీకృష్ణుఁడు తమ్ము వెఱపించినట్లు భీముఁడు పలికెను గదా! శ్రీకృష్ణుఁడెచ్చట వెఱపించినాఁడు? భీముఁడెందుకాలాగు పలికినాఁడు? ధర్మరాజు యుద్ధములేకుండ సంధయే అగునట్లు చేయుమని చెప్పినప్పుడు శ్రీకృష్ణుఁడు సంధి కానేరదు; యుద్ధమే

అగును: అదియే కర్తవ్యము. అని మాటి మాటికి పలుకుచుండుటవలన అదియే వెఱపుగా భావించిభీముఁడు అట్లుపలికినాఁడు.

45. శా. పాపాత్ముండు మదాంధుఁ డాతులువనీ పంపెట్టునుం జేయఁగా
కోపం డడ్డము సెప్ప రెవ్వరును మానోద్రేకమున్ గర్వముం
గోపంబుం గదను ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పోనిత్తురు గాన నిన్నతఁడు జాలింబెట్టెడుం జూడుమీ.

ఆ దుర్యోధనుఁడు నీవుచెప్పినట్లు వినఁడు. అచ్చటి వారెవ్వరును వాని కడ్డము చెప్పరు. వానిని దురభిమానము, గర్వము, కోపమున్ను ఎట్లు త్రిప్పినో అట్లేవాఁడు తిరుగును. కావున ఆప్తులను వాఁడు బాధించుటలో వాఁడు పోయినట్లె పోనిత్తురు కాని, త్రిప్పఁజాలరు కాఁబట్టి, అతఁడు నిన్ను జాలింబెట్టెడుం జుమీ," అనఁగా బాధించును సుమీ అని అర్థము. ఇందు "మమ్మును వెఱపించెదవేల; నీవు సంధికిఁ బోయినపుడు దుర్యోధనుఁడు నిన్ను వెఱపునొందునట్లు చేయును సుమీ! అది నీవు చూచికొనుము. మా వెఱపు మాటకేమి?" అని తన ధైర్యగాంభీర్యములను ప్రకటించుచు శ్రీకృష్ణుఁడు మేనత్త బిడ్డఅగు తమను పరిహాసముగాఁ బలికిన వెఱపుమాటకు బదులుగా, నాతని గుఱించియుఁ దాను పరిహాసముగానే వెఱపుమాటగా "చూడుమీ" అని పలికినట్లూహింప నగును.

46- ఉ. చొచ్చినచోటఁ జొచ్చి తెగఁజూచెద నందు గడంగుచుండు న
న్నెచ్చడు బాహుగర్వమున నీచసుయోధనుఁడట్టివానితోఁ
బొచ్చెములేక కూడియునఁ బోఁక పోవఁగ రాదు నాకు వి
స్వచ్ఛుఁడు రాచవారుఁ గురుసంకటము చేటున కోపకుండుటన్.

నే నిచ్చట దాఁగిననచ్చటఁ దానును ప్రవేశించి నన్ను తెగఁజూచెదనంచుఁ జూచును అట్టి, వానితో నైచ్యము లేక కూడి బ్రతుకుట కొప్పికొనక తప్పకున్నది, నాకిట్లు సమ్మతము కాకున్నను అర్జునుఁడును ధర్మరాజును వంశ నాశమున కోర్వకుండుటచేత నని అర్థము. ఇందు "కురువంశము చేటునకు" అనఁగా యుద్ధమున కనియే కదా! అర్జునుఁడు ఇంకను తన అభిప్రాయ మెట్లో చెప్పనే లేదు కదా! భీముఁడెందుకట్లు పలికినాఁడు? ఒకప్పుడు ఇదివఱకు ముందే ద్యూతాంతమందును, పిమ్మట నరణ్యవాసములో నున్నప్పుడును, తాను యుద్ధమునకు విజృంభింపఁగా నప్పుడు వారు తనను వారించి యుండుటచేత నిప్పుడట్లు చెప్పినాఁడన్నచో, అర్జునుని అభిప్రాయము ఎప్పటికిని యుద్ధము వలదని కాదు కదా! అట్లుండఁగా నాతనిమాట వినకయే అట్లు నిశ్చయించుట సంగత మెట్లగును? విచారింతము.

అర్జునుఁ డిప్పు డేమియును పలుకకున్నను ధర్మరాజుపలికిన మాటలలో సంధియే కాని యుద్ధము వలదని కాన్పించుచున్నది. అర్జునుఁ డెప్పుడును ధర్మరాజుమాట నతిక్రమించువాఁడు కాఁడు. కావున నిప్పటికిని ఆతని అభిప్రాయ మట్లే అయి యుండునని నిశ్చయించి భీముఁ డట్లు పలికియుండును.

48 చ. తనపారి పోవు నంతకు నుదగ్రతయుం గపటంబు మాననే
ర్చునె ధృతరాష్ట్రసూనుఁడు యశోభరితం బగు భారతాన్వయం
బునఁ గొక నింద వచ్చునను బుద్ధి దురాత్ముల కేల గల్గు నా
యనయము పోయి హీనగతి నైన ఘటించిన నెంత యొప్పునో

ఈ పద్యములో నాల్గవపాదము కర్థము సరిగాఁ గానరాదు. యథాశ్రుతముగా మీఁది మూఁడు పాదములలోను దుర్యో

ధనుని దుర్నయము కనఁబడుచున్నందున ఇప్పుడు ఆ 'అనయము' అనఁగా దుర్నయముపోయి, అనియు, 'హీనగతిచేత నయినను ఘటించిన (సంధిఅయినచో) అని అర్థమగును. కాని హీనగతి యెట్టిది? యెవ్వరికి? దుర్నయము పోయినచో, వారికి హీనగతి యెందుచేతను? సరిగా నుండలేదు. అందుకే కాఁబోలు క్రొత్త పుస్తకములలో "ఆయన మెయి బోయి" అని దిద్దిపాఠమును వ్రాసినారు. కాని అప్పుడును అర్థమెట్లో తెలియరాకున్నది. ఈ పద్యములోనే మొదటనే "తనపారి పోవు నంతకును" అని యుండుటను, ఇచట "మెయి" అనుదానికి "శరీరము" అర్థము చెప్పినచో మెయిఁబోయి "అనుచోట మెయిన్+పోయి అని అగును కావున ఆ యర్థము సిద్ధింపదు. కాఁబట్టి యింక నేదో యొక విధముగఁ జెప్పవలయును కావున నిట్లగు నేమో! "ఆయనయము పోయి హీనగతి నైన ఘటించినన్" అనఁగా అట్టి దుర్నయము పోయి దురభిమానము విడిచికొని తనకది హీనగతి అని తలంచుకొనినను, సంధి కొప్పికొనినచో నెంతయు నొప్పుగా నుండును లేక, మనకు "ఆయనయము పోయి (దాయవిభాగపు శాస్త్రప్రకారము తప్పి) 'హీనగతి నైనన్" న్యాయముగా పాండురాజు దిగ్విజయములో సంపాదించినదియు శంతను రాజ్యములో సగపాలును కలిసి యెక్కువ రాకున్నను సగముగా నైనను మాకిచ్చుకొనునట్లు ఘటించినన్, సంధి అయినచో ఒప్పు అగునని కావచ్చును. దీనికి కొండఱు ధర్మరాజు తుదకు కోరిన ప్రకారము అయిదూళ్లు అయినను అని చెప్పుదురు. కాని అది భీమునికి సమ్మతము కాదు కావున, అట్టి అర్థము స్వారసికముగాఁ గానరాదు.

51\. క. అది యెవ్విధమున నైనను
నంబుజోదర సంధి జేయవలయున్.

అనఁగా మీరుఁ జెప్పినరీతిని మా కెక్కువచ్చునట్లును లేక సగమయినను ఏవిధముగా నైనను అని తాత్పర్యము.

53 తే. అని సహోదరు లాజి నాయాసపడుట
కోర్వమియుఁ గౌరవులఁ జంప నొల్లమియును
గలుగ నైయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రి
లైరి పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి.

ఇందు యుద్ధములో తనసోదరుల కాయాస మొల్లని వానిఁగా భీమునిఁదలంచెను కదా శ్రీకృష్ణుఁడు భీముని తలంపులో తనకే మాత్ర మాయాసము రావలదన్నియూ, లేక పరాజయము వచ్చునని శంకయా? క్షత్రియులకు యుద్ధములో నేమాత్ర మాయాసము రాకుండునా? ఇంతకుముందువారు యుద్ధములు చేయలేదా? భీమునకు పరాజయశంక అసంభావితము కదా! అది యెట్లయినను పాండవులే స్వయముగా శాంతించియుండగా, శ్రీకృష్ణుడు వారిని పురికొల్పు టెందుకు? భీముఁ డుద్ధతుఁడును, యుద్ధప్రియుఁడును అయ్యును, ఇప్పుడు అతని చిత్తవృత్తియే మారి, కరుణార్ద్రమగుటను శాంతవచనములు పలుకుట యుచితమగును కాని అట్లు అతనికి చిత్తవృత్తి మాఱుటయే అనుచితమని తలచి అట్లు చెప్పియుండును.

శ్రీకృష్ణుఁడు దుష్ట సంహారము చేసి భూభారము నడంచుటకే అవతరించిన వాఁడగుటను, భారత యుద్ధముకాక, దుష్ట సంహారము కాదు కావున, అది భీమార్జునుల మూలముగాఁ

గావలసినది కాఁబట్టి; భీముని చిత్తవృత్తి మరల మార్పుటకయి పురికొల్పియుండును.

55 ఉ. యుద్ధము మీఁద వేడ్కయు మహోగ్ర విరోధుల నుల్కఁజేయుద
ర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి సైప యేపు రాజ్యసం
సిద్ధిని జాగ్రజన్మునకుఁ జేయు తలంపును గల్గు నీ వసం
బద్ధము శైత్యవాక్యములు పల్కుట యొప్పునె కీచకాంతకా.

మీఁది పద్యములోని అభిప్రాయమునే స్పష్టపఱచి అట్టి తలంపు గలనీకు ఇట్టి శాంతవచనముల అసంబద్ధములు అనుటలో నీవా తలంపు మార్చుకొనుట అసంబద్ధమని తాత్పర్యము. తలంపుమార్పుటకే పురికొల్పుట.

59 ఉ. బంటుతనంబు మాటలకుఁ జాలదు పాండునృపాలు పాలనై
కొంటయు చాలుననన్న నృపకుంజరు మాటలకడ్డరా
కుంటయె యొంగ భీమును సుయోధను చందముఁ జూచి యుర్విడి
మంటి పుపేంద్ర నన్ను నిరణాగ్రయుతన్ గనుఁగూడ లించవన్.

ఇది భీమునివాక్యము.

ఇందు శ్రీకృష్ణుఁడు తనయందు పిరికి తనమాపాదించినట్లు తెలిసికొని భీముడు శాంతినివిడిచి "నీవు నాకు యుద్ధప్రోత్సాహపు మాటలు చెప్పదవేల? ధర్మరాజు మాతండ్రి పాలుమాకు వచ్చుటే చాలుననుట వలన, అనఁగా సంధియేకాని యుద్ధము వలదనుటను, అతనిమాట కడ్డురాఁగూడదని అట్లు చెప్పితినికాని వేఱుకాదు. నీవు దానిని వెఱపుగాభావింపవలదు. ధర్మరాజుమాటలకు నేనడ్డురారాదు. నాకును ధర్మరాజు మాటలుఅడ్డుకానిచో అనఁగా నాతఁడు యుద్ధము కొప్పికొనినచో; మును యుద్ధమయినప్పుడు దుర్యోధనుఁడు నావలనఁ బొందిన పాటును చూపి, నిన్ను

ముదలకించెదను" అని చెప్పెను ఈ పద్యములో "చందముఁ జూచి" అనుచోట "జూపి" అనిపాఠమున్నచో బాగుగనుండును.

63 ఉ పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్నను గోరి యెంతయుం
ప్రార్థనఁ జేసె దాని కనురాగము వొందితి నేను గాన
యుద్ధార్థులమైన మాకు నిను నాసపడం దగదే యశంబు నా
వార్థములున్ విరోధివిజయంబునఁ దక్కఁగ నొంటఁ గల్గునే.

దీనిలో అర్జునుఁడు తన్ను యుద్ధములో సారథి యగుటకు ప్రార్థన చేసె అనుటవలన అర్జునునకు యుద్ధమం దత్యంతౌత్సుకత ఉన్నట్లును, తనను సారథిగాఁ గోరినంతమాత్రముననే దనకుఁ గూడ నంతగా యుద్ధకాంక్ష కలిగియుండుటను, యుద్ధార్థులమైన మాకు "నినునాసపడన్" అని తమ ఔత్సుక్యమును దెలుపుచు, "విచ్చుఁడు రాచవారుఁ గురువంశముచేటున కోపకుండుటన్" అనుభీముని మాటలోఁ గనఁబడు అర్జుని యుద్ధవైముఖ్యము తలంపు భీమున కది తప్పు అని సూచించుటకు, సారథిగామాత్ర ముండవలసిన నాకే యింత యుద్ధాభిలాషకలిగి యుండఁగా ఫలభోక్తవగు నీ కిట్టి వైముఖ్య ముచితము కాదని అతని ప్రోత్సాహమున కట్లు చెప్పె నని తాత్పర్యము.

68 చ అని విని దేవకీతనయుఁడా తనికిట్లనుఁ జెప్పినంతకం
టెను మిగులంగఁ జేయుటగడించి మగండవు నిన్నుఁ దెప్పగాఁ
గొని పలుమాఱు నాపనులకున్ భయ మొందక దుఃఖవార్థులీ
దిఁ మనుఁ గెల్ల నక్కొఱత దీర్చి సుఖాత్ములఁ జేయు పాంచనీ.

ఇందులో శ్రీకృష్ణులకు కలిగిన దుఃఖమెద్ది? దానిని భీముని వలన తాము నిస్తరించు టెట్లు? శ్రీకృష్ణుల అభిప్రాయమేమి? "మమున్" అని తన్నుఁ గలిపికొని ఆపదల నుగ్గడించు

టను, వారి యాపదలు తనవిగా భావించినప్పుడు, తమయాపదల విషయములో భీమున కెంత ఆతురత యుండవలెనో ఆలోచింప వచ్చు నని శ్రీకృష్ణుని అభిప్రాయము కావచ్చును.

71 తే. చెప్పఁ గల యంతవట్టును జెప్పి కిక
జూతశత్రుండు వింటివా తెలుఁగు
మాకు నెల్లను బలుకంగ మాట లొండు
గలవె యైనను జెప్పవఁ గన్నయంత.

ఇందు "గన్నయంత" అనఁగా ధర్మరాజు నీతోడను, నీ వాయనతోడను చెప్పిన మాటలలో నేను తెలిసికొనినంత, అని. ఆమీాసంభాషణములలో నాకు తెలిసినది ధర్మరాజు వచనములలో యుద్ధము వలదనియు, నీమాటలలో యుద్ధమె అగు ననియును, అభిప్రాయము.

అర్జునుఁడు.

72 మ ధృతరాష్ట్రిం డతిలోభదూషితుఁడు ధాత్రీ భాగ మీానేర్పునే
సుతుఁడుం గష్టుఁడు సంధియేల యను నంచున్ మున్న కైపెక్కిన
ట్టితలంపచ్యుత నీకుఁ గల్గినది గాండీవంబు దివ్యాస్త్రిసం
తతియుం బెట్టినయట్ల యుండ మముఁ జింతం బాపగా దోకదే.

ఇందు "మున్న" యనఁగా, శ్రీకృష్ణుఁడు సంధికిఁ బోకమున్న, లేక వారు చెప్పినమాటలు వినకముందే, అని కావచ్చును. "కైపెక్కినట్టి తలంపు" అనుదానిలో, "కైపు" శ్రీకృష్ణుని కని చెప్పుదుసు, కాని కౌరవులకు కైపెక్కియున్నట్టి తలంపు అని, కైపెక్కుట వారిమాటలు విని కదా నిశ్చయింపవలయు? అట్లు వినకముందే నీ కెందు కట్టి తలంపు పుట్టినది అని; లేక, కైపె

కిట్టినట్టి తలంపు, యుద్ధావేశపుతలంపు సంధిఁ జేయక ముందే యుద్ధపు తలంపేల కలిగినది? అని తాత్పర్య మగును.

73 ఉ. నీ వొనరింపఁ బూనిన పనిం గమలోదర కీడు పుట్టునే
కా వనినట్లు యుండి యవుగార్యములట్లగుటం బ్రయత్నసం
భావనచేతఁ బౌరుషము పద్ధతి తత్ఫలసిద్ధి పొందుదో
దైవము తోడ్పడన్ వలయుఁ దథ్యము రెండును నీ వినోదముల్.

ఇందు అర్జునునకు శ్రీకృష్ణునియందు దైవభావ ముండుటచేత నొక కార్యసిద్ధికి దైవమానుషములు రెండును కావలయు దైవ మగు నీవే దూతభావ మొంది పురుషప్రయత్నమును జేయునప్పుడు కార్యసిద్ధి యెందుకు కాకుండును అని భావము. శ్రీకృష్ణాభిప్రాయములో తనకు సంధి సమ్మతమే కాదు. ఈ పురుషకారమున్ను ధర్మరాజుది కాని తనది కాదు. కావున దైవ మానుషములు రెండును సమకూరక కార్యసిద్ధి కానేర దని నిశ్చయము.

74 ఉ. పేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యు లన్నని
వ్వారికిఁ బోలదే సుజన వత్సల నీ విటు లంటివారు మ
మ్మార సమిత్తి చేడ్పఱచి యింతలు చేసిరదాన నీ మదిం
గూరిన కూర్మి పెంపునను గోపము పెంపునఁ గాదె యారయన్.

పేరిమిన్ స్వభావ వైరముతో వారు మమ్మింతలు చేయుట చేతమాయందలి కరుణను బట్టి వారియెడల నీకిట్టి ద్వేషము కావున మేమే సంధిఁ గోరుచుండఁగా నీకేల అట్టితలంపని పూర్వముతో సంబంధించును.

75 ఉ. ఐనను చిత్తగింపు ద్రుపదాత్మజ నాపథ పట్లు సేసినన్
దానికి సైప లెస్స యని దైన్యముఁ బొందుట కోర్చి యిష్టయిం

గానభూమికిం జనుట కారుణికోత్తమ నీ వెఱుంగవే
కాన సహించి పాండవులఁ గౌరవులందఱఁ గూర్చ నేర్పునన్.

అట్లు వారు చేసినను అన్నిక్లేశముల నొందిన మేమే సహించి సంధిని కోరుచుండఁగా, నీకేల అట్టితలం పని తాత్పర్యము. ముందే శ్రీకృష్ణుఁడు సంధి యేల యగు నని అనుటచేతనే యిప్పు డర్జునుఁడు కానికార్యముల, నగునట్లు చేయుటలోను దయనీయులు కాని వారి యెడఁ దయఁ జేయుటలోనే కదా, నీ అఘటనీయఘటనాపాటవమున్ను అకారణకరుణాశాలిత్వమున్ను ప్రకటింపఁబడు నని సూచించుటకయియే "కారుణికోత్తమ" అనిసంబోధించియుండును.

76 తే. అల వెఱుంగక ధార్తరాష్ట్రులు గడంగి
మమ్ముఁ బఱచినపోటులు మానసమునఁ
జవుటఁ బెట్టిం విత్తుల చంద మొంది
యంకురింపక చెడిపోయె నంబుజాక్ష!

'అలవెఱుఁగక', ఒప్పు తెలియక; 'చవిటినేలఁ బోసిన విత్తులు' వలె, మమ్ము వారు నాఁడు పెట్టినపాట్లు నాఁడే చెడినవి. అనుటవలన మాకు క్రోధబీజములు నశించినందునఁ గ్రోధము శాంతించిన దని తాత్పర్యము.

80 మ. హిత మిబ్భంగిది మాకు ధర్మువు తెఱంగి ట్లుండు నం చేను నీ
మతి బోధింప వలంతి నే? హితము ధర్మంబున్ విచారిం
చి తగం బొమ్మని యేది పంచి గది నిశ్చింతంబుగం జేసి యు
న్నతిఁ బొందం గలవార మై యునికి కృష్ణా నేఁడు గావచ్చునే.

అనఁగా మా కేద్ది హితమో, ధర్మము తెఱఁగెద్దియో, దాని నీకు బోధింపఁ గలవాఁడనా? మాకు హితమును,ధర్మమును,

నీవే ఆలోచించి, దేనిని చేయు మన్న, దానినే చేయువారము. ఇందు హితము ధర్మవు, అని వేఱుగా చెప్పుటకు, అర్జునుని అభిప్రాయ మేమి? అనఁగా సంధి సద్యఃప్రియ మగుటను. "న యుద్ధేన కదాచన" అని యుద్ధనిషేధము కాన్పించుటచేత మేము సంధిః గోరినవారము; గాని మాకదిహితము శుభోదర్కముఁ అగునో కాదో; యుద్ధము ధర్మవిరుద్ధము కాకుండునో లేదో, అది విచారించి నీకుఁ జెప్పునంతవాఁడనా? లోకసామాన్యదృష్టిచేతనే మేము సంధిఁ గోరుచున్నవారము. ఇట్టి కుత్సితులతోడి సంధి హితము కాకున్నను, యుద్ధము ధర్మవిరుద్ధము కాకున్నను నీ కెట్లు సమ్మతమో అట్లే విధింపవలయు నని తాత్పర్యము. కొన్నిధర్మములు సద్యఃప్రియములు కాకున్నను హితము లగును కావున, మాకు హిత మగుధర్మమునే విధింపవలయును.

శ్రీకృష్ణుఁడు.

82 ఉ. ఏరువున లావునం గృషికి నేయువిధంబుల నెం తొనర్చినన్
దొరకదు నేఫలంబు దివిఁ దోఁ దగువర్షము లేకయున్న నె
ప్పరుసున లెస్స చేసినను పౌరుషముల్ ఫలియించు టెల్ల నా
దరణమునం బ్రసన్న మగుదైవము చేతనె మావె ఫల్గునా.

ఈపద్యము అర్జునుని మీఁదివాక్యమునకు అనుగుణమగు నుత్తర మెట్లగును? అర్జునుని మాటలలో మాకు హితము ధర్మము ఎద్దియో దానిఁ జెప్పి చేయించు మన్నట్లును, శ్రీకృష్ణునిమాటలలో దైవ మనుకూలింపక పౌరుషములు ఫలింప వనుటయును కాన్పించుచున్నది. ఈరెంటికిని ఆనుగుణ్యమెట్లు? కాఁబట్టి ముందు వచ్చెడిపద్యముతో సాంగత్యము చేసికొనవలయును.

83 ఉ. కావున సంధికిం బురుషకార మొనర్చెద నోపినంతయున్
దైవము చేత నెట్లగునొ దాని నెఱుంగ సుయోధనుండు సం
భావన సేసి పాలొసఁగు పాడియ కల్గిన భాగ్యమౌఁగదా
నేవిధి నైనను జెఱుప నింతలు పాపము లాచరించునే

ఇందువలన నర్జునునకు మొదటిపక్షము సంధియు, రెండవపక్షము యుద్ధముగాను తెలిసికొని, అతని మొదటిపక్షమును మొదటనే పూర్వపక్ష మొందుకు చేయవలయు నని తలంచి, సంధిప్రయత్నరూప మగు పురుషకారము నాశక్తికొలఁదిఁ జేసెదను గాని, వారియెడ 'దైవముచేత' (అనఁగా దైవము చేయఁదలచినది) యెట్లుండునో తెలియఁ జాలను. అనఁగా వారి కనుకూల దైవ మున్నట్లు తెలియును. దుర్యోధనుఁడు మన్నించి మీపాలిచ్చునట్టి న్యాయబుద్ధిఁ గలవాఁడయినచో, నింతకు ముందు మిమ్ము నశింపఁ జేయనగు పాపములు చేయునా? అట్టి పాపబుద్ధిఁగల అతఁడు ఇప్పుడు న్యాయబుద్ధిఁగలవాఁ డగునా? ముందు, వారు చేసిన పనులఁబట్టి యూహించి చెప్పితిని కాని, భవిష్యత్తు నెట్లు తెలియఁగల మని లోకదృష్టిని చెప్పినమాట గాఁ దెలియ నగును. లేక మీపక్షమునఁ బురుషకారముఁ జేసెదఁ గాని మీ దైవ మెట్లున్నదో తెలియదు, అని అర్థము.

84 వ. అది యెల్ల నట్లుండె నిచ్చట విరాటపశులం బట్టింప నీవు పోయి
నప్పుడు భీష్ముండు దుర్యోధనుతోఁ జెప్పిన తెఱంగు.

85 ఉ. ఇచ్చినవాఁడు ఫల్గునుఁడు—ఉత్తతిఁ బొం దగు చేతయుం దగున్.

అని చెప్పఁగా

87 ఆ. మనకుఁ బాండురాజతనయువర్గమునకు
నెట్లుపొందుగలుగు నేను రాజ్య

భాగమీక సమరభంగి నవిక్రమ
నిరతిఁబూను టిదితు నిశ్చయంబు.

అనెడు మీఁదివాక్యముల సందర్భములో దుర్యోధనుని అభిప్రాయము యుద్ధమే కావలయును కాని సంధిలో రాజ్య భాగ మియ్య నన్నట్లు స్పష్టమగుచుండఁగా, నిప్పుడు మనము చేయు నభిప్రాయత్న మెట్లు సఫల మగును. ఇందులో వారి యదృష్టము కూడ కారణ మయి యుండును; కాన అది దుర్యోధనుని అభిప్రాయమున యావద్రాజ్యమును తానే యనుభవించుటకుఁ గాని లేక, యుద్ధములోఁ దానుచెడి యావద్రాజ్యమును విడిచికొనుటకుఁ గాని, రెంటిలో నొకదాని కనుకూలించి యుండఁగా, నది భాగప్రాప్తి కెట్లు నిమిత్త మగును? కావున మనపురుషకార మెట్లు సిద్ధించు నని తాత్పర్యము ఒకరి ఫలమున కొకరియదృష్టము ఎట్లునిమిత్త మన్నచో, "యచ్చ కార్యం యదదృష్టాధీనం తచ్చ సాక్షాత్ పరంపరాయా వా తదుపభోగం జనయతి" అను శాస్త్రనియమప్రకారము వారి యదృష్టము కూడా మనపురుషకారముకు కారణము కావచ్చును. మనపురుషకారముకు మనఅదృష్టమే కారణ మని చెప్పక వారియదృష్టము కారణముగా నెందుకు చెప్పవలె ననఁగా:— శాస్త్రదృష్టిచే దైవపర్యాయమగు నదృష్టపదము శుభాశుభ నిమిత్తపరమయ్యును లోకదృష్టిలో శుభమాత్రపరముగా నే వాడఁబడుటచేత నిచట సంధియగుటలో వారికి సుఖమే కావున వారిదైవ మెట్లుండునో అని చెప్పవలసి వచ్చినది. ఇంతవఱకును యుద్ధమే కావలయునను నిశ్చయముతో నున్న దుర్యోధనుని అదృష్టము, ఆతనిజీవితనాశమును, యావద్రాజ్యనాశమును,

తప్పించి జీవితలాభమును, అర్ధరాజ్యలాభము నొందునటుల నాతని బుద్ధినిశ్చయమును మరల్పఁగలదై యున్నదో లేదో అని దూరాభిప్రాయము. "బుద్ధిః కర్మానుసారిణీ", అనుప్రకారము బుద్ధియును అతఁడు చేయుకర్మలను బట్టి చూడఁగా బుద్ధిని మార్చునట్టి అనుకూలాదృష్ట మున్నట్లు తోఁచదు. కాని పురుషుని వాసనారూపమయిన అదృష్టము సత్సంగాదికమువలన మార్చుకొనఁ దగియుండును కావున, నిప్పుడు ప్రయత్నముఁ జేసి చూత మని శ్రీకృష్ణాభిప్రాయము కావచ్చును. ఇందువలన అదృష్టము దుర్బోధము విచిత్రము అయియుండు నని మనము తెలియఁదగి యున్నది.

నకులుఁడు

90 ఉ. అనిన ముకుందుతో నకులుఁ డల్లన యిట్లను నీవు ధర్మజుం
డును బవనాత్మజుండు నరుడుం దగఁ జెప్పుటఁ జిత్తగాదు మా
మనము లరణ్యవాసమున మత్స్యమహీపతిపాల నున్నయ
ద్దినములభంగి గాదు కృపఁదీవ్రతఁ గుందినచంద మయ్యెడున్.

ఇందు మామనస్సులు అరణ్యవాసాజ్ఞాతవాసదినములలో నున్నట్లుండ లేదు. అప్పటిదుఃఖవేగము తగ్గి వారియెడఁ గృపగలుగుటవలన తీవ్రత తఱుఁగుటంజేసి సంధి కిష్టపడుచున్నాము, లోకమందు కష్ట మనుభవించుచున్నప్పటి నొప్పి క్రమముగా తగ్గుట ఆచారమేకదా! 'తగఁజెప్పుట,' ఇప్పటికి తగునట్లు చెప్పుట.

91. క. కడఁగ నొకండు పసరము నడచిన నొకరుండు బెయ్య వడఁబిలయుచే?
చెడుతెరువు కారవ్యులకడ నిలుచుం టెక మనకుఁ గార్యంబేలా

ఒకడు 'కడవన్ కానీ' కడవ అగునట్లు, కుండను పగులఁ గొట్టినట్లు, ఆవును కొట్టినచో దానికి, ప్రతిగా మఱియొకఁడు వానిదూడను కొట్టవలయునా? చెడుత్రోవ ఆ కౌరవులయందే ఉండు గాక వారు మన కపకారము జేసినందుకు మనము మఱల వారి కపకారముచేయవలయునా? ఇచట వారు మనకుచేసిన అపకారము ఆవునుకొట్టినట్టిది; మనము వారికిచేయఁగలది దూడను కొట్టునట్టిదిని అగును. అపకారత రెంటిలోను సమానమయ్యును అపకారములలో తారతమ్య మున్నది. ఆవుకు చేసిన బాధకంటె దూడకు చేసిన బాధలో హానియెక్కు డయినట్లు వారు మనకు చేసినబాధలకంటె మనము వారికి చేయఁదలచిన దానివలన వారికి గలుగుహాని యెక్కుడు. ఎట్లనగా వారు మనకు చేసిన పరిభవము రాజ్యహరణము, మొదలగునవి నివర్త్యములు లాక్షా గృహదాహనము మొదలగునవి ప్రాణహానికరము లగుటను. ఎక్కుడయ్యును, అవి యెట్లో దైవానుగ్రహమున మనకు తప్పినవి. మనము చేయఁదగినది, యుద్ధములో వారిని చంపుటకాని వేరుకాదు. అది అనివర్త్యము "ఏతి జీవన్త మానందో నరం వర్షశతా దపి," అను న్యాయమున ఎట్లో మనము జీవించియుండుటను ఎప్పటికయినను సుఖములను పొందగలము; వారు యుద్ధములో మృతినొందిన పిమ్మట మనము పశ్చాత్తాపము పడినను ప్రయోజనము లేక పోవును అని తాత్పర్యము ఈ పద్యములో 'కడవగన్' అను పాఠముకంటె 'కడువగన్' అని పాఠ మయినచో బాగుగఁ దోచుచున్నది.

93 ఐ. అట్లుంగాక నీవు నతు పాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండ
వెఱపరేని నీ పోయినప్పుడ యీ కార్యంబు చక్కనగును.

ఈపాఠములో నర్థము సరిపడినట్లు కానరా కున్నది.

ఐ. నీవు దమ పాలికిం బోవుట ధార్తరాష్ట్రు లాదరింపకుండు వారె

అని ప్రాఁతపుస్తకములలో పాఠమున్నది. ఇదియే సరిగా నున్నట్లు తోచుచున్నది. లేక మొదటిదానిలో 'ధార్తరాష్ట్రు లాదరింపకుండ వెఱపరె' అనఁగా వెఱపరా? అని అర్థమగునట్లు పాఠమయినను బాగుగ నుండును 'ని' అనునది లేఖకప్రమాదము కావచ్చును.

సహదేవుఁడు

93 ఉ. రక్కసమాటలాడెదరు రాజును దమ్ములు వానిలోన
నీ వొక్కటియైనఁ గాదనక యూఁకొనుచుండుట యంతకంటె
నే లక్కట యుగ్ర వేఁడికొన నైననుఁ బోయెదవో సుయోధనుం
డెక్కడ భూమిలోన సగ మిచ్చుట యెక్కడ దానవాంతకా.

దీనిలో రక్కసమాట లెట్టివి? రాజును, తమ్ములు నెవ్వరు? 'రక్కసమాటలు' రాక్షసపుమాటలు (అనఁగా మాయమాటలు.) రాజు' ధర్మరాజు, తమ్ములు, భీమాదులు. అని చెప్పుదురు. వారిమాటలు మాయమాట లెట్లనఁగా: ఇంతవఱకును శత్రువులవలనిబాధల నొందుచున్న మమ్ము నుద్దేశించి, తాను కూడ విషాదము గనుపఱచుచు, ద్యూతసమయము నిస్తరించిన వెంటనే శత్రుల నిర్జించి రాజ్యసుఖముల ననుభవింపఁ గలవారమని మమ్మూరడించుచు, నిప్పుడు సంధి కాసేరదని నీవుచెప్పుచున్నను, "నీవు ఏమనుగడవు" నీయాదేశమే మాకు కర్తవ్యము అనియు' ఇట్టిక్రూరులకడకు నిన్నంపం జాలననియు, సంజ

యునితోఁ జెప్పినమాటలలో "విశేషించి మాకు నీతనివచనంబు లవశ్యంబు నలంఘనీయంబు" లని చెప్పి, యిప్పుడు నీవు 'నీతరుత్సాహివి కాక సమరసన్నాహంబు సేయుచుండవలయు' నని చెప్పుచుండ, "నీవు సుయోధనుపాలికిఁ బోవలదనియును నొక్కబుద్ధి పుడమెడున్," అనుచును చెప్పి "మేము వారు సర్థిఁ బొందియుండునట్లు గాఁగ నొడఁబాటు గావింపుము" అనియు, నిట్టి పరస్పరవిరుద్ధము లగు ధర్మరాజుమాటలును, ద్యూతకాలమందే పరిభవము సహింపక అప్పుడే శత్రువుల సంహారించుట కుద్రేకించి, ఆయుధముల నెడఁ జూడ నర్జునుచే వారింపఁబడి ధర్మరాజునకు 'బాహుదాహంబు సేయవలయు,' నని సంరంభించి, యెట్లనో తాళి ద్యూతసమయానంతరమున యుద్ధములో దుర్యోధనాదిసోదరుల నందఱను చంపుదు ననియు, దుశ్శాసను రక్తపానము చేసెద ననియును ప్రతిజ్ఞఁ జేసి, యిప్పుడు సంధిమాటలు చెప్పుటవలన భీమునిమాటలును; శత్రుసంహారార్థము దుష్కరమగు తపము చేసి, మహేశ్వరునివలన పాశుపతమును ఇంద్రాదులవలన దివ్యాస్త్రములను సంపాదించి, కర్ణాదులఁ జంపుదు నని ప్రతిజ్ఞ చేసి. యిప్పు డిట్టిశాంతివచనములఁ జెప్పుటవలన అర్జునుని మాటలున్ను. అట్లే నకులుమాటలును, పరస్పరవిరుద్ధము లగుటవలన మాయమాట లని సహదేవుని అభిప్రాయమయి యుండును. వానిలో 'నొక్కటియైనఁ గాదనక యూఁకొనుచుండుట' వారిమాటలలో నొకరిమాటయైనను ఒక్కటిఅయినను కాదనక వినుచును ఊంకుండుట. 'అంతకంటె మేలు,' అంతకంటెను బాగు. అనఁగా సహదేవుఁడు సంధిని సమ్మతింపనివాఁడు గావున ఆగ్రహాతిశయమున విపరీత లక్షణాభిప్రాయ

ముతో మేలుకాదనుదానినే మేలని చెప్పుట. లేదా ధర్మరాజాదులు సంధిని కోరి పలుకుటయు అట్లుకాదని నీవుచెప్పక అంగీకరించుటయును మాశత్రువులకు 'మేల' మేలేఅనియు, లేక వారికే మేలుకాని మాకు కాదనియును కావచ్చును. 'అక్కట' అయ్యయో ఎంతకష్టము. 'వేఁడికొననైనను బోయెదవొ,' 'ఆ రీతిగాఁ ప్రార్థింపఁ బోదువా?', అని ప్రశ్నార్థకము; లేక ప్రార్థింపఁబోదువుపో. అని సంభావనార్థకము. దుర్యోధనుఁడు భూమిలోన సగమిచ్చుట యెక్కడ; అది అసంభావితము. ఇచట సహదేవునికి సంధి సమ్మతమా,? అసమ్మతమా? అని ఆలోచింపఁదగియున్నది. "సమ్మతమైనచో రక్కసమాట లాడెదరు రాజును దమ్ములు "అనుట సంగతముకాదు. అసమ్మతమయినచో "సుయోధనుం డెక్కడ భూమిలోన సగ మిచ్చుట యెక్కడ?" అనుట నిరర్థకము, సంధియే సమ్మతము కాని వానికి సగమిచ్చిననేమి ఇయ్యకున్ననేమి? దీనింబట్టి చూడఁగాసహదేవునకు రాజ్యములో సగ మిచ్చినచో, సంధిసమ్మత మయినట్లును అట్లుకాక ధర్మరాజు తుదను చెప్పిన ప్రకారము అయిదూళ్లయినా మఱి యెట్లయినా పుచ్చికొని సంధిఁ జేసికొనుట దైన్యమయినట్లును, అట్లు పుచ్చికొనుట దుర్యోధనుని కరుణాలబ్ధము గాని న్యాయ్యముగాఁ దమకు రావలసిన పిత్ర్యమగు భాగముకాదు, అది అశక్తులువలెఁ గోరుట యాచ్ఞాదైన్యమన్నట్లును. సహదేవుని అభిప్రాయముగా కానవచ్చును. కాని సంధివిఘటనమే ముఖ్యసమ్మతము. ధర్మరాజువాక్యములలో అతఁడు కోరిన అయిదూళ్లను ఇంచుమించుగాఁ దమభాగముకు సరిపడినట్లు తెలియక, భీమాదులు ధర్మరాజు వచనములు అలంఘ్యములని తలంచి

వారుకూడ అట్లే పలికియుందు రని భావించి తానును ధర్మరాజునభిప్రాయమును తెలియకయె అట్లు పలికియుండును.

ఇదియొకపక్షము; ఇంకపక్షాంతరము.—రాజును దమ్ములు; అనఁగా దుర్యోధనుఁడు,తమ్ములును రక్కసమాటలాడెదరు; నీవు సంధికి పోవునపుడు క్రూరపు మాటలాడెదరు; వానికి 'నీవు కాదనక' ఆమాటలను ఖండించి వారికి సదుత్తరములను జెప్పి యెట్లయిన వారి నోడఁబఱచి ధర్మరాజు కోరిన ప్రకారము సంధికి ప్రయత్నించుట కంటె నూఱకుండుటమేలు, మాకు మేలు. ఇచ్చట మా యన్నల మాటలను నీవు ప్రత్యాఖ్యానము చేయక ఊరకుండుట వలన కౌరవులకు మేలనియు, వారు పలికెడు మాటలను కూడ ప్రత్యాఖ్యానము చేయక ఊరకుండుట మాకు మేలనియును సహదేవుని అభిప్రాయము.

95 మ. తలపంగూడునె యింతలేసి దొరలీ దైన్యంబు చుట్టం
బులుం జెలులుం దిట్టరె లాతిరాజులకు మెచ్చే యివ్విధం బిట్టిదిం
గలదే వేడఁగ ధర్మజుం డడుగఁ బోగాఁ గృష్ణుఁడా ధార్తరా
ష్ట్రులు పాలీక చలంబునం బెనఁగ నెట్లుం గూడు దీపత్యసే

'ఇంతలేసిదొరలు' హిడింబబకకిమ్మీర కీచకాదుల వధించినభీమసేనుఁడును, ఖాండవదహనముచేసి ఇంద్రాదుల నోర్చినట్టియు, వారికిని అసాధ్యులగు కాలకేయాదుల జయించినట్టి అర్జునుఁడును, రాజసూయములో దిగ్విజయముచేసి కప్పములు తెచ్చినట్టి నకులుఁడును, 'ఈదైన్యంబు' మీఁది పద్యార్థములోఁ గనుపఱచిన యాచ్ఞా దైన్యమును తనుమనములందు తలంపనైనఁదగునా? చేయఁగూడదు సరియేకదా, తలంపనయినఁదగదు బంధువులును, మిత్రులును నిందింపరా? ఇతరరాజు లిట్టి

దైన్యమును మెత్తురా; 'ఇట్టిదిం గలదె' వారిట్టి దైన్యమొందుట యెచ్చటనైనఁ గలదా? ధర్మరాజు యాచింపఁ దలంపఁగా, అందుకు కృష్ణుఁడు స్వయముగా వెళ్లఁగా, కౌరవులు పాలీయ నొప్పక చలముతోనే పెనఁగులాడు చుండెనేని; 'ఎట్లున్' ఏరీతిగానైనా అయిదూళ్లుగాని మఱి యెట్లయినన్ అనఁగాఁ దమకు గ్రాసవాసస్సులకు మాత్రము చాలునట్లు కాని తలంచుటను, అట్టికూడుతీపా? రుచ్యమగునా?

96 ఉ. వీరలు ధర్మమార్గము సవిస్తరతం దగ వాడిరేనియు
న్వారలు దాని కియ్యకొనిరన్ వినుమచ్యుత యట్టిసంధి పెం
పారఁగ నేర్చునే యుచిత మైనది కయ్యము వంకమాటలే నేరఁ
గురుక్షితీశుసభ నిశ్చయ మిట్టిద కాఁగఁ జెప్పుమీ.

మావారు ధర్మమార్గమంతయు విస్తరించి చెప్పినట్లయితే దానికి వారొప్పికొనినను 'అట్టి సంధిపెంపారఁగనేర్చునే', స్థిరమై వృద్ధి నొందఁగలదా? కాబట్టి యుద్ధమే ఉచితము. ధర్మరాజు తనశాంతికొఱకు అయిదూళ్లిచ్చినను చాలుననునది ధర్మము కాదు. కౌరవు లతిలుబ్ధులగుటను దానికైనను వారొప్పికొనరు ఒకప్పుడు ఒప్పికొని అట్లిచ్చినను, అవి మాకు గ్రాసవాసస్సులకే చాలక దైన్యమొందవలసినప్పుడు సహింపక మావారే విజృంభించినను, ఈసంధి పెంపారనేరదు. లేక యిట్లిప్పుడు సంధిలోఁ గొంచెము మాకిచ్చినను వారు కపటులు కావున, పూర్వమింద్రప్రస్థము, వాసముగాను, భాగమును, మాకిచ్చినట్లిచ్చి, పిమ్మటను కపటద్యూతము కల్పించి. హరించినట్లు, మరలి దానినపహరింతురు. అప్పుడైనను ఈ సంధిచెడునుగాని పెంపారునది కాదు. 'వంకమాటలేనేరన్' అయిదూళ్లను చాలునను ధర్మరాజుమా

టలలోను, అంత ఔద్ధత్యము పలికి ప్రతిజ్ఞలుసేసి ఇప్పు డింత శాంతి వచనములను పలుకు భీమార్జునుల మాటలలోనున్న, నేఅభిప్రాయ మున్నచో, నవి యెల్ల వంకమాటలే యగును; కావున నేనట్టివంకమాట లెఱుఁగను. నాఅభిప్రాయము కనుగుణముగానే స్పష్టముగా యుద్ధమే యుచితమని చెప్పినాను. మొదలనే సంధియుచితము కాక యుద్ధమే ఉచితమెట్లనఁగా:—కౌరవులు ఇతరరాజులవలెఁగారు; కపటులు; కావున వీరితో నగు సంధి పెంపారదు తుదకెప్పుడైనను యుద్ధమేతప్పదు. కాఁబట్టి వీరితో యుద్ధమే ఉచితముగాని, సంధి ఉచితముకాదని తాత్పర్యము.

97 మ. తుది రాజ్యమ్ము సగమ్ము గొమ్మడవియందుం జేరువంచించియుం
బదుమూఁడేఁడులు నీవునుం దిరిగి రా పాలీక పోవచ్చునే
యదిగాదేఁ దెగి బంటవై యఱుము మాయల్ వన్నె నేర్పింకఁ జె
ల్లదు సూ నీ కనియా సుయోధనునియుల్లం బుచ్చి పోనాడుమీ.

మీఁది పద్యములో కయ్యమే ఉచితమని చెప్పి యిందులో ఆకయ్యమే యెట్లగునో దానికనురూపముగాఁ జెప్పుచున్నాఁడు. ఈ పద్యమునకు యథాశ్రుతముగా ముందు ప్రతిపదార్థమును జూతము. 'తుదిరాజ్యమ్ము సగమ్ముగొమ్ము?' అంతమందు రాజ్యములో సంగోరు పుచ్చుకొనుము; 'అడవియందుం జేరువంచించియుం బదుమూఁడేఁడులు నీవునుందిరిగి రా' నీవున్ను పదుమూఁడేఁడ్లులు అరణ్యావాసాజ్ఞాతవాసములను జేసితిరిగిరమ్ము. 'పాలీకపోవచ్చునే' మాపాలు మాకియ్యకుండుటకు నీకుశక్యమా? 'అదిగాదేఁ' ఆలాగుకానట్లైతే; 'తెగి' సాహసించి; 'బంటవై' బంటుతనముగల వాఁడవయి, మాతో యుద్ధముచేసి; 'అఱుము',

నశింపుము; 'మాయల్ వన్నె నేర్పింకఁ జెల్లదుసూ?' మాయలు వన్నె నేర్పు ఇటుపైని చెల్లదుసుమీ; 'నీకుఅని?' ఆదుర్యోధనుని; ఉల్లంబుచ్చి పోనాడుమీ', వానిగుండె బద్దలగునట్లు పలుకుమీ.

ఇందు సహదేవుని యభిప్రాయమేమనఁగా, సంధిసమ్మతము కానందున అదివిఘటించునట్లు ఉపపత్తితోఁ జెప్పుచున్నాఁడు. కపటద్యూతములో మమ్మోడించి పదుమూఁడేఁడులు మాకుఁ గ్లేశములఁ గలుగఁజేసినందుకు, నీవును కూడ, అట్లు తిరిగిరా. మా రాజ్యము అనధికారముగా నీ వనుభవించినందుకు ఇప్పుడు నీ భాగమును గూడ మాయధీనముచేసి పదుమూఁడేఁడుల పిమ్మట వచ్చి అప్పుడు నీసగము భాగమ్ము పుచ్చుకొనుము. నీవట్లుచేయుట నీదుర్ణయముల కది ప్రాయశ్చిత్తమున్ను మాకు ప్రశాంతియునగును. భాగమిచ్చుటమాత్రము కార్యముకాదు. మా భాగము మాకు ఇయ్యకుండుటకు నీశక్యమా అని. లేదా నీవును మేమును పాలివారము కావున మాకు నీవుచేసినట్లే నీకును మేము, చేయకుండుట మా కుచితమా? కాఁబట్టి మావలెనే నీవుఁగూడా పదుమూఁడుసంవత్సరములు రాజ్యమువిడిచికొని, అరణ్యాజ్ఞాతవాసములననుభవించి, తుదను రాజ్యభాగము పుచ్చికొన్నచో మాతో నీకును పాలు సరిగా నుండును. ఆక్లేశములలోఁ గూడ నీకు భాగమియ్యకుండ నగునా?. ఇందు సగమ్ము గొమ్ము అనుదానిలో కొమ్ము అను మధ్యమ పురుషక్రియను బట్టి మేమునీకు భాగమునిచ్చువారము, నీవుపుచ్చుకొను వాఁడవు కాని, నీవు ఇచ్చువాఁడవుకావు, నీవు నీపాలుఁ బుచ్చికొనుటకు స్వాతంత్ర్యము కలవాఁడవుకాని మాభాగమును మాకిచ్చుటకు గాదు; మాది మేమే తీసికొనఁగలము, నీవియ్య నవసరములేదు.

ఇయ్యకుండుట కెవ్వరు శక్తులో ఇచ్చుటకును వారే శక్తులు; కావున మా పాలు మా కియ్యకుండుట నీకశక్యము కాఁబట్టి మా కిచ్చుటకూడ నీది కాదు, అనఁగా నీశక్యమయినది కా దని తాత్పర్యము. అదిగాదేని అలాగు కానిచో తెగి బంటవై బంటుతనముగలవాఁడవై యుద్ధముఁ జేసి అటుము నశింపుము. అనగా నట్లు చేయనిచో యుద్ధములో నశింపఁ గలవు. కాని 'మాయల్ వన్ను నేర్పింకఁ జెల్లదు సుమా' జూదములోఁ జేసినమాయల నేర్పు ఇప్పుడు చెల్లదు సుమీ. నీకు మాయలలో నేర్పు, మాకు యుద్ధములో నేర్పు నీ నేర్పు జూదములోఁ జెల్లినది. ఇంక మా నేర్పు చెల్లఁదగి యున్నది.

యుద్ధములో నీమాయల నేర్పు చెల్ల నేరదు. మాయలు చెల్లునప్పుడే నీబ్రతుకు. నిర్మాయికముగా మేముచేయు యుద్ధములో నీవు నశింతు వని తాత్పర్యము.

" ఈపద్యములో "పదుమూఁడేఁడులు నీవునుందిరిగిరాఁ బాలీక పోవచ్చునే" అనిపాఠాంతరము తాళపత్రపుస్తకములలో నున్నది. అప్పుడు దానికర్థము ద్యూతములయందు నిర్ణయించుకొన్న సమయ ప్రచురము తిరిగి రాగా నని

ఇంకొక పాఠమును చదువుదురు— "పదుమూఁడేఁడులు నీవునుందిరుగు రాపాలీక పోవచ్చునే" అని ఇందు 'తిరుగు' అను నది క్రియ; 'రాపాలీక పోవచ్చునే', పాండురాజు పాలు ఇయ్యక శక్యమా అని అర్థమును చెప్పుదురు. ఇచ్చటనే 'తిరుగురా' అని క్రియఁ జేసి, 'పాలీకపోవచ్చునే', అనియును చెప్పుదురు. ఇందు దుర్యోధనుని యందు నైచ్యసంభావనచే 'తిరుగు' అను క్రియకే 'రా' చేర్చుట. ఈపాఠములలో 'రాపాలీకపోవచ్చునే',

అను దానిలో ధృతరాష్ట్రుఁడు జీవించియుండుటను పాండురాజు మృతినొందుటచేతను మాకు భాగము లేదను కొందువేమో, మా తండ్రి పాలు మాకియ్యక తప్పదని అభిప్రాయము. ఈపాఠములలో మొదటి దానిలో సహదేవునికి సంధివిఘటనము సమ్మతమయినట్లును, తక్కినవానిలో న్యాయముగాఁ దమభాగము వచ్చినచో సంధి సమ్మతమయినట్లును తెలియఁబడును మొదటి దానిలో నింకొక యభిప్రాయము కానవచ్చును. నీవు మాకు భాగమిచ్చువాఁడవు కావు, మేమే నీకు పాలిచ్చెదము. అది యెట్లనఁగా, మావలె నీవును పదుమూఁడేఁడులు తిరిగివచ్చుట మాతో నీకును సమమగును కావునవది నీకు పాలగును. లేదా అట్లు తిరిగివచ్చుట కాక, యుద్ధము చేసి చచ్చుట, ఈ రెండును నీకు సమానములే కావున నిందొకటి యేదైనను 'కొనుము' పుచ్చుకొనుము. అదియే నీకు పాలగును అనఁగా పదుమూఁడేఁడులు తిరుగుటలోనే భ్రష్టుఁడవయి చత్తువు యుద్ధములోనైనను చత్తువు ఈ రెండును సమానములగుటను నీకు వానిలో నొకటి పాలగునని తాత్పర్యము.

సాత్యకి.

98 మ. అనినన్ సాత్యకి ప్రీతుఁడై యితఁడు లెస్సైయుండఁ బల్కెం
బ్రహ్మోజవముం గల్గదు గౌరవంబు చెడు దుశ్చారిత్రకుండౌ సుయో
ధను బోధింపఁగఁబోయినన్ సరభసోత్సాహంబుపై నున్న వీ
రనికాయంబున కెల్లనుం బ్రియము సంగ్రామంబు మేలెమ్మెయిన్.

ఇందు 'గౌరంబు చెడున్' అనఁగా నెవ్వరికి? రాజ నీతి ప్రకారము సంధిఁ గోరినధర్మరాజునకా? దానిఁ బూనికొని వెళ్లిన శ్రీకృష్ణునకా? సాత్యకి అభిప్రాయమేమి? వారికి కాదు.

మఱియెవ్వరికనఁగా, యుద్ధసాహాయ్యముకై కోరఁగా నత్యుత్సాహముతో వచ్చియున్న యీ వీరులకందఱికిని యుద్ధము లేదని చెప్పి మరల వెళ్లిపొమ్మనఁగా వీరి యుత్సాహభంగమగుటను వీరికి గౌరవభంగమని సాత్యకి తన అభిప్రాయమును తెలుపుట.

ద్రౌపది.

101 ఉ. అంతలు చేసి పోనడచి యక్కట సంజయుచేతఁ జెప్పి పు
త్తెంతురె యిట్టి యూరట మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దా
నంతన యూళులేవురకు నైదుసుయోధనుఁడిచ్చునో కొ-యీ
కంత కృపావిహీనమతి నాతఁడు నొంచునె యన్నదమ్ములన్.

అంత దుర్ణయములు చేసి మమ్ము డవులకు త్రోలివేసినవారు ఇప్పుడు సంజయునిచేత నిట్టి యూరటము అనఁగా భాగమిచ్చునట్టి యూరడింపు చెప్పిపంపుదురా అట్లు పంపరు. మదిం బ్రియమందె యుధిష్ఠిరుండు దానంతన దానికి యుధిష్ఠిరుఁడు నంతటఁ దానే సంతోషించినాఁడు. సంజయునిఁ బంపినంత మాత్రముకు నంతసించుచున్నాఁడు. ఊళులేవురకు నైదు సుయోధనుఁడిచ్చునో కొ- ఇచ్చునా అని కాకుస్వరము ఇయ్యఁడని తాత్పర్యము ఈకంత అంత అయినను ఇయ్యక కృపావిహీనమతితో అన్నదములన్ తమను నొంచున్ +ఎ నొంచున్ నొప్పించునే కానియియ్యఁడని ఇచటను ఎ "అనునది ఏవకారార్థకము. ఇది యొకపక్షము ఇంక రెండవపక్షము. ఊళులేవురకు నైదు సుయోధనుఁడిచ్చునో కొ- యీకంత. అతిస్వల్పముగానయి దూళ్లనిచ్చునేపో అనఁగా నిచ్చుఁగాక అట్లిచ్చినచో అన్న అనఁగా ధర్మరాజు తమ్ములన్ భీమాదులను కృపావిహీనమతిన్ దయాశూన్యమయి

నబుద్ధిచే నొంచునె నొప్పించునా? "ఇంతకును అన్ని ఆక్లేశములు నోర్చి సమయము తీఱినవెంటనే రాజ్యమనుభవింపఁగల మను నాశతోనున్న వీరికి ఆశాభంగమగునట్లు గ్రాసవాసస్సులకయినఁ జాలకుండఁగఁ బుచ్చికొని వీరిని నొప్పించునా? అనియును కావచ్చును ఈపక్షములో ద్రౌపదికి అయిదూళ్లు పుచ్చికొనునట్టి సంధి సమ్మతముకాదు".

102 చ. తన మునుపడ్డ బన్నములు దన్మునిపైఁ గలకూర్మి సైర్మినీ
జనపతి సైపకున్న యది సక్కన రాజ్యము పాలులేక తీ
ఱిన కొడబాటు గల్గిన కళంకమె పెట్టరె చాలరైరి వీ
రనరొకొ నానలేమియని యాడరె లోకమువారు కేశవా.

తన తానే ముందు పొందిన కష్టములను సహింపలేదా? అది సక్కన ఆలాగు సహించుట చక్కనే. క్రూరులెన్ని దుర్ణయములు చేసినను శాంతుల మనిపించుకొనువారు సహించుట ఉచితమగును. కాని రాజ్యము పాలులేక తీఱునకొడఁబాటు గల్గినన్ భాగములేనట్టి తీర్మానమున కొడఁబడినపక్షమున ఎఱుంగమి పెట్టరె, ధర్మమెఱుఁగరని నిందఁబెట్టరా? చాలరైరి వీరనరొకో, వీరు వారికిఁ జాలక యిచ్చినంతఁ బుచ్చికొనినారనరా? లేక రాజ్యభాగము కనర్హులనరా? నానలేమియని యాడరె లోకమువారు, సిగ్గులేదని లోకు లనరా? వీరు సిగ్గునొందకున్నను లోకములో సిగ్గుపెట్టరా? అనఁగా వారు వీరికిఁ జేసిన పరిభవములకు వీరు స్వయముగానే సిగ్గునొందకపోయినను లోకులు సిగ్గులేనివారని ఆక్షేపింపరా? ఒకప్పుడు ధర్మరాజును, మేమియు ననలేక యూరకున్నను లోకమువారైనా నిందింపరా? ఇందువలనఁ దాము చేయుపని లోక సమ్మతము కానిచో లోక

మునిందింపక మానదు. తమపనిలోఁ దాము స్వతంత్రులయ్యును లోకము ననుసరించి చేయవలయునని ధ్వని.

106 ఉ. ఓట యొకింత యేనియు సుయోధనుచిత్తమునందు లేదు నీ
మాటలఁబోవునే దురభిమానమెక్కుడు పూను గాక య
చ్చోటనసంగరంబులగు చొప్పులు పుట్టిన సైచి పాండవుల్
పోటునకిచ్చగింతు రొకొ పోదురొ కానలకుండ నచ్యుతా.

దుర్యోధను చిత్తమం దేమాత్రమయినను ఓటుఓడుట తగ్గుట లేదు. నీ మాటలఁబోవునే, నీ నీతివచనముల వంక నాతఁడు పోవునా? దురభిమానమెక్కుడు పూనుగాక. దురభిమాన మేమిక్కుటముగాఁ బూరించుఁగాని యతనిచిత్తము మాఱదు. అచ్చోటన అచ్చటనే సంగరంబులగు చొప్పులు యుద్ధములగు నట్టి జాడలు పుట్టినఁ పుట్టఁగా. వీరు సైచి సహించి పోటునకిచ్చగింతురొకొ, యుద్ధము చేయుటకొప్పికొనుదురో, లేక కానలనుండున్ మరల నడవులలో నుండుటకు పోదురో అని యథాశ్రుతార్థము, ఇందుఁగొంత విచారింపనైయున్నది. ఓట అనునది ఓడు ధాతువు భావార్థకమగునా? అయితే ఓడుట అని కదా రూపముండవలయును. లేక, ఓటు+అ=ఓట అన్నచో నచ్చటి అకారముకర్థమేమి? అవధారణమయినచో దానికిఁ బ్రయోజనమేమి? లేక ఓడుధాతు భావార్థకము ఓటు అన్నచో పాఠము "ఓటునొకింత" అనికదా యుండవలయును. ఉకారముకు సంధికానిచో నకారము కానియకారము రాదుగదా? కాబట్టి యదియెట్లు? అనఁగా ఓటు+అ=ఓట ఆకారమవధారణార్థకము. ఓట్ దుర్యోధనుని చిత్తమందు లేనప్పుడు ఓటుమూలకమయిన సంధియెట్లు కుదురును. అతని మనమునందు ఓటు, క్రూరత్వము తగ్గుట,

లేక యుద్ధమయినచోఁ దామోడుదుమను శంక, లేదు. అదికలిగినఁ గదా సంధికొప్పికొనును.

"అచ్చటన సంగరంబులు" అనుదానిలో నకారముమీఁది అకార మవధారణార్థకమగునా కాదా? అయినచో దాని ప్రయోజన మేమి? శ్రీకృష్ణుఁ డచ్చటికి వెళ్లఁగా, పుట్టినవి అచ్చటనే కాక మఱియెచ్చటఁ బుట్టును. ఆ అకారము దేనినివ్యవచ్ఛేదించును?. సంగరంబులగునని బహువచన మెందుకు? కురుపాండవ యుద్ధము, స్థలాంతరమందును, కాలాంతరమందును, ఒక్కసారియే కదా అయినది? కాఁబట్టి బహువచనము సంగతమెట్లు?

అనఁగా నీవు చేయఁబోవు సంధికానేరదు సరియేకదా నీకే అచ్చట యుద్ధప్రసక్తి కల్గునేమో "అని, అదిఅచ్చటనే కావలసినది కావున నవధారణార్థము సంగతము. కాలాంతరమున స్థలాంతరముననను, వీరికిఁగూడ వారితో యుద్ధమే కావలసియుండును, కావున, "సంగరంబులు" అని బహువచనమున్ను సంగతమగును.

107 ఉ. ఆఁడుదిపోకయుం ఫలమునందుటయుం గని పల్కనేరమిన్
మాఱుటనోరిదానవయి మాటలు చిత్తమునందు నిల్పకే
గాఱులు ప్రేలెదన్ వినుము కర్జము నొగ్గుము గాననల్కమై
వీడఁడియైన మానవికి వెండి వివేకముగల్గ నేర్చునే.

"ఆఁడుదిపోకయు" నివ్యర్థప్రయత్నమును. "ఫలమునందుటయు నీ" ఫలసిద్ధిని. "కని" (తెలిసి) పల్కనేరమిన్, "నీ పలుకటకు నేర్పు లేక పోవుటచేతను" మాఱుటనోరిదాననయి మన వారు చెప్పుమాటలకు ప్రతిగాఁ జెప్పునట్టి నోరుఁగలదాననై.

“మాటలు చిత్తమునందు నిల్పక” మనస్సులలోఁ దోఁచినమాటలను మనస్సులో నిలుపుకొనఁజాలక. “ఏఁగాఱులు ప్రేలెదన్” కఠినపుమాటలు పల్కెదను. “వినుఁడు” క్షమించి వానిని వినవలయు” కర్జము నెగ్గునుగాననల్కమై “వారునాకు చేసిన పరిభవములవలని కోపముచేత, కర్తవ్యమెద్దియో, కీడెద్దియో తెలియక. కారుమాటలు పల్కెదనని తాత్పర్యము. “వీఱిఁడియైన మానసికి” వెఱ్ఱెత్తిన అభిమాన శాలికి. “వెండి” పిమ్మట “వివేకముగల్గనేర్చునే” కోపవేగమున నశించిన వివేకము, మరలఁగలుగునా. కాఁబట్టి క్షోభము చేత వివేకములేక, నేను పలికితినికాని ఉచితానుచితముల నరసి మీ కెట్లు తోఁచునో అట్లే చేయుమని సముదితాభిప్రాయము.

శ్రీకృష్ణుఁడు ద్రౌపదితోఁ జెప్పుట.

102 ఉ. ముచ్చిరనేల నేఁ గలుగ ముద్దియ నాకు వృకోదరుండు
వివ్వచ్చుఁడుఁ దోడుగాఁగ జనవంద్యుఁడు ధర్మసుతుండు సంప
నీ మెచ్చుగ శత్రుసంక్షయము నేఁగాని సేసెదఁగాక వేఱొకం
డచ్చుపడంగ నేర్చు దురాత్ములు గౌరవు లుర్వి యిత్తురే.

ముచ్చిరనేల విషాదమొందనేల? వేఱొకండచ్చుపడంగ నేర్చునె యుద్ధముతప్పి సంధితప్పక అగునా? కాదు “అనఁగా నేను సంధికిఁబోఁగా సంధి కుదిరినచో నిన్ను పరిభవించిన శత్రువులు నశింపరు. వారు నశింపక నీ పరిభవదుఃఖము తీఱదు. కావున సంధియగునేమో అను విషాదము నీవు బొందవలదు. దురాత్ములగు కౌరవులు భూమి నియ్యరు భూభాగము రాని సంధిని నేను సమ్మతింపను, భీమార్జునులును నాకే తోడగుదురు అనఁగా ననుసరింతురు, అప్పుడు ధర్మరాజు యుద్ధ

మునంగీకరించును శత్రుక్షయమగును. నీవు ముగ్ధకావుననట్లు తలంచుచున్నావను నభిప్రాయముతోనే ముద్దియ” అని శ్రీకృష్ణుఁడు సంబోధించుట.

అర్జునుఁడు మరలఁజెప్పుట.

126 తే. పాండవులు ధార్తరాష్ట్రులు పుండరీక
నేత్ర చుట్టఱికంబున నీకు నొక్క
రూపు కావునఁ గోరెదఁ రూపు నందు
నుభయపక్షంబులకును జేయుము హితంబు

పాండవులు, కౌరవులును, శ్రీకృష్ణునకు, బంధుత్వమున నొక్కరూపు వారెట్లు? పాండవులు మేనత్త బిడ్డలుకదా? కౌరవులెట్టివారు?. అర్జునుని అభిప్రాయమేమి? ద్రౌపది శ్రీకృష్ణునకుఁ దోఁబుట్టువనుట యట్లో యిదియునట్లే అయియుండును. లేక పాండవులును, ధార్తరాష్ట్రులును, విచిత్ర వీర్యునకు పౌత్రులు సమాన బంధువులే యగుటను విచిత్రవీర్యుని రాజ్యమునకు సమానస్వత్వము కలవారేయను దృష్టికలవాఁడవు కావున మాయుభయ పక్షముల వారికిని హితంబనఁగా సంధిజేసి సగపాలు చేయుమని తాత్పర్యము.

128 క. అని విని కౌరవులకు మీ
కను హితము ప్రియంబుఁ జేయఁగోరియు కుంతీ
తనయాగ్రజుపనిధృతరా
ష్ట్రుం గడకుం బోయెదను గడుం బ్రీతిమెయిన్.

శ్రీకృష్ణుఁడు చెప్పుట.

ఇందు ప్రియము హితము ఎట్టివి? భేదముండునా? లేదా? ఉన్నచో నొక కార్యము ప్రియమును హితమును అగుటెట్లు?

తెలిచో మేలుగాఁ జెప్పటెందుకు?. ప్రియము సద్యః ప్రీతికరము. హితము తత్కాలమున రుచ్యముకాకున్నను క్రమమున క్షేమకరము. ఇచటఁ దాను చేయఁబోవు సంధి కౌరవులకు హితమున్ను, పాండవులకు ప్రియమున్ను, అని అభిప్రాయము. ఎందుచేతననఁగా నీసంధి కౌరవులకు నిష్టము కాకున్నను ఎట్లో ఒప్పికొనినచో దానివలన వారికే క్షేమమెక్కుడు కావుననది వారికి హితము పాండవులకు బంధుహింస లేకుండుటయే ప్రియముగాని కౌరవులు కుత్సితులగుటను ముందు మరల వీరిని పూర్వమువలెనే బాధింపక మానరు కావున నీసంధి పాండవులకు క్షేమకరము కాదు. అందుచేత వీరికి హితము కాదను అభిప్రాయముచేతనే శ్రీకృష్ణుఁడట్లు చెప్పియుండును, ఇందు ''కుంతీతనయాగ్రజుపని'' అను దానికన్వయము దేనితో సరిగాఁగనుపడదు. అది వేఱువాక్యముచేసి నాకు కర్తవ్యము: అనిక్రియ, నధ్యాహరించుకొనుట యుచితముగాఁ దోచును. మఱియు ధర్మరాజు ప్రీతికరయి, తాను ధృతరాష్ట్రుని యొద్దకుఁ బోవుట హాస్యమే తనకు కర్తవ్యాంశమనియును, సంధికానేరదనియును, శ్రీకృష్ణుని యభిప్రాయము తెలియనగును.

129 క. అనిపలికిన హరిధర్మన
చనముల కెఱుఁగున కజాతశత్రుఁడు చిత్తం
బునఁ బొంగి యట్లు చేయుము
మన నిశ్చయమిదియు దీని మఱవకు మనఘా.

ఇందు, ధర్మరాజు శ్రీకృష్ణునకు మఱపు శంకించుట, లోకదృష్టిలో నయియుండును. అది తాను, సోదరులు, ద్రౌపది, సాత్యకియును, చెప్పిన వానిలోఁ గొన్ని పరస్పర విరుద్ధములుగాఁ

దోచుటచే 'నవాంతర భేదములెట్లున్నను అందఱికిని సంధియే సమ్మతమను సముదితాభిప్రాయముతో తుదికి కార్య నిశ్చయ మిదియే యని సూచించినాఁడు.''

ధర్మరాజు శ్రీకృష్ణుని సంధికిఁ బంపుట.

130. వ. అని కార్యంబు నిశ్చయించి దినశుద్ధి నిరూపించి నారాయణుం
జూచి నీ నక్షత్రంబు రోహిణిగదా యెల్లి రేవతి నీకుఁ జంద్రతారా
బలంబులు గలవు గమనంబునకు రేపకడ మేలు పయనంబగుట లెస్స
యని చెప్పి అఁయున్నది.

ఇందు ధర్మరాజు శ్రీకృష్ణునికి, దినశుద్ధియుఁ జంద్రతారాబలములుచూచి రేవతినాఁడు ప్రయాణమును నిశ్చయించినాఁడు దినశుద్ధి యున్నట్లు చెప్పినాఁడు గాని దిన మెద్దియో చెప్పలేదు. ఏదినము? ఏమాసము ? అని ఆలోచింపవలసియున్నది. ఈ యాంధ్రభారతమందేమియును చెప్పఁబడలేదు. సంస్కృతభారతములో 'శ్లో. కౌముదే మాసి రేవత్యాం శరదన్తే హిమాగమే'' అనియుండుటను కార్తికశుక్ల ద్వాదశినాఁడని వ్యాఖ్యాతలు వ్రాసినారు. కాని ద్వాదశి ప్రయాణమునకు నిషిద్ధము కాదా? వేదాత్రయోదశి అగునేమో ? ఆనాఁడు రేవతి శేషమున్నను శ్రీకృష్ణుఁడు బయలుదేఱుట సూర్యోదయమున మైత్రముహూర్తమందనఁగా తృతీయ ముహూర్తము. ఆఱవగడియలో గానే కావున త్రయోదశి అయినను పౌర్ణమి నాటికి కృత్తికా నక్షత్రయోగ ముండ నచ్చును. కాన నిదియే రమణీయమగును. అట్లు బయలుదేఱి ఆపూఁట నొక మున్యాశ్రమము నందు బసచేసి యుండి యారాత్రికి కుశస్థలికి వెళ్లి అచ్చట నారాత్రి వసించి మఱునాఁటి ఉదయమున బయలు వెడలి కరి నగరము ప్రవే

శించి రాజమందిరమున ధృతరాష్ట్రాదులం జూచి ఆమధ్యాహ్న భోజనమునకు విదురినింటికి వెళ్ళి ఆ దినము అతనితో సుఖగోష్ఠిని గడపి మరునాఁడు మరల కౌరవసభకుఁవచ్చి అచటి పెద్దలు వినుచుండ ధృతరాష్ట్రునితో తన రాక ప్రయోజనమును చెప్పి దుర్యోధనుని తగు మాటల నుపశాంతి జేసినను, నతఁడా మాటలనాదరింపక తనయందుఁ దలఁచిన కృత్రిమమును దెలిసికొని కోపించి అచ్చటివారికి విశ్వరూపమును జూపించెను.

శ్రీ

శ్రీమహాభారతవిమర్శము

ఉద్యోగపర్వము, చతుర్థాశ్వాసము.

శ్రీకృష్ణుఁడు కర్ణునితో రహస్యోక్తులు బలుకుట.

శ్రీకృష్ణుఁడు విదురునింటికిఁ బోయి కుంతి నూరార్చి కౌరిపురమునుండి బయలువెడలు నప్పుడు సామము సంభవించనందున భేదమును జేయఁదలఁచి కర్ణునిఁ బిలచి.

శ్రీకృష్ణుఁడు.

29 సీ నీవు వృద్ధజనోపసేవివి ధర్మసంవేదివి తెలియంగ వినుము సిద్ధ
మంత్రబలంబున మార్తాండు వరమునఁ, గన్నియయతఁడెఁ గొంతి గన్నవాఁడ
వగుట పాండునృపాలు నగ్రసుతుండవు, ధర్మమార్గంబిది ధర్మతనయుఁ
డాదిగాఁగల తమ్ములందఱు నాచేత, నెఱిఁగి నీయడుగుల కెఱఁగి సకల
పుత్రమిత్ర బంధు భూరిసేనాసమ
న్వితము గాఁగఁ గొలిచెదరు నిన్ను రాజ్య
భార విధానమునకుఁ బట్టము గట్టినా
ర్యులు దవగుదు తమ్ములకు దొరవు.

అని చెప్పెను. ఇందు కర్ణుఁడు పాండురాజునకు అగ్రజుఁడని ఉన్నది కదా. కర్ణుఁడు కుంతికి కన్యాత్వ కాలములోఁ బుట్టినవాఁడు పాండురాజుకు కుమారుఁ డెట్లగును. ధృతరాష్ట్ర పాండురాజులు విచిత్ర వీర్యునికివలె ఈ కర్ణుఁడు పాండురాజుకు కుమా

రుఁడనుటకు అవకాశము కానరాదు. విచిత్ర వీర్యునకు తత్ భార్య లందు వ్యాస మహర్షి వలనఁ బుట్టిన ధృతరాష్ట్ర పాండురాజులు క్షేత్రజులగుదురు. కాని కుంతి అప్పటికి ఒకరికి క్షేత్రమె (భార్య యె) కాకుండ కన్యావస్థలో పుట్టిన కర్ణుఁడు పాండురాజునకు క్షేత్రజు డెట్లగును. కర్ణుఁడు క్షేత్రజుఁడు కాఁడు. కానీనుఁడు అనగా కన్యకా పుత్రుఁడు. ద్వాదశపుత్రులలో నొకఁడు కన్యావస్థలో, నితనిఁ గన్నకుంతి పిమ్మట పాండురాజును వివాహము వలనఁ బొందినది కావున ఈ కర్ణుఁడు పాండురాజునకు కానీన పుత్రుఁడగును.

యాజ్ఞవల్క్య స్మృతి, వ్యవహార కాండము.

“ శ్లో. ఔరసోధర్మపత్నీజ స్తత్సమః పుత్రికాసుతః, క్షేత్రజః క్షేత్రజాతస్తు సగోత్రేణే తరేణవా. గృహేప్రచ్ఛన్న ఉత్పన్నో గూఢజస్తు సుత స్మృతః కానీనః కన్యకాజాతో మాతామహసుతో మతః” వ్యా— కానీనః కన్యకాయా ముత్పన్నః పూర్వవత్ సవర్ణాత్ సమాతామహస్య పుత్రః యద్యనూఢా సాభవేత్తదా పితృగృహ ఏవసంస్థితా. అథోఢాతదా వోఢురేవ పుత్రః యథాహమనుః॥ శ్లో॥ పితృవేశ్మనికన్యాతు యత్పుత్రంజనయే ద్రహః తంకానీనంవ దేన్నామ్నా వోఢుః కన్యాస ముద్భవమితి. అని ఉండుటచేత. నిచటఁగుంతి కన్యయై పుత్రునిఁ గని వివాహముకాక తండ్రియింటనే అట్లే ఉండిపోయినచో నట్టి కానీనుఁడు ఆమెతండ్రికే కానీన పుత్రుఁడగును. అట్లుకాక ఈమె పాండు రాజుచే వివాహము చేసుకోఁబడినది కావున నీకర్ణుఁడు పాండురాజుకు కానీన పుత్రుఁడు కావచ్చునని అభిప్రాయము.

31 క. పాంచాలరాజపుత్రియు
సంచితముగ నిన్నుఁ బొందు నాఱవ వరుసన్
సంచిత పుణ్యుఁడ వీ వొక
యించుకయును వేఱు సేయ కేతెమ్మెలమిన్.

ఇందు “నిన్నుఁ బొందు నాఱవ వరుసన్” అనగా నాఱవ భర్తగాననియే నాయర్థము. సంస్కృతభారతములో:— “శ్లో. రాజన్యా రాజకన్యాశ్చాఉపాదయాంత్వభిషేచనం, షష్ఠే త్వాంచతథా కాలే ద్రౌపద్యుపగమిష్యతి. అని యుండుటను బట్టి చూడఁగా పాండవులయిదుగురు ఆమె కిదివఱకు భర్తలై యుండుటచేత, నిచటఁ గర్ణునియందు షష్ఠభావమును బెట్టుటలో, నతనికి పతిత్వమందేనా యభిప్రాయము? అట్లే అయినచో నది సంభావితమేనా? శ్రీకృష్ణవాక్యము, అసంభావిత మగునా? ఒకప్పుడు కర్ణుడంగీకరించివచ్చినచో నట్లుఁజరుగునా. అది శాస్త్రీయ మగునా? అట్లు కానిచో శ్రీకృష్ణునిది మృషాభాషణము కాదా. “సకలలోకమహనీయుఁడును, ధర్మాధర్మనిర్ణేతయుఁ గాలోచితజ్ఞుఁడును అగు శ్రీకృష్ణుఁడు. లోకదృష్టిలో రాజనీతి ప్రకారము సంధికై వచ్చి ధర్మ్యములు, హితములు అగు సామవచనములఁ దగురీతిని శత్రుల బోధించినను వారు సమ్మతింప నందున దాన భేదములను గూడఁ బన్నఁదలచి కర్ణుని బిలచి నీకు రాజ్యాభిషేకము చేయింతునని దానోపాయమును కను పఱచి అదియును సంఘటింపనందున ద్రౌపది నిన్నాఱవ వరుస నొందు నని భేదోపాయమును గనుపఱచెను. నీతిజ్ఞులు శత్రువులయెడఁ జేయు భేదోపాయము కపటగర్భిత మయియే యుండును. అట్లు కానిచో శత్రువులు భేదింతురా? రాజనీతి

కది దోషముకాదు. కావున నిట్టి భేదోపాయములో కాలోచితజ్ఞుఁడగు శ్రీకృష్ణుఁడు పలికినది మృషయైనను అదిదోషముకాదని తెలియఁదగును. ఇట్లె క్షీరాబ్ధి మథనానంతరమున అమృతమునకై దేవదానవులు పెనుగులాడుచుండ భగవంతుఁడు మోహినీరూపమును ధరించి అమృతమునుబంచి యిచ్చెదనని చెప్పి రాక్షసుల వంచించి దేవతల కమృతము నిచ్చివేయలేదా. సుందోపసుందులను రాక్షసులను స్త్రీరూపమున "బలాధికుని వరించెద" నని చెప్పి మాయచే వారిని వంచించి, నశింపఁజేయలేదా. మాయావంతులయెడ మాయజేయుట నీతిజ్ఞులకు ధర్మమేకాని దోషము కాదు. ఇంతియకాక. కొన్ని కార్యములలో మృషాభాషణము మృషకాదని కూడ విశేష శాస్త్రము చెప్పుచున్నందున శ్రీకృష్ణుఁ డట్లు చెప్పియుండును.

కర్ణుఁడు శ్రీకృష్ణునితో ---

42 క. మూత్రపురీషములు
గాత్రములం దింక వారు గౌరవ మెసఁగం
బుత్రుం డని సంవర్ధిత
గాత్రునిగాఁ జేసి రింతకాలము కూర్మిన్.

క. నేఁడింక నెఱిఁగి యెరువుల
వాఁడఁజూఁడీ యనుచు నేను వారిఁ దొలంగం
బోఁడిమి కాదే మదిఁ గడు
వాఁడి గలచె నాకు నకట! వారిజనాభా!

43 వ. వృద్ధోపసేవనంబును ధర్మసంవేదనంబునుం గలవాఁడ వని నన్ను నీవచెప్పితివి రాధయు నధిరథుండును నాకు జాతకర్మాది సమస్త సంస్కారంబులు నిజకులోచితంబుగా నాచరించి రట్టి తల్లిదండ్రులకుఁ బుత్రకృత్యంబులు నిర్వర్తింపక వారలం బాసి యేనువచ్చుట ధర్మంబగునే.

ఈమీఁది వాక్యములలోఁ దనను పెంచిన తలిదండ్రుల విడిచి వచ్చుటయే తనకు ధర్మవిరోధమని కర్ణుండు శంకించినాఁడు గాని ద్రౌపది తన్ను నాఱవవానిఁగాఁ బొందు నని శ్రీకృష్ణుఁడు చెప్పినదానికి "అది ధర్మమగునా?" అని శంకింపలేదు. అందుచేతనే ఆతఁడట్టిబుద్ధి చాపలముగలవాఁడని యూహించియే శ్రీకృష్ణుఁడతని ప్రలోభనమునకే అట్లు చెప్పెనని మన మూహింపవచ్చును. కర్ణున కట్టిదుర్బుద్ధి యెట్లనఁగా నాఁడు ద్యూతములో పాండవులోడఁగా ద్రౌపదిని సభకు రావించినప్పుడు వికర్ణుని వచనములు ప్రత్యాఖ్యానము చేయుచు ద్రౌపదిని గుఱించి "భార్యకు దైవాధిష్టితుండయిన భర్త యొక్కరుండ, యిదియనేక భర్తృక గావున బంధకి యనంబడును" అనుట వలననే యీ కర్ణుఁడట్టి అనుచిత బుద్ధిగలవాఁడయినట్లు తెలియవచ్చును. కాని యితర స్త్రీలకు పురుషుఁడొక్కఁడెట్లు దైవాధిష్ఠితుఁడో యీ ద్రౌపదికట్లే అయిదుగురు దైవాధిష్ఠితులు గావున నది దోషము కాదు. కర్ణుఁడాధర్మసూక్ష్మత నెఱుఁగనివాఁడని తెలిసియే శ్రీకృష్ణుఁడట్లు ప్రలోభమును గనుపఱచి యుండును.

44 తే. ధర్మతనయుండు దాను నాత్మజుఁడగుట
యెఱుఁగునేనియు సామ్రాజ్య మేల పూను
నట్టి ధార్మికుఁ డాధిపత్యంబు జేయ
వలవదే శాశ్వతమై యుండ వసుధ కెల్ల.

ఇందుఁదనను అన్నఁగా నెఱిఁగినచో ధర్మరాజు సామ్రాజ్య మేల పూనునని కర్ణుఁడు చెప్పెనుగదా. అయితే ధర్మరాజు రాజ్యమును

ష్ఠానుఁ గొనడని యా? యుద్ధము చేయుఁడని యా? కర్ణునిఅభిప్రాయము? తనను జ్యేష్ఠునిఁగాఁ దెలిసినచో ధర్మరాజు రాజ్యమొల్లకుండుట ధర్మమగును గాని తనకును, శ్రీకృష్ణునకును, తానే జ్యేష్ఠుఁడని తెలిసియు, ధర్మరాజు కట్టి ధర్మవిరోధము కలుగఁ జేయుట ఉచితమగునా? అట్టి ధార్మికుఁడనఁగా తనకంటె ధార్మికుఁడని యా? వసుధకెల్ల అనఁగా భూమికెల్లను ధర్మరాజున కాధిపత్యము సిద్ధించునా? ధార్మికుఁడనఁగాఁ దనంకటెనని కాదు. కౌరవుల కంటె ధార్మికుఁడనియుఁ దనరహస్యముఁ దెలిసినచో ధర్మరాజు యుద్ధముచేయుఁడనియు యుద్ధములేక తాను, కౌరవులును చావరనియుఁ దాము చావక ధర్మరాజుకు ధర్మవిరోధము లేకుండ రాజ్యము సిద్ధింపదనియును, ఒకప్పుడు సంధియైనను ధర్మరాజు కర్థరాజ్యము వచ్చునుగాని వసుధకెల్లను, ఆధిపత్యము సంభవింపదనియు, వసుధకెల్ల ననఁగా కురురాజ్యమంతకు ననియు. నీ రాజ్యమునకు కౌరవులకంటె ధార్మికుఁడగు ధర్మరాజే ఆధిపత్యము చేసినచోఁ దనకును,ఆతనికినిఁ గూడ, ధార్మికత్వము సిద్ధించును. మీఁదఁ గనబఱచిన రీతిని దనకు పోషకత్యాగము. ధర్మరాజుకు పరివేదనదోషమును లేకుండునటులను ఉభయులకును లోకమందు ధర్మము శాశ్వతమయి ప్రసిద్ధినొందుననియు, దూరదృష్టితోఁ జెప్పినట్టిదిగాఁ దెలియనగును.

యుద్ధము నిశ్చయించి శ్రీకృష్ణుఁడు చెప్పుట—

49వ. ఎల్లభంగులం బాండవుల గెల్తురది యట్లుండె నీవుపొమ్మిప్పుడుసుయోధ
నునకుఁ గురుభీష్ములకును మీకుం దోడువచ్చిన రాజులందఱకుఁ జెప్పుమిమ్మా
సంబుసౌమ్యంబై సమశీతోష్ణంబై పుష్పఫలోపేతంబును సమగ్ర ధాన్యాం
బుసులభయవసైంధవంబునునగుచు నొప్పియున్నయది యెనిమిది దివస

ములనమావాస్య వచ్చుచున్నయది పుణ్యదివసంబునాఁడు భేదసంబుగావల
యుననిఁ గానీమండు కమలనాభుని కిట్లనియె.

అనియున్నది ఇందు ఇమ్మాసమనఁగా నెద్దియో తెలియదు. సౌమ్యము, సమశీతోష్ణము సమగ్రధాన్యంబు “అనియిచటఁ జెప్పుటను రేవతినాడు శ్రీకృష్ణుని ప్రయాణమగుటను బట్టిచూడఁగానది కార్తిక మనఁదగినట్లున్నది. దినము నిశ్చయించుటకు దీనిలో చాలినంత ఆధారము కానరాదు. ముందు దీనిఁగూర్చి కొంత విచారింపఁబడును.” ఇచట నింకొక పెద్ద విషయము విచారింపవలసియున్నది అది యెద్ది అనగా.

ఇప్పటి న్యాయవాదులు కొందఱును విద్వాంసులు కొందఱును పాండవుల రాజ్యభాగ విషయములో “రాజ్యములు అవిభాజ్యములు, జ్యేష్ఠైకానుభోజ్యములు. కావున విచిత్రవీర్యుని రాజ్యమునకు, జ్యేష్ఠుఁడు ధృతరాష్ట్రుఁడు గావున, నాతఁడే రాజు కాని పాండురాజు రాజ్యాధికారియే కాకుండ నతనిపుత్రులగు పాండవులు రాజ్యభాగముఁ గోరుటయు దానికై శ్రీకృష్ణుఁడు సంధిఁ జేయఁబోవుటయు, నచటి పెద్దలు భీష్మాదులుకూడ భాగమియ్యవలయునని చెప్పుటయు, నిది అంతయును అసంగతమని పత్రికలలో వ్రాసియున్నారు. వీ రొకపక్షమువారు. మఱియొక పక్షమువారు ధృతరాష్ట్రుఁడు జాత్యంధుఁడుగావుననతఁడే రాజ్యానర్హుఁడని తలఁచి యే సత్యవతిమఱియొకపుత్రునిఁ బ్రసాదింపుమని వేదవ్యాస మహర్షినిఁగోరఁగా నట్లే ఆయన ప్రసాదింపఁ బాండురాజు జన్మించినవాఁడు గావునఁ బాండురాజే రాజ్యాధికారము గలవాఁడుగాని ధృతరాష్ట్రుఁడుగాఁడు” అనియును చెప్పుచు వివా

దము చేయుచున్నారు. వారు తమ తమపక్షములలోఁ గనుపఱచిన ప్రమాణము లెవ్వియనఁగా, మొదటి పక్షములో ధృతరాష్ట్రున కాపేరు, రాష్ట్రమును ధరించినవాఁడగుటను వచ్చినదనియు, పాండురాజు వేటకుఁబోయి నప్పుడు రాజ్యభారము ధృతరాష్ట్రుని యందే, యుండుటను, పాండురాజు శతశృంగమునఁ జనిపోయిన పిమ్మట నిశ్శంకముగా రాజ్యము ధృతరాష్ట్రునిదిగానే యుండుటను, వ్యాసులు మొదలగువారు ధృతరాష్ట్రునినే "రాజు, నరపతి, పృథివీపతి" అనుచునచ్చటచ్చటఁ బలుకుచుండుటను, రాజు మాత్రమే చేయఁదగిన అశ్వమేధములు ధృతరాష్ట్రుడు చేసినట్లు భారతములో నుండుటను, ఈ మొదలగు వానినిఁబట్టి ధృతరాష్ట్రుఁడే రాజుగాని పాండు రాజు కాఁడని మొదటి పక్షమువారు చెప్పునది. ఇఁక రెండవ పక్షములోఁ ధృతరాష్ట్రుఁడనునది రూఢిపదముకాని యౌగికము కాదనియు పాండురాజు వేటకుఁబోయినపుడు భీష్మ విదురుల సాహాయ్యమున రాజ్యభారమును ధృతరాష్ట్రుఁడు వహించిపాండురాజు చనిపోయిన పిమ్మట తానే రాజ్యమేలుటచే నంతమాత్రమున ధృతరాష్ట్రుఁడే రాజ్యాధిపతిఁ గాఁ జాలఁడనియు విచిత్రవీర్యుఁడు చనిపోయిన పిమ్మట కొంతకాలము భీష్ముఁడు రాజ్యము వహించినను అతఁడు ఎట్లు రాజ్యాధిపతి కాలేదో అట్లే పాండురాజు రాజ్యమునందు లేనికాలములో ధృతరాష్ట్రుఁడు రాజ్యమును వహించినాఁ డన్నంతమాత్రమున ధృతరాష్ట్రుఁ డేరాజ్యాధిపతి యని చెప్పునది చాలిన ప్రమాణము కాదనియు చెప్పుదురు. ధృతరాష్ట్ర పాండురాజుల జననములను బట్టి యీ రెండు పక్షములవారి వివాదమును కొంత మనము చర్చింతము. విచిత్రవీర్యుఁడు

సంతానము లేకపోఁగా భీష్ముని సమాలోచనమున సత్యవతి తన కోడండ్రగు విచిత్రవీర్యుని భార్యలు అంబికాంబాలికలయందుఁ బుత్రుల నపేక్షించి వేదవ్యాసుని బ్రార్థింప నా మహర్షి మొదల నంబిక యందు నియోగవిధిచేఁ బుత్రునిఁ బ్రసాదింప నుద్భవిల్లిన వాఁడు ధృతరాష్ట్రుఁడు. ఇతఁడు మాతృదోషమున జాత్యంధుఁడు కాఁగా అంబాలికయందుఁగూడ పుత్రునిఁ బ్రసాదింపుమని సత్యవతికోరఁగా నట్లేవేదవ్యాసు డనుగ్రహింప నామెయందుఁ బాండురాజు జన్మించిన వాఁడు. ఇతఁడును మాతృదోషమున, అనఁగా వెలవెలఁ బాఱుటను, వెల్లఁదనమునఁ బుట్టినవాఁడు. కాన పాండుఁడని అప్పుడే వ్యాసుఁడు నిర్దేశించి వెళ్లెను. సత్యవతి అంబికయందుఁ బుట్టినవాఁడు జాత్యంధుఁడగుటను మఱల నర్హుఁడగుపుత్రు నపేక్షించి వ్యాసులను కోరఁగా వచ్చిన ఆమహర్షిని జూచి అతని మునివేషమునకు రోసి అంబిక తనదాదినిపంప నామెయందుద్భవిల్లినవాఁడు విదురుఁడు. ఇట్లుండ రెండుపక్షములవారును జెప్పు యుక్తి ప్రమాణములను విచారింపవలయు.

ఆంధ్రమహాభారతమునందు—

ఆ. 5. వ. ఇట్లు బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజావృద్ధియు సస్యసమృద్ధియునగుచుండ నాంబికేయుండైన ధృతరాష్ట్రు రాజ్యాభిషిక్తుం జేసి భీష్ముండు దన కువిల్లును విదురుబుద్ధియును సహాయంబుగా రక్షించుచున్నంత. అనియుండుటచేత ధృతరాష్ట్రుఁడే పట్టాభిషిక్తుండైనట్లును.

వ. ధృతరాష్ట్రుండు యుధిష్ఠిరు యౌవరాజ్యధురంధరుఁగా నెఱిఁగి భీష్మవిదురులతో విచారించి యౌవరాజ్యాభిషిక్తుం జేసిన.

అనుటలో యుధిష్ఠిరుఁడు యౌవరాజ్యాభిషిక్తుఁడైనట్లును కానఁబడుచున్నందున కురురాజ్యాధిపత్యము ధృతరాష్ట్రునిదే.

కాని పాండురాజుది కాదని మొదటివారును. ధర్మరాజునకు యావరాజ్యాభిషేకము చేయుటవలనఁ బాండురాజు రాజ్యాధిపతి యగుటచే నాతని పుత్రుఁడగు ధర్మరాజునే ధృతరాష్ట్రుఁడు యావరాజ్యమం దభిషేకించినాఁడు గాని తనపుత్రుని దుర్యోధనుని అభిషేకింపలేదని రెండవ వారును చెప్పుచున్నారు. మఱియు,

ఆ 64. వ. ఒక్కనాఁడు ధృతరాష్ట్రుఁడు భీష్మవిదురద్రోణ దుర్యోధనాదులసమక్షంబునఁ పాండవులకిట్లనియె.

65 గీ. సర్వలోకసాక్షి యా కృష్ణుఁడు
సాక్షి గాఁగ మీకు సకల వృద్ధ
రాజు లొద్ద నర్ధరాజ్య మిచ్చితి పాండు
రాజు విభవ మెల్ల రమణఁ గొనుఁడు.
అని ధర్మరాజు నభిషిక్తుం జేసె. అని యున్నది.

ఇందు ధృతరాష్ట్రుఁడు పాండు పుత్రులకును తన పుత్రులకును గలవిరోధమును జూచి ధర్మరాజు, యావరాజ్యముకు తనపుత్రుఁ డోర్వలేమిని, దెలిసి వారితండ్రి యర్థరాజ్యమును వారికిచ్చి ఇంద్రప్రస్థమునకుఁ బంపినట్లున్నది. ఇట్లుండ సంస్కృత భారతమందు పాండు రాజునకే పట్టాభిషేకమైనట్లుండఁగా ధృతరాష్ట్రునకు పట్టాభిషేకము చేసినట్లు చెప్పినందున నన్నయభట్టుఁడును, పిమ్మట తమతండ్రి భాగము తమకిమ్మని, ధర్మరాజాదులు కోరి శ్రీకృష్ణుని సంధికి పంపినట్లు చెప్పినందున, తిక్కన సోమయాజియును బొరపాటుపడి సంస్కృతమునకు భిన్నముగాఁ దెనిఁగించినారని, యొకరు సోపపత్తికముగా వ్రాసినారు ఈ విరోధమును గురించి ముందాలోచింతము కౌరవ పాండవదాయ భాగవిషయములో, సంస్కృతభారతములో—

"శ్లో. భీష్మేణ విహితం రాష్ట్రే ధర్మచక్ర మవర్తత,
విచిత్రవీర్యంచ తదా బాల మప్రాప్తయౌవనం.
కురురాజ్యే మహాబాహు రభ్యషించ దనంతరం,
హంతే చిత్రాంగదే భీష్మో బావేభ్రాతరి కౌరవ.
పాలయామాస తద్రాజ్యం సత్యవత్యా మతే స్థితః,
విచిత్రవీర్య స్తరుణో యక్ష్మణా సమగృహ్యత,"
జగామాస్త మివాదిత్యః కౌరవ్యో యమసాదనం.

ఇట్లు విచిత్రవీర్యుఁడు సంతానములేకయే చని పోఁగా

శ్లో. తయోరుత్పాద యాపత్యం సమర్థోస్యాసిపుత్రక,
అనురూపం కులస్యాస్య సంతత్యాః ప్రసవస్యచ.
అని సత్యవతి వేదవ్యాసులను గోరఁగా

శ్లో. భ్రాతుః పుత్రాన్ ప్రదాస్యామి మిత్రా వరుణయోస్సమాన్
వ్రతంచరేతాం తేదేవ్యానిర్దిష్ట మిహాయన్మయా.
సంవత్సరం యథాన్యాయం తతశ్శుద్ధే భవిష్యతః

అనివ్యాసులు చెప్పఁగా సత్యవతి—

శ్లో. నద్యోయథా ప్రపద్యేత దేవీ గర్భంతథాకురు,
అరాజకేషు రాజ్యేషు ప్రజానాథా భవిష్యతి.

అని మరల వ్యాసులను గోరి, తనకోడలి నంబికను శుచిగా నుండునట్లు నియమించఁగా అట్లువ్యాసులును ఆమె ననుగ్రహించి పోవునపుడు.

శ్లో. నాగాయుత సమప్రాణో విద్వాన్ రాజర్షిసత్తమః,
మహాభాగో మహావీర్యో మహాబుద్ధి ర్భవిష్యతి.
కింతుమాతుస్స వైగుణ్యా దంధఏవభ విష్యతి,

అని చెప్పఁగా నట్టి యంధుఁడు కురువంశమునకు అనురూపుఁడు కాఁడని తలచి మరల సత్యవతి.

శ్లో. నాంధః కురూణాం నృపతి రనురూప స్తపోధన.
జ్ఞాతివంశస్య గోప్తారం పితౄణాంవంశవర్ధనం.
ద్వితీయం కురువంశస్య రాజానం దాతుమర్హసి.

అని కోరఁగా నందుకు వ్యాసులు సమ్మతింప తన రెండవ కోడలు అంబాలికను పూర్వమువలె సత్యవతిని నియోగింపఁగ నామెయందుఁగూడ. వ్యాసమహర్షి ప్రసాదించి పోవునపుడు.

శ్లో. వివర్ణా పాండుసంకాశా సమపద్యత భారత,
వ్యాస స్సత్యవతీపుత్ర ఇదం వచన మబ్రవీత్.
యస్మాత్పాండుత్వ మాపన్నా విరూపంప్రేక్ష్యమామిహ,
తస్మాదేష సుత స్తేవై పాండు రేవ భవిష్యతి.
నామచాస్యైతదేవేహ భవిష్యతి శుభాననే,

అని చెప్పిపోవునపుడు మొదటి కోడలు అంబికయందు బుట్టినవాఁడు పుట్టుగ్రుడ్డివాఁడగుటను, ఆమెకు మరియొకనిననుగ్రహించుటకు.

శ్లో. తం మాతా పునరేవాన్య మేకం పుత్రమయాచత,
తథేతిచమహర్షి స్తాం మాతరం ప్రత్యభాషత.

ఇట్లు అనుమతించి వ్యాస భట్టారకుఁడు మరల నంబికనను గ్రహింపఁబోవునపుడు ఆమె యాతని వికృత రూపమునకు రోసి తన దాదిని బంపెను, ఆమెయందుఁ బుట్టిన వాఁడు విదురుఁడు ఇట్లుండ, నాంధ్ర భారతములో నన్నయభట్టుఁడు, ధృతరాష్ట్రునికే పట్టాభిషేకమైనట్లు చెప్పినందున దానిని సమర్థించుటకై

"విచిత్రవీర్యుఁడు సంతానము లేక చనిపోయినందున అతని భార్యలందు ధృతరాష్ట్ర పాండురాజులు నియోగమునఁ బుట్టినవారు, అందు ధృతరాష్ట్రుఁడు పెద్దవాఁడు నియోగవిధిలో—

శ్లో. ఏకముత్పాదయే త్పుత్రం నద్వితీయం కథంచన,

అని రెండవవానికి నిషేధముండఁగా నట్టినిషిద్ధజన్ముఁడగు పాండుఁడు రాజ్యార్హుం డెట్లగును? అని మొదటి పక్షమువారు చెప్పుదురు. సంస్కృత భారతములో పాండు రాజుకే పట్టాభిషేకమైనట్లు చెప్పియున్నందున దానినే సమర్థించుటకై.

శ్లో. ధృతరాష్ట్ర స్త్వ చక్షుష్ట్వాద్రాజ్యం నప్రత్యపద్యత, అనియు,
నాంధః కురూణాం నృపతి రనురూప స్తపోధన,

అనియు నుండుటచేత ధృతరాష్ట్రుఁడు పుట్టుగ్రుడ్డివాఁడగుటను మఱియొక పుత్రునిఁగోరఁగాఁ బాండురాజు పుట్టినవాఁడుగావున.

శ్లో. ఏకముత్పాదయేత్.

అను నియోగవిధి అర్హుఁడగు నేకపుత్రుని పరముగా నన్వయించునని చెప్పి పాండుఁడే రాజ్యార్హుఁడని రెండవవారు చెప్పుదురు. ఈ రెండు పక్షములను మనము మధ్యస్థులముగా విచారింతము. నియోగశాస్త్రముఁ బిమ్మట నాలోచింతము, భరత వంశపు రాజుల చరితమునకు ఆ భరత వంశోద్ధారకుఁడును భారత కర్తయునగు వ్యాసభట్టారకుఁడు చెప్పినవి ముఖ్యప్రమాణము. కాఁగా భారతములో నెల్లచోట్లను కౌరవ పాండవుల నుభయులను భాగము పుచ్చుకొమ్మని వ్యాసభట్టారకుఁడు విధించి చెప్పుట వలనను కురువృద్ధులగు భీష్మ బాహ్లీకాదులును అట్లే సమ్మతించుటవలనను ధృతరాష్ట్రుఁడు నిర్వివాదముగా ముందొకసారి

వారి యర్ధరాజ్యమును వారికిచ్చియుండుట వలనను. ఉభయులును రాజ్యార్హులే కాని వేఱుకాము భారతమట్లున్నను, ధర్మశాస్త్ర ప్రమాణములు విచారింప వలయునన్నచో వానినిఁగూడ విచారింతము, మనుస్మృతి నవమాధ్యాయము నియోగవిధి-౫౯వ. శ్లో.-

శ్లో. దేవరాద్వాసపిండాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా,
ప్రజేప్సితాధిగంతవ్యా సంతానస్య పరిక్షయే.

ఇందు సంతానాభావమందు స్త్రీనియోగింపఁబడి దేవరునివలనఁ గాని సపిండుని వలనఁ గాని యిష్టమగు సంతానమును బడయవలయునని కానఁబడుచున్నది. సమ్యఙ్నియుక్తయా యనుటలో నెవరిచే నియోగింప బడవలసినది మూలమందుఁ జెప్పబడలేదు. "పత్యాది గురుజన నియుక్తయా" అని వ్యాఖ్యానము. ప్రజేప్సితా అనుటలో నీప్సిత మెవ్వరికో చెప్పఁబడలేదు. కాని నియోజకు లెవ్వరో వారికేయని "నియుక్తయా" అనువిశేషణ సామర్థ్యమువలన దెలియఁదగియున్నది. ఇచట నియోక్త్రి సత్యవతి. ఆమె కీప్సితప్రజ యెట్టిదని విచారింపఁగా వంశాభివృద్ధికరమును వారుక్షత్రియులగుటచే రాజ్యార్హమును అగునట్టి సంతానమని చెప్పఁదగియున్నది. ఇట్లుండ. మ. ౬౦ శ్లో.

శ్లో. విధవాయాంనియుక్తస్తు ఘృతాక్తోవాగ్యతోనిశి.
ఏకముత్పాదయేత్పుత్రం నద్వితీయం కథంచన.

ఇందుపురుషుఁడుకూడ, నియుక్తుఁడై ఒక్కపుత్రునుత్పాదింపవలయునన్నట్లు కాన్పించుచున్నది. ఇందువలన ఒకనియోగములో ఒక్కనినే కాని పెక్కండ్ర నుత్పాదింపఁగూడదనియును, తేలుచున్నది.

శ్లో. మ. ౬౧. ద్వితీయ మేకే ప్రజననం మన్యంతే స్త్రీషుతద్విదః

ఇందు మఱికొందరాచార్యులు (ధర్మశాస్త్రప్రవక్తలు) రెండవ సంతానమును గూడ నివ్వవచ్చునని చెప్పినట్లు కానఁబడుచున్నది. దీనినిఁబట్టిచూడఁగా నియోగించువారు ఒక్కపుత్రుఁడు చాలునని తలఁచి యొక్క పర్యాయము నియోగించినచో నియోగింపఁబడినవాఁడు అట్లే ఒక్కనిమాత్రమే యుత్పాదింపవలయు, రెండవవాని నుత్పాదింపరాదనియు. నియోక్తలు అనేకపుత్రులను కోరి యనేకవారములు ప్రత్యేకము, మరల మరల నియోగింపవలయును గాని అట్లుకాక మొదటి ఒక్కనియోగమును బట్టియే అనేకుల నుత్పాదింపఁగూడదనియు ఏకముత్పాదయేత్ అను వచనమునకు అర్థమగుటనునది సామాన్యశాస్త్రమగుచున్నది.

కావునఁ బ్రకృత మందు సత్యవతి.

శ్లో. తయో రుత్పాద యాపత్యం సమర్థోహ్యసి పుత్రక,
అనురూపంకులస్యాస్య సంతత్యాః ప్రసవస్యచ.

అను వచనప్రకారమున కురుకులాభివృద్ధికరమును, కులమునకు అనురూపమును, అగు సంతానమును, ఆ కోడండ్రిరువురయందును గలిగింపుమని వ్యాసభట్టారకుని కోరుటచేత, సత్యవతి కీప్సితప్రజ యిద్దఱియందును, కులాభివృద్ధికరము, రాజ్యార్హమును, అగునట్టిదియే కావున "ఏకముత్పాదయేత్" అను సామాన్యశాస్త్రమిచట వర్తింపదు. ఆవచనము ఒక స్త్రీయందొక్క సంతానమును గోరి యొక్కమాఱు నియోగించునట్టి విషయములో సావకాశము. "ద్వితీయమేకే ప్రజననం" "ప్రజేప్సితాధిగన్తవ్యా" అనునవి నిరవకాశములు "సావకాశాన్నిరవకా

శంబలీయః" అనున్యాయమున నిరవకాశ శాస్త్రదృష్టిచే "తయోరుత్పాదయాపత్యం" అని ద్వివచనముండుటను, సత్యవతి కిద్దఱియందును సంతానమిష్టము. "భ్రాతుఃపుత్రాన్ ప్రదాస్యామి" అని బహువచన ముండుటను వ్యాసభట్టారకుఁడు "ఏకముత్పాదయేత్" అను శాస్త్ర ముత్సర్గశాస్త్రము కావుననే బహుపుత్రుల నిచ్చెద నని చెప్పి అట్లుచేసెను. అందువలన నిచట విచిత్రవీర్యుని భార్య లిద్దఱగుటను వారియందుఁ గలుగునట్టి సంతానము వంశవృద్ధికరము, రాజ్యార్హము అగు నట్టిదియే సత్యవతికోర్కి యగుటను, దెలిసియే వ్యాసమహర్షి "భ్రాతుః పుత్రాన్ ప్రదాస్యామి" "వ్రతంచ రేతాం తేదేవ్యౌ" అని యిద్దఱి నుద్దేశించి వారియందు విచిత్రవీర్యునికి అనేకక్షేత్రంబుల నిచ్చెదనని చెప్పి అట్లుత్పాదింపగాఁ బుట్టిన ధృతరాష్ట్రపాండురాజులు మాతృభేదమునుబట్టియు సత్యవతి యుద్దేశమునుబట్టియు, నుభయులును, రాజ్యార్హులనియే చెప్పవలయును. "ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వాద్రాజ్యం నప్రత్యపద్యత" అనునది అతనికి రాజ్యమందసామర్థ్యమును దెలియఁజేయునుగాని అనర్హతను చెప్పునది కాదు. అందుచేతనే భీష్ముఁడు పాండురాజు నభిషేకించినాఁడు ధృతరాష్ట్రుఁడు జాత్యంధుఁడయ్యును వారిరువురకును రాజ్యమందు స్వత్వభ్రంశము లేదు. మనులమతమున నియోగమంగీకార్యమై యుండను, ఆ నియోగము నియోక్తల ఇచ్ఛాధీనమయియుండఁగను, అదిచాతుర్వర్ణ్య సామాన్యమైయుండుటను. దాని ముఖ్యఫలము వంశాభివృద్ధియే, రాజులలో గౌణఫలము రాజ్యపాలనమును అయియుండును. ఇచట నుభయాభిప్రాయములలోను సత్యవతికోరుటచేత, ధృతరాష్ట్ర పాండురాజు లిద్దఱునుగూడ

రాజ్యస్వత్వముగల వారేకాని, లేనివారు కారు. అందుచేతనే నిర్వివాదముగా వ్యాసనారదాది మహర్షులును ధర్మతత్త్వజ్ఞులగు భీష్మవిదురాదులును వారిరువురకును భాగము నిర్ణయించి చెప్పుచుండఁగా శ్రీకృష్ణభగవాను లట్లే చేయఁదలచి ప్రవర్తింపఁగా కౌరవులుకూడ లోభబుద్ధిచే భాగమును హరింపఁదలంపుఁగలవారుగాని, వారికి భాగము లేదన్నవారు కాకుండఁగా, నింతియె కాక, యొకసారి ధృతరాష్ట్రుఁడు వారి కర్ధరాజ్యమిచ్చి యుండఁగాను పరస్పరప్రతిపక్షులగు కౌరవపాండవులకే రాజ్యానుభవములో వివాదముకాని, స్వత్వములో వివాదము లేకుండఁగా మనకేల యీ శుష్కవివాదము ధర్మశాస్త్రాభిప్రాయమునఁగాని పెద్దల అభిప్రాయమునఁగాని ఉభయపక్షములవారి అభిప్రాయమునఁగాని దాయస్వత్వములో వివాదము కాన్పించదు, ధర్మశాస్త్రమన్ననో వ్యాసాదులుచెప్పిన దానికంటె నింకెద్ది? అగును, ఆచారమన్ననో భీష్మాదులకంటె నింకెవ్వ రెఱుఁగుదురు. రాజ్యార్థము వివాదముఁ వారికట్లుండఁగా నిప్పటి న్యాయవాదులు రాజ్యములవిభాజ్యములని చెప్పుటనుబట్టి, యాపదార్థములకు వివాదముఁ గల్పించుకొని పరస్పరాధిక్షేపములకుఁ బాత్రములగుట యనవసరముగాఁ దెచ్చికొనినట్లు కాన్పించుచున్నది. అప్పటిపెద్దలు వారికి సంధి (రాజీనే) కోరిచెప్పిరి. కాఁబట్టి యిప్పటివాదులుగూడ రాజీనొందుటయే యుచితమని తోఁచుచున్నది.

ఇంక రాజ్య మవిభాజ్య మను దానికభిప్రాయ మిట్లు కావచ్చును, రాజ్య మేకాధిపతికమయి యున్నచోఁ బ్రజల కాతని యెడల భయగౌరవాతిశయములు కలిగి యుండును, ప్రజలయం దాతనికి దండప్రచారపాటవముఁ గలిగియుండును. అట్లు కాక

రాజ్యము భిన్నభిన్నముకాఁగా నొక మహానది యనేకములు కాల్వలయి దాని గాంభీర్యము చెడి యెల్లవారికిని సులభముగా లంఘ్యమయినట్లు ఆ యాధిపత్యముకూడ నల్పమగుటచేఁ బ్రజలకు నూనసీయము కాక గాంభీర్యము చెడును. అందువలన నట్టి యధిపతికిఁ జెల్లఁదగు దండప్రచారము సరిగాఁ జెల్లనేరదు. దండప్రచారము చెల్లనివాఁడు ప్రజలవృత్తి న్యాయ్యమై జరుగనేరదు. అందువలన, లోకమున కనర్థములు మెండుగా సంభవించును. ఇట్టి యభిప్రాయముచేతనే రాజ్య మవిభాజ్యమని తలంచి యుందురు. ధర్మశాస్త్రములలో విభాగము కాన్పించక పోలేదు. అవి భాజ్యమను తలంపును అల్పరాజ్య విషయముగాని యిట్టి అసంఖ్యాత వైశాల్యముగల కురురాజ్య విషయముకాదు. అయినను పూర్వరాజులు విభాగముచేసికొనక యుండుటయును గూడ ఆకాలమున, నెల్లవారును ప్రాయికముగా సౌభ్రాత్రము గలవారై యుండుటను వారు వివాదము చేసికొనక రాజ్యమందేకాధిపత్యమునే యొప్పికొని తక్కిన సోదరులు పెద్దవాని యను మతిని రాజ్యసుఖములను మాత్రము తాముగూడ ననుభవించుచు నాధిపత్యమును పెద్దవానియందే యంగీకరించుట చేత నయియుండును. ఇట్టి సౌజన్యము రాజులలోనే కాక బ్రాహ్మణాది గృహస్థ కుటుంబములలోను కొన్ని చోట్ల రెండుమూఁడు తరముల వరకును విభాగములేక యుండుట యిప్పుడును కాన్పించుచున్నది. ఈ కురురాజ్య మందును ధృతరాష్ట్ర పాండురాజులకు అట్టి సౌభ్రాత్రముండుట చేతనే పాండురాజుకు మొదట పట్టాభిషేక మయి నప్పుడు ధృతరాష్ట్రుఁడుగాని, పాండురాజు రాజ్యమందు లేని కాలములో

ధృతరాష్ట్రుఁడు రాజ్యాధిపత్యమును వహించుటకు పాండురాజు గాని, వివాదము చేసికొనలేదు. ఇప్పుడు కలిప్రవేశ మగుటను, ధార్తరాష్ట్రపాండవుల కట్టి సౌభ్రాత్రము లేనందున వీరికి వివాదము కలిగినది. అందుచేతనే, ధృతరాష్ట్రుఁడు జీవించియున్నవాఁడగుటను, ధృతరాష్ట్ర పాండురాజులను బట్టియే, రాజ్యవిభాగము చేయవలసి వచ్చినది. ఇదిగాక పూర్వమిక్ష్వాకు వంశపురాజులలోఁ గొందఱు సోదరులు విభాగము చేసికొనినట్లు రామాయణ ముత్తరకాండలో కాన్పించుచున్నది. గ్రంథవిస్తరమగు నని వ్రాయలేదు. ఇఁక ధృతరాష్ట్ర నామసార్థక్యమును కొంతవిచారింతము. ధృతరాష్ట్రుఁడనునది రాష్ట్రముధరించినవాఁడని మొదటిపక్షము వారి వాదము. అయితే యీపేరాతనికి పుట్టిన పిమ్మటనే వచ్చినదా? రాజ్యమును ధరించిన పిమ్మటనే వచ్చినదా? పిమ్మట నయినచో వారి వాదముకు కొంత అవకాశ ముండవచ్చును గాని "ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత, అను శ్లోకము వలన ఆ పేరాతనికి రాజ్యమును ధరించుటను స్థిరపఱుపఁజాలకపోవుట మాత్రమే కాదు అతని కా కారణము చేతనే రాజ్యప్రాప్తియే లేనట్లు చెప్పఁదగియున్నది. కావున, యుధిష్ఠిరుఁడు, సహదేవుఁడు, దుర్యోధనుఁడు, సుయోధనుఁడు, దుశ్శాసనుఁడు, అను నామము లెట్టివో యిదికూడ నట్టిదేయని చెప్ప రెండవపక్షము వారి వాదము కవకాశము కలుగుచున్నది. కాని విచారింపఁగా ధృతరాష్ట్రనామమున కొకరీతిని వ్యుత్పత్తి సిద్ధింపవచ్చును. ఎట్లనఁగా కురురాజ్యము విచిత్రవీర్యునితోఁ, నంతరింపఁనుండగా వ్యాసమహర్షి ప్రసాదమున, మరల కురుకులమును రాజ్య

మును ఉత్పన్నము కాకుండ నిలిపినవాఁడగుటను, ఆ పేరుపుట్టినతోడనే, ఆతనికి వచ్చినదని చెప్పుట యుచితము. ఈపక్షములో ధృతరాష్ట్రుఁడు రాజ్యము ధరించినను ధరింపకున్నను కురువంశము, రాజ్యమును ఉత్పన్నములు కాకుండ వంశకర్తయగుటచేతను అతఁడు కాకున్న నతని పుత్రులయిన ధరింపఁగలవారుగావున కురురాజ్యము కురువంశాన్యాధీనము కాకుండ నిలిపినవాఁడు కావుననే ధృతరాష్ట్రుఁ డని సిద్ధింపవచ్చును. కావుననే ధృతరాష్ట్రునికిగాని, పాండురాజునకు గాని "రాజు నరపతి పృథివీపతి మొదలగు పదములు వాడుటలో నొక తప్పిదముగాని, విశేషముగాని లేదు. ధృతరాష్ట్రుఁ డశ్వమేధములఁ జేయుటఁ గుఱించి" సంస్కృతభారతములో—

శ్లో. తస్య వీరస్య విక్రాన్తై స్సహస్రశతదక్షిణైః,
అశ్వమేధశతై రీజే ధృతరాష్ట్రో మహామఖైః" అనియు,

ఆంధ్రభారతములో—

42. చ. వినుతయశుండు పాండునృపవీరుఁడు దిగ్విజయంబు సేసి పెం
పునఁ గొనివచ్చి యిచ్చిన యపూర్వమహాధనరాశి పేర్మి వా
రని విభవంబుతోడ ధృతరాష్ట్రుఁడు సేసె శతాశ్వమేధముల్
దనరఁగ భూసురేశులకు దక్షిణ లిచ్చి యథోచితంబుగన్.

అనియు నున్నది. ఈ రెంటివలనను, పాండురాజు తాను దిగ్విజయము చేసి తెచ్చిన ధనములతోఁ దనయన్న ధృతరాష్ట్రునిచే నశ్వమేధములు చేయించినట్లు తెలియఁబడుచున్నది. ఇదియును వారిరువురకు గల సౌభ్రాత్రమును, ధృతరాష్ట్రుని అశక్తతను, పాండురాజు రాజ్యశాసనమునును తెలియఁజేయును.

ఇందొక విశేషము తోఁచుచున్నది. వివాహము, యాగము, రాజ్యపాలనము, నివి జ్యేష్ఠు నతిక్రమించి కనిష్ఠుఁడు చేయరాదు. వారిలో జ్యేష్ఠుఁ డనర్హుఁడై తాను వానియం దిచ్ఛవిడిచికొని, కనిష్ఠునకు, అనుజ్ఞ నిచ్చినచో గనిష్ఠుఁడు చేసికొనవచ్చును. అందువలన నవి యైచ్ఛికము లయి యున్నవి. కాఁబట్టి ధృతరాష్ట్రుఁడు జ్యేష్ఠుఁడు గావున, నతనికి నుపనయన వివాహాది స్మార్తకర్మలు జరిగియుండుట, నిర్వివాదమే కదా? శ్రౌతకర్మలనుగూడ నాతనిచే జేయింప నభిప్రాయము కలవాఁడై పాండురాజు అట్లు చేయించినవాఁడు. రాజ్యమును కూడఁ దానే వహించినవాఁడయ్యును పెద్దవానియందలి గౌరవముచేఁ బ్రభుత్వ మతనియందుంచినట్లు తనకృత్యమంతయు, నతనికి నివేదించుచుండువాఁడు.

ఇంతమాత్రమున ధృతరాష్ట్ర పాండురాజులలో నొకరికి రాజ్యమందు స్వత్వమును ఒకరికి అస్వత్వమును సిద్ధింపదు.

అశ్వమేధమును చేయువాఁడు రాజే. అనునది క్షత్రియజాతినిఁ దెలియఁజేయుటకే చాలినట్లున్నది. కాని రాజ్యాధిపత్యము నిచ్చునట్టిదిగా నుండలేదు. పేరుమాత్రమే ధృతరాష్ట్రునిది కాని అట్టి యోగ్యత పాండురాజుది గానే, ఆ యశ్వమేధ కర్తృత్వము తెలియజేయఁ జాలును కావున ఆపక్షము వారికది బొత్తిగా సాధకము కాదు. ఇంకొకటి మాత్రము శంకింతురేమో ఇప్పటికి దాని నెవ్వరును ఉదహరింపలేదు గాని, ముందెవ్వరైన నట్టివాదమును, చేయుదురేమో యని దానిని మొదలనే విచారించుట యుచితము. ఎట్లనఁగా, కౌరవులు ద్యూతకాలమందు పండ్రెండు సంవత్సరము రణ్యవాసమును, ఒక సంవత్సర మజ్ఞాత వాసమును పణముగా నిర్ణయించు కొనుట

కభిప్రాయ మాలోచింపఁగా నిప్పటి న్యాయశాస్త్రములలో, పం
డ్రెండు సంవత్సరములకు కాలదోషము పట్టుననియును అంత
వఱకు నొకరిసొత్తు మఱియొక రనుభవించినచో సొత్తుగల వారికి
కాలదోష శాస్త్ర ప్రకారము సొత్తునందు స్వత్వము చెడును
గావున నట్లు పాండవులకు స్వత్వభ్రంశమును జెప్పఁదలచి వా
రట్టి సమయమునిర్ణయించినారని యూహింతురు. కానిఅది సరి
అయినదికాదు. ఏ వ్యవహారములోనైనను అవధి కాలము (వా
యిదా) అతిక్రమించిన పిమ్మట పండ్రెండు సంవత్సరములు కా
లము కావున నది అవి చారరమణీయము. ఇంతియెకాక ఇప్పటి
న్యాయశాస్త్ర మెట్లున్నను మన్వాది స్మృతులలో భూ విషయ
ములో నఱువది సంవత్సరములు నిర్వివాదముగాఁ బైవారాక్ర
మించుకొని అనుభవింపఁగా పిమ్మట కాలదోషము చెప్పఁబడి
నది. మధ్యమధ్యను వివాదము జరుగుచున్నచో నెన్నఁటికిని కాల
దోషము లేదనియును కూడఁ జెప్పఁ బడినందున నట్టి దోష
మిచ్చుట లేదు. కాని యింకొకటిశంకింతు రేమో? ద్వితీయద్యూ
తములో కాలమును పణముగాఁ జేసికొని నారుగాని రాజ్య
మును కాదు. ఆ కాలము పదుమూఁడు సంవత్సరములు. ఆ మ
ధ్యను పాండవులు వివాదముచేసినవారు కారు. ఆ కాలములో
పాండవుల రాజ్యము నెవ్వరనుభవింప వలసినది నిర్ణయించుకొని
నట్లు ఈ యాంధ్ర భారతములోఁ జెప్పఁబడలేదు. అందువలన
దానిని కౌరవులు నిర్వివాదముగా ననుభవించిన వారు కావున,
నిచట కాలదోషమని. కాని యదియును సరిపడదు మీఁదఁగనఁ
బఱచిన ప్రకారము అఱువది సంవత్సరముల వఱకును కాలదో
షములేదని కాని, లేక “శ్లో” అవిశుద్ధాగమో భోగః ప్రా

మాణ్యాం నైవగచ్ఛతి అను వచనప్రకారము అపరిశుద్ధాగ
మముగల అనుభవము, ప్రమాణము, కాదని కాని, నిర్వివాద
ముగా ననుచోట వాదుల సమక్షమందు వారి వివాదము లే
కుండఁగా, ననుభవమని దానితాత్పర్యము, కాని పరోక్షమందు
కాదు గావున, అందువలనగాని, యెట్లయినను పాండవుల స్వత్వ
ము చెడలేదని తెలియవలయును. ఇంక సంస్కృత భారతము
లో నీ యాంధ్రభారతముకు గల విరోధమును గుఱించి కొంత
విచారింతము.

ఈ యాంధ్రభారతములో సంస్కృత భారతముకు భిన్న
ముగా కొన్నికథాంశములు చెప్పఁబడుట సత్యమే. వానిలో
సంస్కృతమందు పాండురాజుకు పట్టాభిషేకము చెప్పఁబడి
యుండఁగా నీయాంధ్ర భారతములో ధృతరాష్ట్రున కయినట్లు
చెప్పుటచే నన్నయ భట్టుఁడీ విషయములోఁ బొరపాటు పడినట్లు
మహారాజశ్రీ అనంతాచార్యుల వారు తమ వైజయన్తి ప
త్రికలో వ్రాసియున్నారు, కాని అది అంతగాఁ బొరపాటు కా
న ట్లూహింపవచ్చును. నన్నయ భట్టుఁడు సంస్కృత భారతకర్త
యగు వ్యాస భట్టారకుని వచనముకు వేఱుపడినను అభిప్రా
యమునకు వేఱుపడినవాఁడు కాఁడు. వ్యాసభట్టారకుఁడు పాండురా
జుకు పట్టాభిషేకము మాత్రము చెప్పినను ఆ పట్టాభిషేకఫలము
రాజ్య స్వాతంత్ర్యమును ధృతరాష్ట్రుని యందే చెప్పుచు ధృత
రాష్ట్ర పాండురాజులుభయులకును భాగమును విధించుచునే
యెల్లచోట్లను చెప్పుటచేత ధృతరాష్ట్రుఁ డంధుడగుటను పట్టాభి
షేకోత్సవ మున కనురూపుడు కానందున పాండురాజుకు ప
ట్టాభిషేకము చేయించియు, వారిరువురకును రాజ్యస్వత్వము

నూహించియే, యభిషేకమనునది యొకశిష్టాచారప్రాప్తమయిన ఉత్సవముగావున, నది యొక యుత్సవమే, కాని రాజ్యస్వత్వమునకు నిబంధనము కాదను, వ్యాస భట్టారకాభిప్రాయమును, దెలిసికొని అది మనకు స్పష్ట మగునట్లు ధృతరాష్ట్రున కభిషేకమును తాను చెప్పినను, వారలుభయులకును భాగ మొప్పినవాఁడు కావున, యథాశ్రుత విరోధముల తద్గ్రంథమునకు కాన్పించినను వాస్తవాభిప్రాయమున నది విరోధము కాదని యట్లు చెప్పియుండును.

ఇది యిట్లు సమాధానమునకు శక్యమగును గాని, ఈ విషయములో నింకొకటి విచారింపవలసియున్నది. సంస్కృతములో "ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వాద్రాజ్యం నప్రత్యపద్యత" పారశవత్వాద్విదురో రాజా పాండుర్బభూవహ. ధృతరాష్ట్రుఁడంధుఁడగుటను విదురుఁడు శూద్రాపుత్రుఁడగుటను పాండురాజే రాజ్యము నొందినాఁడని కాన్పించుచున్నదికదా? ఇచటవిచిత్రవీర్యునికి ఔరసపుత్రులు లేనందున, నాతని క్షేత్రములందు, క్షేత్రజులను కోరఁగా ధృతరాష్ట్ర పాండురాజులు పుట్టినవారు. మనుస్మృతి నవమాధ్యాయములో దాయభాగ విషయములో శ్లో. పుత్రాన్ ద్వాదశ యానాహ నౄణాం స్వాయంభువో మనుః, తేషాం షడ్బంధుదాయాదాః షడదాయాదబాంధవాః. అని ద్వాదశవిధపుత్రులను చెప్పుచు నందులో "శ్లో" ఔరసః క్షేత్రజశ్చైవ దత్తః కృత్రిమ ఏవచ గూఢోత్పన్నో పవిద్ధశ్చదాయాదా బాంధవాశ్చషట్. అని క్షేత్రజులు దాయాదులుగాఁ జెప్పిరి. ఇచట ధృతరాష్ట్ర పాండురాజు లుభయులును క్షేత్రజులు గావున ధృతరాష్ట్రునకు భాగప్రసక్తి కలిగి, యతఁడంధుఁడగుటచే రాజ్య

వహాన శక్తుఁడు కాఁడని, పాండురాజు రాజ్యమును, పొందునట్లు చెప్పుట. ఉచితమగును, కాని విదురుఁడు విచిత్రవీర్యునికి క్షేత్రజుఁడు కానందున అతనికి రాజ్యభాగ ప్రసక్తియే లేకుండఁగా ధృతరాష్ట్రునితో సమముగా నిషేధకారణముగా నతని పారశవత్వము నుడ్గడించుట కభిప్రాయమేమి? ఇచట విదురుని జననమును బట్టి విచారింతము—

సత్యవతి అంబికయందే మఱియొకనిఁ గోరుటయు, అంబిక తనకు బదులుగాఁ దనస్థానమందుఁ దనకృత్యముకయి తన దాదినిఁ బంపుటయును ఆమెయును ఆ కృత్యములోఁ దనకు స్వీయోద్దేశము, ఫలమును, లేక అంబికకయియే ప్రవర్తించుటయు, సకలధర్మజ్ఞాన నిధియగు, వేద వ్యాసమహర్షి మొదల "భ్రాతుః పుత్రాన్ ప్రదాస్యామి" అని మువ్వురివలెను అనుజ్ఞ యిచ్చుటయు, సత్యవతియును మొదల "తయోరుత్పాదయాపత్యం" అని అంబికాంబాలికలయందు ఏకానేకసాధారణముగా నపత్యమును గోరుటయును అందుకు స్త్రీభేద మెట్లున్నను "భ్రాతుః పుత్రాన్ ప్రదాస్యామి" అని ఎవ్వతెయందు గలిగిన వారైనను విచిత్రవీర్యునకు వారు క్షేత్రజు లగుదురని తలఁచి అట్లు చెప్పుటయు, నంబికయు, దాదియును, ప్రవృత్తిలో వ్యత్యాసము గలవారయినను, దాని ఫలములో వ్యత్యాసము లేక యొక్కయుద్దేశమే, కలవారగుటయును, వీని నన్నిటినిఁ బట్టి చూడఁగా ఈ దాదియందును, విచిత్ర వీర్యుని క్షేత్రమను తలంపుతో ప్రవర్తించుట వ్యాసమహర్షిబీజోత్పన్నత ధృతరాష్ట్ర పాండు విదురలకు తుల్యమగుటను, విదురునికూడ క్షేత్రజునిఁగానే భావించి ధృతరాష్ట్రునకువలె, విదురునకుఁ గూడ

డా యాదత్వ ముండు నని యాశంకించువారికి, దానిని పోఁగొట్టుట కయియే "పారశవత్వాద్విదురో రాజ్యం నప్రత్యపద్యత" అని అతనికి రాజ్యభాగ సత్వమును నిషేధించి చెప్పియుందురు. మీఁదఁ గను పఱచిన హేతువులు, విదురునిను దాయస్వత్వముకు చాలకున్నను భాగప్రాప్త్యశంకకు చాలియుండును కావుననట్లు నిషేధించి చెప్పవలసివచ్చినది. కాఁబట్టి అది అసంగతము కాదు. ఇదియొక పక్షమున సమాధానము. ఇంకొక పక్షమునఁగూడ సరిపడవచ్చును. ఎట్లనఁగా ఈదాది అనునది విచిత్రవీర్యునికి అసవర్ణ క్షేత్రము కావచ్చును ఆకాలమున క్షత్రియులకును అను లోమక్రమమున వైశ్యశూద్ర స్త్రీలుకూడ వివాహమునకు అసజాతీయ భార్య అగుటను, ఆమెయందుఁ బుట్టిన వాఁడు. విచిత్రవీర్యునకు క్షేత్రజుఁడగును, గాని దాయార్హుఁడు కాటని నిషేధించిరని కావచ్చును.

సం॥ భా॥ ఆ॥ ప॥ ౧౦౯ అధ్యాయము. సత్యవతి భీష్మునితో చెప్పునపుడు, శ్లో. సనియుక్తో మయావ్యక్తం త్వయాంబాప్రతిమద్యుతిః, భ్రాతుఃక్షేత్రేషు కల్యాణ మపత్యంజనయిష్యతి. తవహ్యానుమతే భీష్మ నియతం సమహాతపాః। విచిత్రవీర్య క్షేత్రేషు పుత్రానుత్పాదయిష్యతి॥౧౦౭ అసజజ్ఞె విదురో నామ కృష్ణద్వైపాయనాత్మజః। ధృతరాష్ట్రస్యవై భ్రాతా పాండోశ్చైవ మహాత్మనః. అనియున్నది. ఇందువలన దాదికూడ విచిత్రవీర్యునకు ఒకభార్య, విదురుఁడు, విచిత్రవీర్యునికి పుత్రుఁడును, అగుదురు.

పాండురాజు పాండుతను గుఱించి—

ఇతని పాండుత, ఆజన్మసిద్ధముగాని మధ్యను వ్యాధివశమున వచ్చినదికాదు. అది శ్విత్రమునుండ కుష్ఠమునుకాదు, ఈపాండుత సౌభాగ్యమయియె యుండును. కానిచో సౌందర్యప్రధానలగు స్త్రీలు గౌరాంగులు కనకాంగులు అని వర్ణించుటయును. అట్టి పాండుతకయి స్త్రీలు ప్రయత్నించుటయును, ఎందుకు? "సీతా లోధ్ర ప్రసవరజసా పాండుతా మానసేశ్రీః" అని కాళిదాస మహాకవి ప్రయోగములోఁ గాన్పించుచున్నది' ఆగంతుకోపాయము చేతనయినను, సంపాదింప నాశాస్యమై యున్న పాండుత, రోగవిశేషమనుట, యుచితముగా కనఁబడదు. అట్లే అయినచో సత్యవతి ధృతరాష్ట్రునిఁ గుఱించి వలె, నాతని గురించియు, నెందుకు శంకింపకుండును. మఱియుఁ గుంతి, తన స్వయంవరముకు వచ్చిన రాజుమండలిలో—

శ్లో. దదర్శ రాజశార్దూలం పాండుం భరత సత్తమం,
సింహాదర్పం మహోరస్కం వృషభాక్షం మహాబలం.
ఆదిత్యమివ సర్వేషాం రాజ్ఞాం ప్రచ్ఛాద్యవై ప్రభాః,
తిష్ఠంతం రాజసమితౌ పురందరమివాపరం.
పాండుం నరవరం రంగే హృదయే నాకులాభవత్,
తతః కామ పరీతాంగీ సకృత్ప్రచలమానసా,
వ్రీడమానా స్రజం కుంతీరాజ్ఞః స్కంధేసమాసజత్,

అని ఆతనినే ఎందుకు కోరికొనును కాఁబట్టి ఎట్లుచూచినను ధృతరాష్ట్ర పాండురాజు లుభయులును రాజ్య భాగార్హులే. కాని అపర్హులు కారు. అట్లుకాక సత్యవతీ వేదవ్యాస వచనములు ప్రమాణములు కావనిచెప్పి, ధృతరాష్ట్ర పాండురాజుల

జననములే నిషిద్ధములయ్యెను, వారిరువురకును, భాగము నిర్ణయించి చెప్పినవ్యాస నారదాదిముని వచనములును, ప్రమాణములు కావన్నచో, నీకురురాజుల చరితమే, యసాధారణమైనప్పుడు, వారి రాజ్యభాగము మాత్రము అసాధారణము కాకూడదా ? దాని కితర సామాన్యశాస్త్ర మెందుకు? కురువంశ రాజులకువలె, కురురాజ్య నియమమున్న వేలు" అని తలఁచియైనా యీ విషయములో మనము తృప్తి నొందుటమేలు. కాని వివాదము అనవసరము. ఇంతవఱకును ప్రసంగమున కౌరవ పాండవుల దాయ భాగమును గుఱించి విచారింపఁబడినది. ఇంక ప్రకృతమును అనుసరింతము.

కర్ణుఁడు శ్రీకృష్ణునితో మరల చెప్పుట.

53 వ. ఈ సమరసముద్రంబు గడవనీఁది నిన్నుం గనియెదఁ గాదేని నూర్ధ్వలోకంబునం గాంచెద. ఇందు యుద్ధసముద్రమును నిస్తరించి నిన్ను జూచెదననుసది తాను పాండవులను యుద్ధములో సంహరించి నిన్ను చూచి మాదలించెదనని, అవలేపగర్భితమైన, మాటయగును

శ్రీకృష్ణుఁడు హాస్తిపురమునుండి వచ్చి ధర్మరాజుతో —

83 వ. ఎవ్వరెంత సెప్పినను—నతం డశక్తదుర్జనత సేయంజూచిన నమానుషంబులగు వానింగొన్ని వెడమాయలంబన్ని పెక్కుశోకలం బోయితి—

ఇందు దుర్యోధనుని అశక్తి, దుర్జనతయు నెవ్వియనఁగా తానందుకు శక్తుఁడు కాకున్నను శ్రీకృష్ణులను గట్టింప ప్రయత్నించుట. అమానుషంబులగు వెడమాయలనగా విశ్వరూప ప్రదర్శనము.

భీష్ముఁడు దుర్యోధనునితో తనయుద్ధ నిర్ణయమును జెప్పుట.

152 ఆ. మున్ను కర్ణుఁడొండె నన్నొండెఁ గయ్యంబు
సేయఁబనుపు మిట్లు సేయువాఁడ
నైనఁ గాని సకలసేనాధిపత్యంబు
బూన నేరఁ జుమ్ము భూపతనయ.

ఇట్లు భీష్ములు చెప్పుటకు అభిప్రాయమేమి సర్వసేనాధిపత్యమిచ్చి, నన్నుఁగాని కర్ణునిఁగాని మున్ను పంపుమనుటవలన, తామిరువురును, కలసి యొకకాలములో, సర్వసేనాధిపత్య మొందుటకు ఒకరి యాధిపత్యమును, ఒకరు అంగీకరించు వారము కామనియు, ఒకరిని ముందు పంపుమని పర్యాయమును నిరూపించి చెప్పుటవలన, మొదటివారు జీవించియుండు వఱకును రెండవవారికి అవకాశము లేదు. కాఁబట్టి కిరీటికొకనికి నే నోర్వన్. అని మీఁద చెప్పుటవలన ముందు తాను యుద్ధమునకుఁ బోయినను అర్జునునిచేఁ దాను మృతినొందఁగాఁ గర్ణున కవకాశము గలుగును లేక కర్ణుఁడు ముందుఁబోయినను, అర్జునునిచేఁ గర్ణుఁడు చచ్చువాఁడను నిశ్చయముగలవాఁడేయగుటను, తనకునుపిమ్మట నవకాశము రావచ్చుననియు, నభిప్రాయమును, గూఢపఱచి కర్ణునియందలి ఈర్ష్యచే నట్లుచెప్పినదిగా అతత్వజ్ఞులకుఁ దోచునట్లు పలికియుండును. ఇందువలన నర్జునునకు జయము తప్పదని తోఁచఁగా నప్పుడైనను సంధికొప్పి కొనుదురేమోయను నభిప్రాయము గూడఁ గావచ్చును. భీష్ము లెప్పటికయినను సంధి కావలయునను అభిప్రాయముగల్గి యున్నందుకు నింకొక యుదాహరణమున్ను కలదు. యుద్ధములోఁ దాను పడినప్పుడు తన యొద్దకు కురుపాండవులందఱును వచ్చియుండ నప్పుడు తనకు తల

గడలు కావలెననియు, తన దప్పిదీర్చుకొనుటకు దివ్యోదకము కావలయు ననియునుకోరి అర్జునునిచే నట్టి అద్భుత కర్మచేయించి కౌరవులకుఁ జూపించుటకును నిదియే యభిప్రాయము.

భీష్ము లంబోపాఖ్యానమును చెప్పుట కభిప్రాయము తాను శిఖండివలన మృతినొందఁ గలవాఁడనని సూచించుటచే తనయినను దానికి దుర్యోధనుఁడు భీతినొందియైనా సంధి కొప్పికొనునేమో? అనియే కావచ్చును,

దుర్యోధనుఁడు ''పాండవుల వధించుట'' కెంత కాలము పట్టునని భీష్ముని అడుగుట.

403 ఆ. పాండవులకుఁ గలుగు బలము లన్నియుఁ జమ
యింపనీకు దినము లెన్ని పట్టుఁ
గురుఁడుఁ గృపుఁడు గురుతనూజుండు కర్ణుండు నెం
తెంత మానమున వధింతు రనఘ.

ఇందు దుర్యోధనుని ఆశాచాపలము, అవివేకమును తెలియఁబడును. అవివేకమెట్లనఁగా భీష్ములకు సర్వసేనాధిపత్యమివ్వఁగా నాతఁడొక్కఁడే పాండవబలము లెల్లఁజంపినచోఁ దక్కిన ద్రోణాదుల విషయములోఁ ప్రశ్నమెందుకు? లేక భీష్ములు పాండవబలముల జంపఁగలిగియు నుపేక్షించును, కాక వారిచే నోడునో చచ్చునో అనియా? అట్లే అయినపక్షమున ద్రోణాదుల విషయములోఁ గూడ నట్లేకదా అభిప్రాయము? అదియే, దుర్యోధనుని తలంపు అయినచో యుద్ధప్రయత్న మెందుకు? ప్రశ్నమెందుకు?

భీష్ములు బదులు చెప్పుట.

405 క. అనిఁ బాండవసేనలఁ జం
పను జెలుపను నేము పాలుభంగుల నీ కి
ట్లనుమానము వాయఁగ నడు,
గన తగుఁ గడు లెస్స యిందు గాక నరేంద్రా.

ఇందు భీష్ముఁడు దుర్యోధనుని ప్రశ్నమందలి అసందర్భమును కొంతపరిహసించి తమసామర్థ్యముల నడుగుటగా నమర్థించి ''అనుమానము వాయఁగనడుగన తగు'' అను దానివలన నీకు మా యెడలనుండు అనుమానము నీ మనమునందే పెట్టుకొని యూరకుండుటకంటె నడుగుటయే మేలు అయినదను అర్థము యథాశ్రుతముగాను, గూఢముగాను అడుగఁ+అలని కాఁగా అడుగుటకుమాత్రమే తగును కాని మేమట్లు చేయ శక్యము కాదు అను నర్థమును అగునట్లు పలికెను.

వ. అట్లే గురుకృపాశ్వత్థామ కర్ణుల నడుగఁగా వారు క్రమమున గురుఁడు నెలకనియుఁ గృపుఁడు రెండునెలలకనియు నశ్వత్థామ పదిదినములకనియుఁ గర్ణుఁడైదుదినముల కనియుఁ జెప్పఁగాఁ గర్ణునిఁ గుఱించి,

417 అనిప్రతిని జెప్పఁ గలకల నవ్వి గాంగేయుండు

అనియున్నది. ఇందుభీష్ముఁడు కర్ణునిగుఱించికలకలనవ్వుట కభిప్రాయమేమి? తమ అందఱికంటె శీఘ్రకాలములోఁజంపుచున్నందుకయితే నశ్వత్థామకూడ తమకంటె శీఘ్రముగాఁ బది రోజులలోననన్నందుకు నతని నవ్వకుండుటవలన నాతండంతకు తగియుండునుగాని కర్ణుఁడట్లు చేయఁజాలఁడు. మాటలుమాత్రము పలుకువాఁడని అభిప్రాయము.

418 చ. పలుకులకేమి యున్నియును బల్కనగుఁ మనరాజు నొద్ద మా
ర్పలికెడు వారు లేరు విను పాండవమధ్యము గాండివంబు దీ
ప్తులు మిఱిమిట్లు గొన్నకనుదోయి గుణ ధ్వని ప్రయ్యలైన వీ
నులు నయినన్ బలేబలుక నూల్కొనకుందువు సూతనందనా.

ఇందు "అర్జునుఁడు తటస్థించు వఱకునే కదా నీప్రతాపము" అని కర్ణుని యధిక్షేపమందే భీష్ముని యభిప్రాయము? "అట్లైతే తాముకూడ నర్జునుఁడు లేనిచోటనే తమ ప్రతాపమును జెప్పికొనిరికదా? అందుకు కర్ణునిమాత్రమే అధిక్షేపించు టెందుకు? మనరాజునొద్ద మార్పలికెడు వారు లేరు. అని అనెనుకదా? తానట్లు చెప్పుటయే మార్పలుకుటకదా? అనగామనరాజును మంత్రులును నీప్రల్లదనమును విని సహించువారే కాని నివారించువారుకారనియు, నేను దక్కఁజెప్పెడు వారులేరుకావున నేనే చెప్పెదననియు నీవు మాబోటి వారిమాటల కూఱకొనువాఁడవును కావనియును అధిక్షేపము.

రాజునొద్ద మార్పలికెడువారు లేరన్నందుకు ముందు రథికుల నిరూపించు ప్రసంగములో భీష్ముఁడు కర్ణుని అర్ధరథునిగా సోపపత్తికముగఁ దెలిపినందుకు కర్ణుఁడు మరలఁ దననే యర్ధరథుఁడనునప్పుడు రాజుగాని మంత్రులుగాని మాఱు పలుకలేదు కావునభీష్ముఁడట్లు పలికియుండును.

ప్ర క ట న.

ఈ పుస్తకము వలయువారు యీ క్రింది విలాసమునకు వ్రాసిన బడయఁగలరు.

జైసాని - నరసింహేశ్వర గుప్త
ఉత్తమ గ్రంథాలయము
145 శాలవీధి
చెన్నపురి.

END OF
TITLE